www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం

శాంతి యత్నాలను స్వాగతిస్తాం

చర్చలకు రానంటున్నది ఉక్రెయినే


'ఎక్స్'లో రష్యా విదేశాంగ శాఖ ట్వీట్

కాగితం ముక్కపై కొన్ని సంతకాలతో

యుద్ధాన్ని ఆపలేం: జెలెన్‌స్కీ ట్వీట్

పుతిన్ యుద్ధ పిపాసి అంటూ ఆగ్రహం

14





బుధవారం | 11-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 253 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 1.10 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రేవతి ఉ. 11.48 తదుపరి అశ్విని; వర్జ్యం: తె. 6.11 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.30, అమృతఘడియలు: ఉ. 9.34-11.03, తె. 3.14-4.43; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుడిసె కాదు.. యుద్ధ ట్యాంకు!

ఉక్రెయిన్ డ్రోన్లు, క్షిపణి దాడుల నుంచి తన యుద్ధ ట్యాంకుల రక్షణకు తిప్పలు పడుతున్న రష్యా

ప్లై వుడ్ షీట్లు, డ్రోన్ జామర్లతో కాపాడుకునే యత్నం

టీ 72, టీ90 యుద్ధ ట్యాంకులతో రష్యా తంటాలు

తాబేలు ట్యాంకులని ఎగతాళి చేస్తున్న ఉక్రెయిన్ సేనలు

మన వద్దా భారీగా టీ72, టీ90 యుద్ధ ట్యాంకులు

రష్యా అనుభవంతో భారత సైన్యం అప్రమత్తం

2030నాటికి టీ 72ల స్థానంలో 1770 ఎఫ్ఆర్‌సీవీలు!

14



ఇదేదో రైలు పట్టాల పక్కన పేదలు వేసుకున్న గుడిసె అనుకుంటున్నారా? కాదు.. రష్యా యుద్ధ ట్యాంకు. ఉక్రెయిన్ ప్రయోగిస్తున్న డ్రోన్లు, ట్యాంకు విధ్వంసక క్షిపణుల దెబ్బకు భయపడి రష్యా తన ట్యాంకులను ఇలా ప్లైవుడ్ షీట్లు, ఇనప రేకులు, డేంచలతో కదిలే గోదాములా.. గుడిసెలా మార్చేసింది.

సిరియాపై.. ఇజ్రాయెల్ ముప్పేట దాడులు



గోలన్‌హైట్స్‌లోని బఫర్‌జోన్‌లో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

కీలక వైమానిక స్థావరాల ధ్వంసం.. ఆయుధాగారాలపైనా ఏరియల్ బాంబింగ్

బఫర్‌జోన్‌లో భారీగా ట్యాంకులు.. డమాస్కస్‌కు 25 కి.మీ. దూరంలో ఐడీఎఫ్


ఖతార్, తుర్కియే, ఇరాన్ ఖండన.. సిరియాలో కొలువుదీరిన ఆపద్ధర్మ సర్కారు

మూణ్నెల్లపాటు అల్-బషీర్ సేవలు.. ఆ తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వం

డమాస్కస్/జెరూసలేం, డిసెంబరు 10: కల్లోలిత సిరియాలో తిరుగుబాటుదారులు ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వేళ.. ఇజ్రాయెల్ ముప్పేట దాడులు జరుపుతోంది. గడిచిన 13 ఏళ్లలో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూ.. దేశ పునర్నిర్మాణానికి సిరియా నేతలు పిలుపునిస్తుంటే.. ఇజ్రాయెల్ విధ్వంసానికి పాల్పడుతోంది. సిరియా అధ్యక్షుడు అసద్ ఆదివారం డమాస్కస్ నుంచి

మిగతా 14వ పేజీలో...

తైవాన్ తీరంలో 90 యుద్ధ నౌకలు!



తైవాన్ తూర్పు తీరంలో మోహరించిన చైనా యుద్ధ నౌక

చైనా దుందుడుకు చర్య

భారీగా నౌకల మోహరింపుతో ఉద్రిక్తత

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తైవాన్ ఆర్మీ వెల్లడి

తైపీ, డిసెంబరు 10: తైవాన్ సమీపంలో చైనా భారీగా యుద్ధ నౌకలను మోహరించింది. గతంలో ఎన్నడూ లేనంత భారీస్థాయిలో వీటిని మోహరించడం గమనార్హం. దాదాపు 90 యుద్ధనౌకలను

మిగతా 14వ పేజీలో...

జమిలిపై ముందుకు!

బిల్లుకు రేపు ఆమోదం తెలుపనున్న కేంద్ర క్యాబినెట్.. అనంతరం పార్లమెంటుకు..

ఏకాభిప్రాయం కోసం జేపీసీకి అప్పగించే అవకాశం

దాని ద్వారానే జమిలిపై ప్రజాభిప్రాయ సేకరణ

జమిలి కోసం రాజ్యాంగానికి ఆరు సవరణలు

కొన్ని సవరణలకు 2/3 మెజారిటీ అవసరం

విపక్షం పరోక్ష సహకారం లేకుండా అసాధ్యం

జేపీసీతో కొన్ని పార్టీలనైనా ఒప్పించాలని వ్యూహం





రాజ్యసభలో విపక్ష సభ్యుల నిరసన (ఇన్‌సెట్‌లో) ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిపే రాజ్యాంగ సవరణ బిల్లును శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని నిర్ణయించామని, గురువారం కేంద్ర క్యాబినెట్‌లో ఈ బిల్లును ఆమోదించవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. క్యాబినెట్ సమావేశం సాధారణంగా బుధవారం జరగాల్సి ఉండగా ఈసారి గురువారానికి వాయిదా వేశారు. బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన సంయుక్త కమిటీకి(జేపీసీ) నివేదిస్తారని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందుతుందని అధికార వర్గాలు తెలిపాయి ఈ మధ్య కాలంలో జేపీసీ వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లను సంప్రదిస్తుందన్నారు. బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రాలకు పంపుతారని, సగానికిపైగా అసెంబ్లీలు ఆమోదించిన తర్వాత అది చట్టరూపం పొందుతుందని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, జమిలి ఎన్నికలపై గత ఏడాది సెప్టెంబరులో ఏర్పాటైన రాంనాథ్ కోవింద్ కమిటీ సిఫారసులను కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదించింది. కోవింద్ కమిటీకి 47 రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలు తెలిపాయి. 32 పార్టీలు జమిలి ఎన్నికలను సమర్థించాయి. బీజేపీ, బీజేడీ, జేడీయూ, శివసేన వీటిలో ఉన్నాయి. వనరులు ఆదా కావడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం, ఏకకాలంలో దేశం అభివృద్ధి జరగడం దీనివల్ల సాధ్యపడతాయని అవి భావించాయి. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలను ఏకకాలంలో నిర్వహించేందుకు రాజ్యాంగంలోని 83, 172 అధికరణలను సవరించాలని కమిటీ సూచించింది. దీనివల్ల రాష్ట్రపతి, గవర్నర్ రద్దు చేస్తే తప్ప లోక్‌సభ, అసెంబ్లీల పదవీకాలం అయిదేళ్లు స్థిరంగా ఉంటుందని కమిటీ భావించింది. బీజేపీ ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో జమిలి ఎన్నికలను ప్రవేశపెడతామని ప్రజలకు హామీ ఇచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇదే అంశాన్ని పదేపదే ప్రస్తావించారు. కాంగ్రెస్, తృణమూల్

మిగతా 2వ పేజీలో...

రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాసం

దేశ చరిత్రలోనే మొదటిసారి

తీర్మానంపై 60 మంది 'ఇండియా' ఎంపీల సంతకం.. ధన్‌ఖడ్ పక్షపాతి అని ఆరోపణ

పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోజనాలకే తీర్మానం ప్రవేశ పెడుతున్నామని వెల్లడి

తిరస్కరించడం ఖాయం: ప్రభుత్వం

ఉభయసభల్లోనూ కొనసాగిన రభస

అదానీ-మోదీపై చర్చకు విపక్షం పట్టు

2





మైకు లాక్కొని మీడియా ప్రతినిధులపై దాడి చేస్తున్న మోహన్‌బాబు; ఓ వ్యక్తిపై మనోజ్ దాడి

మంచు ఫైటింగ్స్

జల్‌పల్లిలోని నివాసం వద్ద ఉద్రిక్తత

భార్యతో కలిసి వెళ్లిన మనోజ్.. లోపలికి రానివ్వని మోహన్‌బాబు, సెక్యూరిటీ

గేట్లు బద్దలు కొట్టుకొని వెళ్లిన కుమారుడు

ఆగ్రహంతో ఊగిపోయిన తండ్రి

ఘటనను చిత్రీకరిస్తున్న మీడియాపై దాడి

మైకు లాక్కొని కొట్టిన మోహన్‌బాబు

ఒక జర్నలిస్టుకు ఫ్రాక్చర్.. పలువురికి గాయాలు

జర్నలిస్టు సంఘాల ఆగ్రహం.. చర్యలకు డిమాండ్

మోహన్‌బాబు లైసెన్స్‌డ్ తుపాకీ సీజ్

నేడు విచారణకు రావాలని నోటీసులు

ఆస్పత్రిలో చేరిన సీనియర్ నటుడు

మనోజ్.. నా గుండెలపై తన్నావ్

కుమారుడిని ఉద్దేశించి మోహన్‌బాబు ఆడియో

హైదరాబాద్ సిటీ/పహాడీ షరీఫ్/హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో రచ్చకెక్కిన ఇంటి గొడవలు మరింత ముదిరి తారస్థాయికి చేరాయి. మోహన్‌బాబు, ఆయన చిన్న కుమారుడు మనోజ్ మధ్య చోటుచేసుకున్న వివాదం మంగళవారం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద మనోజ్ బౌన్సర్లు, మోహన్‌బాబుకు రక్షణగా ఆయన పెద్ద కుమారుడు విష్ణు నియమించిన బౌన్సర్లకు మధ్య ఘర్షణ జరిగింది. మనోజ్ దంపతులను మోహన్‌బాబు ఇంట్లోకి రానివ్వకపోవడంతో ఆయన గేట్లు బద్దలు కొట్టుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడం ఘర్షణను మరింత పెద్దది చేసింది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి బయటికి వచ్చిన మోహన్‌బాబు.. వివరణ కోరిన మీడియా ప్రతినిధులపై దాడి చేశారు. ఈ దాడిలో ఓ పలువురికి గాయాలు కూడా

మిగతా 10వ పేజీలో...



రైతు భరోసాకు నిధుల భరోసా!

భూమి తనఖా పెట్టి రూ.10 వేల కోట్ల అప్పు

రుణం ఇవ్వడానికి ఐసీఐసీఐ బ్యాంకు సిద్ధం

ఆడిటింగ్ పూర్తి చేసి ఆర్‌బీఐని ఒప్పించే పనిలో టీజీఐఐసీ

ఈ నెలాఖరుకల్లా దక్కనున్న రుణం

12

మునిసిపాలిటీల్లో మళ్లీ గ్రేడింగ్ విధానం!

దాని ప్రకారమే కమిషనర్ల నియామకం

2019లో గ్రేడ్లను రద్దు చేసిన అప్పటి సర్కార్

ఐఏఎస్ అధికారిని నియమించాల్సిన చోట గ్రేడ్-2, గ్రేడ్-3 స్థాయి ఉన్నవారికి పోస్టింగ్

అభివృద్ధిపై ప్రభావం పడినట్లు గుర్తించిన అధికారులు.. త్వరలో ప్రతిపాదనలు

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్ల నియామకంలో మళ్లీ గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇటీవల ఆ శాఖ సంచాలకుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని చర్చించినట్లు

మిగతా 12వ పేజీలో...

వణుకు లేదు.. ఉక్కపోతే!

చలికాలంలోనూ ఆగని ఫ్యాన్లు, ఏసీలు

రాష్ట్రంలో పంజా విసరని చలి పులి

గతేడాదితో పోలిస్తే పెరిగిన ఉష్ణోగ్రతలు

వరుస తుపానుల ప్రభావమే: నిపుణులు

వారం పాటు ఇదే పరిస్థితి అని వెల్లడి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ' ఆ ఫ్యాను ఎవడు వేశాడ్రా బాబు..' శీతాకాలం వచ్చిందంటే చాలు ప్రతీ ఇంట్లో కచ్చితంగా వినిపించే మాట ఇది. కానీ, ఈసారి డిసెంబరు నెలలో పది రోజులు గడిచినా అలాంటి మాటలు ఎక్కడా వినిపించడం లేదు సరికదా... గాలి ఆడడం లేదు కాస్త ఆ ఫ్యాన్ స్విచ్ వెయ్యి.. నిద్ర పట్టడం లేదు ఏసీ ఆన్ చెయ్యి... అనే మాటలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో చలి కాలం ప్రభావం ఈసారి పెద్దగా కనిపించడం లేదు. నవంబరు నెలలో కాస్త వణికించిన చలి.. డిసెంబరుకు వచ్చే సరికి జాడ లేకుండా పోయింది. సాధారణంగా తెలంగాణలో డిసెంబరు రెండో వారం నుంచి సంక్రాంతి దాకా

మిగతా 3వ పేజీలో...

తినే మాంసంలో.. యాంటీబయాటిక్స్

చికెన్, మటన్, అన్నింటా.. ప్రతి కిలోకు 114 మిల్లీ గ్రాములు

జంతువుల్లో చిన్న జబ్బుకూ యాంటీబయాటిక్స్

వాటిలో యాంటీ-మైక్రోబయాల్ రెసిస్టెన్స్

వాటి మాంసం తినే వారిపైనా ప్రభావం

జీర్ణకోశ, చర్మవ్యాధులు, క్యాన్సర్ ముప్పు

తాజా అధ్యయనంలో వెల్లడి

2020లో 190 దేశాల్లో పరిశోధన

30వ స్థానంలో భారత్

యాంటీబయాటిక్స్‌తో కోళ్లు, గొర్రెలు.. త్వరగా పెరుగుతాయనేది అపోహే: వైద్యులు

పోషకాల కోసం మాంసం అవసరమే.. కానీ పరిమితంగా తీసుకోవాలి: నిపుణులు



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మందులకు లొంగని సూక్ష్మజీవులు, వైరసలు మనుషులను వేధించుకుని తింటున్నాయి. యాంటీబయాటిక్స్ విషయంలోనూ రాటుదేలి.. మొండికేస్తున్నాయి. దీన్నే యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అంటారు. ఈ మధ్యకాలంలో ఏఎంఆర్‌పై చర్చలు తీవ్రంగా జరుగుతున్నాయి. అతిగా యాంటీబయాటిక్స్ తీసుకునేవారిలో ఈ పరిస్థితి ఉంటుంది. దీంతో.. కేంద్ర ప్రభుత్వం వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ విక్రయించకూడదని ఫార్మసిస్టులకు ఆదేశాలిచ్చింది. అయితే.. తినే మాంసంలోనూ యాంటీబయాటిక్స్ అవశేషాలు ఉంటున్నాయని, ఈ పరిణామం మానవుల్లో రుగ్మతలకు కారణమవుతాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. 190 దేశాల్లో 2020 సంవత్సరంలో

మిగతా 13వ పేజీలో...



విగ్రహాల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేదా?

స్కూళ్లలో వరుసగా విషాహార ఘటనలు

ప్రభుత్వం ఏం చేస్తోంది?: హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా కాదు.. సొంత జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఉండటం ప్రజల దురదృష్టమని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. విగ్రహాల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేదా? ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస.. పిల్లల భవిష్యత్తుపై లేదా? అంటూ మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుసగా ఆహారం వికటించి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే

మిగతా 12వ పేజీలో...



2

కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ కన్నుమూత

గుండెపోటుతో నిద్రలోనే మృతి

రాజకీయాల్లో 6 దశాబ్దాల ప్రస్థానం

కెనడా గవర్నర్ ట్రూడో..

కెనడా నుంచి అక్రమ వలసలు, డ్రగ్స్ నేపథ్యంలో ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్య

కెనడా అమెరికాలో చేరాలని హితవు

అమెరికా పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ ధిల్లాన్

ఎఫ్ 1 వీసాల జారీలో 38% క్షీణత

అమెరికాకు తగ్గిన భారతీయ విద్యార్థులు

14



కొత్తగా 78 పీహెచ్‌సీలు!

220 సబ్ సెంటర్లు.. రూ.350 కోట్లతో ఏర్పాటుకు రాష్ట్ర సర్కారు నిర్ణయం

ప్రతి 25-30 కి.మీ.కు ఓ ఆస్పత్రికి ప్రణాళిక

13

సింగరేణి సీఎండీ రేసులో శైలజా రామయ్యర్!

పోస్టు కోసం పలువురు ఐఏఎస్‌ల పోటీ

ముగియనున్న ఇన్‌చార్జి సీఎండీ బలరామ్ డిప్యుటేషన్

పొడిగించడానికి కేంద్ర ప్రభుత్వం విముఖం?

13



సీబీటీ విధానంలో సీయూఈటీ-యూజీ పరీక్ష

న్యూఢిల్లీ, డిసెంబరు 10: దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీయూఈటీ-యూజీ)ను వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారితంగా (సీబీటీ విధానంలో) నిర్వహించనున్నట్లు యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్ వెల్లడించారు. అంతేకాకుండా ఈ పరీక్షల్లో సబ్జెక్టులను 63 నుంచి 37కు తగ్గిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో అభ్యర్థులు గరిష్ఠంగా ఆరు సబ్జెక్టులలో పరీక్షలు రాసే వీలుండేదని ఇప్పుడు వాటిని ఐదుకు తగ్గిస్తున్నామని చెప్పారు. అలాగే ఆయా సబ్జెక్టును బట్టి గతంలో 45 నుంచి 60 నిమిషాల వ్యవధి ఉండేదని ఇప్పుడా వ్యవధిని 60 నిమిషాలకు నిర్ణయించడంతో పాటు ఆప్షనల్ ప్రశ్నల విధానాన్ని రద్దు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా 12వ తరగతిలో చదివిన సబ్జెక్టుల్లోనే కాకుండా విద్యార్థులు ఏ సబ్జెక్టునైనా ఎంచుకుని పరీక్ష రాసే వీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తామని యూజీసీ ఛైర్మన్ జగదీశ్ వెల్లడించారు.

అమెరికాకు తగ్గిన భారతీయ విద్యార్థులు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆమేరకు అమెరికా జారీ చేసే ఎఫ్ 1 వీసాల సంఖ్యలో 38% తగ్గుదల కనిపించింది. అమెరికన్ బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నెలవారీ నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా నివేదికల డేటా ప్రకారం... ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకూ 64,008 మంది విద్యార్థులకు వీసాలు జారీ అయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో 1,03,495 వీసాలు జారీ అయ్యాయి. కొవిడ్ తరువాత భారతీయ విద్యార్థులకు ఈ స్థాయిలో వీసాలు తగ్గడం ఇదే తొలిసారి. ఇండియా తరువాత అత్యధిక సంఖ్యలో చైనా విద్యార్థులు యూఎస్‌లో చదువుతున్నారు. గత ఏడాదితో పోల్చితే 2024లో ఆదేశ విద్యార్థులకు జారీ అయిన వీసాల సంఖ్యలోనూ 8% తగ్గుదల కనిపించింది. ఈ తగ్గుదలపై యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ప్రతినిధి మాట్లాడుతూ, 'నెలవారీ విడుదల చేసే వీసా జారీ లెక్కలు ఆ ఆర్థిక సంవత్సరంలో జారీ చేసిన మొత్తం వీసాల వాస్తవ సంఖ్యను కచ్చితత్వంతో ప్రతిబింబించవు' అని వివరించారు. అయితే, ఈ ఏడాది వీసాల జారీ కోసం అత్యధికంగా దరఖాస్తు చేసుకొనే మే, జూన్, జూలై నెలల్లో భారతీయ విద్యార్థులకు కేటాయించిన వీసా స్లాట్స్‌లో సుమారు 20,000 వరకూ ఖాళీగా ఉండిపోయాయి.

క్యూఎస్ సుస్థిర వర్సిటీ ర్యాంకుల్లో భారత్ నుంచి ఐఐటీ ఢిల్లీ టాప్

- తెలంగాణ నుంచి రెండు యూనివర్సిటీలకు ర్యాంకులు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: క్యూఎస్ ర్యాంకింగ్స్ సంస్థ ఏటా ప్రకటించే 'సుస్థిర యూనివర్సిటీ'ల జాబితాలో భారత్ నుంచి ఐఐటీ-ఢిల్లీ మొదటి ర్యాంక్ సాధించింది. ప్రపంచవ్యాప్త ర్యాంకింగ్‌లో 171వ స్థానంలో ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ జాబితాలో ఐఐటీ-ఢిల్లీ ఏకంగా 255 స్థానాలను మెరుగుపర్చుకోవడం విశేషం. క్యూఎస్ సుస్థిర యూనివర్సిటీల ర్యాంకులను మంగళవారం ప్రకటించారు. ఇందులో కెనడాలోని టొరంటో యూనివర్సిటీ టాప్‌లో ఉంది. భారత్ నుంచి 78 యూనివర్సిటీలు ఈ జాబితాలో చోటు సంపాదించాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రంలోని ఐఐటీ-హైదరాబాద్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లకు కూడా ఉన్నాయి. ఐఐటీ-హైదరాబాద్‌కు 991-1000మధ్యలో ర్యాంకు రాగా, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు 1001-1020 మధ్య స్థానం లభించింది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో గీతం యూనివర్సిటీకి ఈ జాబితాలో స్థానం లభించింది. ఈ యూనివర్సిటీ 1161-1180మధ్య ర్యాంకును సాధించింది. 107 దేశాల్లోని 1,740 యూనివర్సిటీలకు ఈ ర్యాంకులను ప్రకటించారు. గతేడాది 95 దేశాల్లోని 1,397 యూనివర్సిటీలకు ర్యాంకులను ప్రకటించారు.

మాధవ్ గాడ్గిల్‌కు ఐరాస పురస్కారం



న్యూఢిల్లీ, డిసెంబరు 10: ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త, విద్యావేత్త మాధవ్ గాడ్గిల్(82)కు ఐక్యరాజ్యసమితి(ఐరాస) గుర్తింపు లభించింది. పర్యావరణ విభాగంలో ఐరాస ఇచ్చే అత్యున్నత పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ద ఎర్త్'.. మాధవ్ గాడ్గిల్‌ను వరించింది. ఐరాస ప్రతీ ఏటా ఇచ్చే ఈ పురస్కారానికి ఈసారి ప్రపంచవ్యాప్తంగా ఆరుగురిని ఎంపిక చేయగా వారిలో భారతదేశం నుంచి మాధవ్ గాడ్గిల్ కూడా ఉన్నారు. ప్రపంచ జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి ఎంతో కీలకమైన భారతదేశంలోని పశ్చిమ కనుమల పరిరక్షణ అంశంలో చేసిన సేవలకు గాను గాడ్గిల్‌కు ఈ గౌరవం లభించింది. గాడ్గిల్ ఛైర్మన్‌గా వ్యవహరించిన పశ్చిమ కనుమల జీవావరణ నిపుణుల కమిటీ 2011లో ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పిస్తూ పశ్చిమ కనుమల్లో నిర్మాణ ప్రాజెక్టులు వద్దని సూచించింది.



కేపిటల్ హిల్ వద్ద ఇండో అమెరికన్ల నిరసన ప్రదర్శన

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపండి

- ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై హింసకు వ్యతిరేకంగా జనం గళమెత్తారు. ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాలలో మంగళవారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అమెరికాలోనూ వైట్‌హౌస్ నుంచి కేపిటల్ భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలోని చాణక్యపురిలో ఉన్న బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ఎదుట ఆర్ఎస్ఎస్ సహా వివిధ సంఘాల ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రదర్శన నిర్వహించారు. పౌర సంఘాలు, సామాజిక సంఘాలు, సాంస్కృతిక సంఘాల సభ్యులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై నరమేధాన్ని ఆపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ సహా దేశంలోని అనేక నగరాల్లో వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ నుంచి కేపిటల్ భవనం వరకు భారతీయ అమెరికన్లు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న అత్యాచారాలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి దృష్టి పెట్టాలని కోల్‌కతాలోని ఇస్కాన్ కేంద్రం పిలుపునిచ్చింది.

'ఇండిగో'కు బాంబు బెదిరింపులో ఐబీ అధికారి

న్యూఢిల్లీ, డిసెంబరు 10: గత నెలలో నాగ్‌పూర్ నుంచి కోల్‌కతా వెళ్లే ఇండిగో విమానానికి వచ్చిన బాంబు బెదిరింపు కేసులో అరెస్టయిన వ్యక్తి ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) అధికారిగా వెల్లడయ్యింది. అనిమేష్ మండల్(44) ఐబీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నాగ్‌పూర్‌లో పనిచేస్తున్నారు. నవంబరు 14న ఆయన ఇండిగో విమానంలో బాంబు ఉందని చెప్పడంతో 187 మంది ప్రయాణికులున్న ఆ విమానాన్ని అత్యవసరంగా రాయ్‌పూర్‌లో దింపాల్సి వచ్చింది. విమానం నాగ్‌పూర్ నుంచి బయలుదేరాక మండల్ దాని సిబ్బందికి అందులో బాంబు ఉందని చెప్పారు. ఈ కారణంగా దాన్ని రాయ్‌పూర్‌కు మళ్లించారు. అక్కడ పూర్తిస్థాయిలో తనిఖీ చేశాక బాంబు బెదిరింపు ఉత్తదే అని తేలింది. దీంతో మండల్‌పై కేసు నమోదు చేసి రాయ్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు.

పంచమశాలి రిజర్వేషన్ పోరాటం హింసాత్మకం

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక శాసనసభ శీతాకాల సమావేశాలు జరుగుతున్న బెళగావి సువర్ణసౌధను ముట్టడించేందుకు ప్రయత్నించిన పంచమశాలి లింగాయతలను పోలీసులు అడ్డుకోవడంతో హింస చెలరేగింది. 2ఏ రిజర్వేషన్ అమలు చేయాలంటూ పంచమశాలి లింగాయత సామాజికవర్గానికి చెందిన వేలాది మంది, కూడలసంగమ మఠాధిపతి బసవ మృత్యుంజయస్వామిజీ మంగళవారం సువర్ణసౌధ సమీపంలో ఉండే హైవేపై బైఠాయించి నిరసనకు దిగారు. ఇదే సమయంలో కొంతమంది రాళ్లు రువ్వడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. దీంతో పలువురు నిరసనకారులకు గాయాలయ్యాయి. బసవ మృత్యుంజయస్వామిజీ, ఎమ్మెల్యే బసనగౌడపాటిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాసం

దేశ చరిత్రలోనే మొదటిసారి.. తీర్మానంపై 60 మంది 'ఇండియా' ఎంపీల సంతకాలు





న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై రాజ్యసభలో విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. ఛైర్మన్‌పై ఇంతటి తీవ్ర చర్యకు ఎంపీలు దిగడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని చెబుతున్నారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఆర్జేడీ, టీఎంసీ, డీఎంకే, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, ఆప్ తదితర పార్టీలకు చెందిన 60 మంది ఎంపీలు దానిపై సంతకాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీలు జైరాం రమేశ్, సయ్యద్ నాసిర్ హుస్సేన్ సదరు తీర్మానాన్ని మంగళవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి అందజేశారు. అయితే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఇతర పార్టీల పార్లమెంటరీ నేతలు ఈ తీర్మానంపై సంతకాలు చేయలేదు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నందున కాంగ్రెస్ అగ్రనేతలు సంతకాలు పెట్టలేదని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు స్పష్టం చేశారు. మరోవైపు.. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మంగళవారం కూడా ఎలాంటి కార్యకలాపాలు జరుగలేదు. ఉభయసభల్లోనూ పెద్దఎత్తున గందరగోళం చెలరేగింది. పారిశ్రామికవేత్త అదానీపై అమెరికాలో చార్జిషీటు, ఆయనతో ప్రధాని మోదీ సంబంధాలపై చర్చకు కాంగ్రెస్ యథాప్రకారం పట్టుబట్టింది. బీజేపీ ఎదురుదాడికి దిగింది. అమెరికా ఇండస్ట్రియలిస్ట్, భారత వ్యతిరేకి జార్జి సొరోస్‌తో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి లింకులున్నాయని.. ఆ పార్టీ దేశద్రోహానికి పాల్పడుతోందని.. ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేసింది. పరస్పర ఆరోపణలు, నినాదాలతో ఉభయసభలూ అట్టుడికాయి. దీంతో ఎలాంటి కార్యకలాపాల్లేకుండానే సభలు బుధవారానికి వాయిదాపడ్డాయి. కాగా.. ధన్‌ఖడ్ ఎగువ సభలో అధికార కూటమికి అనుకూలంగా అత్యంత పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోజనాల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఆయనపై ఇండియా కూటమి అవిశ్వాసం ప్రతిపాదించిందని 'ఎక్స్'లో తెలిపారు. ధన్‌ఖడ్‌తో పలు అంశాలపై విపక్ష ఎంపీలకు విభేదాలు ఉన్నాయి. తమపై దాడికి అధికార పక్షానికి ఎక్కువ అవకాశాలు ఇస్తున్నారని వారు గుర్రుగా ఉన్నారు. గత ఆగస్టులోనే అవిశ్వాసం పెట్టాలనుకున్నా ఆయనకు మరో అవకాశం ఇవ్వాలని భావించారు. తాజా సమావేశాల్లో సొరోస్-సోనియా లింకులపై చర్చకు బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసులను తిరస్కరించిన ఛైర్మన్.. తిరిగి ఆ అంశాన్ని జీరో అవర్‌లో ప్రస్తావించేందుకు అనుమతివ్వడంతో కాంగ్రెస్ ఎంపీలు మండిపడ్డారు. దీంతో ఆయనపై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. ఇతర ఇండియా కూటమి ఎంపీలు కూడా మద్దతిచ్చారు. రాజ్యాంగంలోని 67 (బీ), 92, 100వ అధికరణల ప్రకారం.. రాజ్యసభ ఛైర్మన్‌ను తొలగించాలంటే తొలుత సభలో తీర్మానం ప్రవేశపెట్టాలి. ఓటింగ్ రోజు హాజరైన సభ్యుల్లో సగం మంది కంటే ఒకరు ఎక్కువగా దానికి అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆయన్ను తొలగించడం సాధ్యపడుతుంది. రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి కూడా కావడంతో లోక్‌సభలోనూ తీర్మానం ఆమోదం పొందాల్సి ఉంటుంది. కాగా..ఈ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానంపై చర్చకు సాంకేతికంగా వీలుపడదని.. 14 రోజుల ముందు తీర్మానానికి నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని.. ఇంకో 8 రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగియనున్నాయని రాజ్యసభ సచివాలయం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయితే రాజ్యసభలో ఎన్డీఏకి పూర్తి మెజారిటీ ఉందని.. ఈ తీర్మానాన్ని తిరస్కరించడం ఖాయమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వ్యాఖ్యానించారు. 'రాజ్యసభ ఛైర్మన్ మనకు మార్గదర్శి. సభ సజావుగా నడిచేందుకు ఆయన చెప్పేది అందరూ వినాలి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎల్లప్పుడూ ఛైర్మన్‌ను అవమానిస్తుంటాయి' అని ధ్వజమెత్తారు. విపక్షాలకు రాజ్యాంగ నియమాలు తెలియవని.. ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ అన్నారు. 67(బీ) అధికరణ ప్రకారం అభిశంసన తీర్మానం మాత్రమే ప్రవేశపెట్టాలని చెప్పారు. ధన్‌ఖడ్‌పై ఒత్తిడి తేవడానికి విపక్షం ప్రయత్నిస్తోందన్నారు. టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మాట్లాడుతూ.. ఈ తీర్మానం ఆమోదానికి తగిన సంఖ్యాబలం తమకు లేదని.. కానీ ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కోసం పోరాడేందుకు బలమైన సందేశంగా పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏ వ్యక్తిపైనా తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదన్నారు.

అదానీ-మోదీ సంచులతో నిరసన


కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో వినూత్నంగా నల్ల జోలెలు ధరించి నిరసనకు దిగారు. ఆ సంచులకు ఓవైపు అదానీ, మోదీ చిత్రాలు.. ఇంకో వైపు 'అదానీ-మోదీ భాయ్ భాయ్' అన్న నినాదం ముద్రించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా సహా కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం, వామపక్ష ఎంపీలు మకరద్వారం మెట్ల ముందు నిరసన చేపట్టారు. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతకుముందు రాహుల్ కాంగ్రెస్ ఎంపీలతో పార్లమెంటు ప్రాంగణంలో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై సమీక్షించారు. పార్లమెంటు సమావేశాలు మొదలైనప్పటి నుంచి సభల లోపలే గాక వెలుపల కూడా ఇండియా కూటమి నిరసనలు చేపడుతున్న సంగతి తెలిసిందే.



భారత్‌పై సొరోస్ యుద్ధం: రిజిజు

కాంగ్రెస్-సొరోస్ లింకుపై బీజేపీ చేస్తున్నది వట్టి ఆరోపణ మాత్రమే కాదని.. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టంచేశారు. దీనికి సంబంధించిన నివేదిక అందరికీ అందుబాటులోనే ఉందని మీడియాతో అన్నారు. సొరోస్ బహిరంగంగానే భారత్, భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారని.. భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి సంకల్పించారని.. ఇది దేశ పౌరులందరికీ ఆందోళన కలిగించే అంశమని.. ఈ సమయంలో ఎంపీల మధ్య ఐక్యత అవసరమని తెలిపారు. జాతీయ ప్రయోజనాల విషయంలో పార్లమెంటు సభ్యులందరూ కలిసికట్టుగా ఉండాలని పిలుపిచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సోమవారం ఈ అంశాన్ని రాజ్యసభలో ప్రస్తావించిన సంగతి తెలిసిందే. అయితే అదానీని కాపాడుకునేందుకే బీజేపీ సొరోస్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే ఆరోపించారు. అదానీని అవిశ్రాంతంగా రక్షిస్తోందని.. పార్లమెంటును నడవనివ్వడం లేదని అన్నారు.

లోకం తీరు



మమతకు లాలు మద్దతు

ఇండియా కూటమి బాధ్యతను ఆమెకు అప్పగించాలని సూచన

న్యూఢిల్లీ, డిసెంబరు 10: కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి తాను నాయకత్వం వహిస్తానంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమత తన మనసులోని మాటను చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమిలోని పలు పార్టీల నాయకులు ఆమెకు మద్దతు తెలపడం విశేషం. ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, మహారాష్ట్రకు చెందిన మాజీ సీఎం ఉద్ధవ్ బాల్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీలు మమత నాయకత్వానికి దన్నుగా నిలిచాయి. మంగళవారం లాలూ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమి బాధ్యతలను మమతకు అప్పగించాలని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. లాలూ కుమారుడు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. శివసేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంకా చతుర్వేది కూడా మమతకు మద్దతు తెలిపారు. "ఇండియా కూటమికి మమత నాయకత్వం అత్యంత ముఖ్యం" అని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌ను బలోపేతం చేసినట్టే.. ఆమెకు పగ్గాలు అప్పగిస్తే కూటమిని కూడా బలోపేతం చేస్తారన్న నమ్మకం ఉందని తెలిపారు. శివసేన(యూబీటీ) కీలక నేత సంజయ్ రౌత్ మాత్రం భిన్నంగా స్పందించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేరన్నారు. ఇదిలావుంటే, ఇండియా కూటమిలో సఖ్యత లేదని, పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ విమర్శలు గుప్పించింది. కాగా, మిత్రపక్షాల వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించవద్దని ఆయన కాంగ్రెస్ ఎంపీలను ఆదేశించారు.

ఈవీఎంల ఓట్లు, వీవీప్యాట్ స్లిప్పులు సరి సమానం

మహారాష్ట్ర ఎన్నికలపై ఎలక్షన్ కమిషన్ ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 10: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈవీఎంల్లో నమోదైన ఓట్లు, వీవీప్యాట్ స్లిప్‌ల మధ్య ఎలాంటి తేడాలు కనిపించలేదని మంగళవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటి సంఖ్య సరిసమానంగా ఉందని పేర్కొంది. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మచ్చుకు అయిదు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి అక్కడి వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు రోజైన గత నెల 23నే వాటిని లెక్కించినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 1,440 వీవీప్యాట్‌ల స్లిప్‌లను లెక్కించారు. వాటిని సంబంధిత ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లతో సరిపోల్చగా ఎక్కడా తేడాలు కనిపించలేదని పేర్కొంది. ఈవీఎంల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష సభ్యులు తొలి రోజున ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయడానికి తిరస్కరించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఈ వివరాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈసీ ప్రకటనపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపింది.

ఈ ఏడాది గూగుల్ ట్రెండ్ 'ఐపీఎల్'

వ్యక్తుల జాబితాలో పవన్ కల్యాణ్‌కు 5వ స్థానం

న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఏదైనా కొత్త విషయం తెలుసుకోవాలన్నా.. ఏదైనా విషయం మీద వార్తల్లో, వివరాలో కావాలన్నా.. అత్యధిక మంది ఆశ్రయించేది గూగుల్‌నే. జనం ఎక్కువగా దేనిపై ఆసక్తి కనబరిచారో ఎప్పుడెప్పుడు దేని గురించి వెతికారో గూగుల్ ట్రెండ్స్ చెప్పేస్తుంది. 2024లో భారతీయులు ఎక్కువగా వెతికిన అంశాల జాబితాను మంగళవారం గూగుల్ ప్రచురించింది. ఇందులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అగ్రస్థానంలో నిలవగా వ్యక్తుల జాబితాలో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐదో స్థానంలో ఉన్నారు. సినిమాల విషయానికి వస్తే స్త్రీ2 గురించి ఎక్కువ మంది ఆరా తీశారు.

జమిలిపై ముందుకు!

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్, ఎంఐఎంతో పాటు అనేక పార్టీలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. విషయాన్ని జేపీసీకి నివేదించి ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి జేపీసీ ఏర్పాటయితే దాని ద్వారా అన్ని పార్టీల ప్రతినిధులు, మేధావులు, సామాన్యుల అభిప్రాయాలను కూడా సేకరించడానికి అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానాన్ని మార్చడం భారీ సవాళ్లతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఏకాభిప్రాయ సాధన తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు ఆమోదం పొందితే ఎప్పుడు ఎన్నికలు జరుగుతాన్న విషయం చర్చ జరుగుతోంది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది కనుక 2029 వరకు ఈ ఎన్నికలకు సన్నద్ధం కావచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పరిస్థితులను బట్టి ఈ ఎన్నికల ప్రక్రియను ముందుకు జరపవచ్చునని కూడా చర్చ జరుగుతోంది.

మహారాష్ట్ర విజయం తర్వాత

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో జమిలి ఎన్నికల గురించి గట్టిగా చెప్పినప్పటికీ ఫలితాలు వచ్చిన తర్వాత బీజేపీ ఈ హామీపై కొన్ని నెలలు చప్పుడు చేయలేదు. కేంద్రంలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేక మిత్రపక్షాల మీద ఆధారపడే పరిస్థితి ఉండటం, హరియాణా, మహారాష్ట్రలలో లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్న నేపథ్యంలో మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి ప్రభుత్వం ఏర్పాటు చేయడమన్నది అనుమానాస్పదం కావడంతో నిజంగానే జమిలి సద్దుమణిగింది. అయితే, మహారాష్ట్ర, హరియాణాల్లో బీజేపీ తిరుగులేని విజయాలు సాధించడం, కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడటం, ఎన్డీయే మిత్రపక్షాలన్నీ జమిలి విషయంలో బీజేపీకి దన్నుగా నిలబడిన నేపథ్యంలో సవరణలను ముందుకు తీసుకెళ్లగలమని అధికారపక్షం భావిస్తోంది. ఇప్పుడు సగం రాష్ట్రాల్లో బిల్లును ఆమోదించుకోవడం ఎన్డీయేకు సమస్య కాదు.

ఒకేసారి అసెంబ్లీ ఎన్నికలు పెట్టలేని కమిషన్

ప్రస్తుతం పలు దఫాలుగా ఎన్నికలు జరుగుతుండడంతో సమయం, ధనం వృథా అవుతోందని ప్రభుత్వం భావిస్తోంది. దానికితోడు ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు చేపట్టడంలో సమస్యలు వస్తున్నాయని అంటోంది. అందువల్ల అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఇది ఆచరణ సాధ్యం కాదని ప్రతిపక్షాలు అంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలనే ఎలక్షన్ కమిషన్ విడతల వారీగా జరుపుతోందని, అలాంటప్పుడు అన్నింటిని ఒకేసారి ఎలా జరపగలుగుతుందని ప్రశ్నిస్తున్నాయి. ఇది అప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేకమని కూడా వాదిస్తున్నాయి.

బలాబలాలు చూస్తే

ఒకే దేశం-ఒకే ఎన్నిక నిర్వహించాలంటే ముందుగా రాజ్యాంగానికి ఆరు సవరణలు చేపట్టాల్సి ఉంది. ఇందుకు ఆరు బిల్లులు ప్రవేశపెట్టాల్సి ఉంది. వీటిని పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంటులో ఎన్డీఏకు సాధారణ మెజార్టీ ఉందే తప్ప 2/3 మెజార్టీ లేదు. రాజ్యసభలో 245 సీట్లు ఉండగా, ఎన్డీఏ బలం 112 మాత్రమే. ప్రతిపక్షాలకు 85 సీట్లు ఉన్నాయి. రాజ్యాంగ సవరణ బిల్లులో ఆమోదం పొందాలంటే 164 ఓట్ల అవసరం ఉంది. లోక్‌సభలో మొత్తం 545 స్థానాలు ఉండగా ఎన్డీఏకు 292 సీట్లే ఉన్నాయి. 2/3 మెజార్టీ అంటే 364 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. ఇక్కడ చిన్న మెలిక కూడా ఉంది. మొత్తం సభ్యులను పరిగణనలోకి తీసుకోకుండా.. సభకు హాజరయి, ఓటు వేసిన వారిలో 2/3 శాతం మెజార్టీ సరిపోతుందన్న నిబంధన ఉండడంతో చివరి నిమిషంలో అనూహ్యమైన పరిణామాలకు కూడా అవకాశం ఉంటుంది.

అలహాబాద్ హైకోర్టు జడ్జి ప్రసంగం మా దృష్టికి వచ్చింది: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సమ్మేళనంలో చేసిన వివాదాస్పద ప్రసంగానికి సంబంధించిన వార్తా కథనాలు తన దృష్టికి వచ్చినట్టు మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. దీనిపై అలహాబాద్ హైకోర్టు నుంచి పూర్తి వివరాలు తెప్పించుకొని పరిశీలించనున్నట్టు పేర్కొంది. వీహెచ్‌పీ లీగల్ సెల్, వీహెచ్‌పీ హైకోర్టు విభాగం 'ఉమ్మడి పౌర స్మృతి-రాజ్యాంగ అవసరం అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో జస్టిస్ యాదవ్.. "ఇది హిందూస్థాన్. బహుసంఖ్యాకుల అభిప్రాయం మేరకే దేశం పనిచేస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఉమ్మడి పౌరస్మృతిపైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ కన్నుమూత

- గుండెపోటుతో నిద్రలోనే తుదిశ్వాస
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు
- సెలవు ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం



బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ(92) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కర్ణాటక రాజకీయాలలో అత్యంత సీనియర్ నేత అయిన కృష్ణ.. ముఖ్యమంత్రి, గవర్నర్, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి వంటి కీలకమైన పదవులను చేపట్టారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఏడాది నుంచి ఆయన ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న తన నివాసంలో నిద్రిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యారు. ఆ తర్వాత కొద్ది సేపటికే ఎస్ఎం కృష్ణ కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 60 ఏళ్ల పాటు రాజకీయాల్లో కొనసాగిన ఎస్ఎం కృష్ణ వివాదరహితుడిగా పేరొందారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గాను కొనసాగారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన 2017 మార్చిలో బీజేపీలో చేరారు. అయితే క్రియాశీలకంగా వ్యవహరించలేకపోయారు. 1962లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1968, 1971, 1980లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1972లో కర్ణాటక విధానపరిషత్ సభ్యుడిగా, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. 1984లో ఆర్థికమంత్రిగా, 1989 నుంచి 92 వరకు శాసనసభ స్పీకర్‌గా కొనసాగారు. 1992 నుంచి 94వరకు కర్ణాటక తొలి ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 1995లో శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత 1999లో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. 2004 నుంచి 2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగారు. 2009 నుంచి 2012 వరకు భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. ఎస్ఎం కృష్ణ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించింది. శాసనసభ కార్యకలాపాలను బుధవారం పూర్తిగా రద్దు చేశారు. ఎస్ఎం కృష్ణ స్వగ్రామం మండ్య జిల్లా మద్దూరు తాలూకా సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సెలవు ప్రకటించింది. ఎస్ఎం కృష్ణ సమీప బంధువు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు కృష్ణ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

'బ్రాండ్ బెంగళూరు' సొంతం!

కర్ణాటకలోని సోమనహళ్లిలో 1932, మే 1న జన్మించిన ఎస్ఎం కృష్ణ.. మైసూరులోని మహారాజా కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. తర్వాత అమెరికాలోని డల్లాస్‌లో ఉన్న సదరన్ మెథొడిస్ట్ యూనివర్సిటీ, జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలలోనూ ఉన్నత విద్యను అభ్యర్థించారు. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత రేణుకాచార్య లా కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 30 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి వచ్చారు. 1962లో మద్దూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ నేత కేవీ శంకర్‌గౌడ్‌పై విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. తర్వాత ప్రజా సోషలిస్టు పార్టీలో చేరారు. అనంతరం కాంగ్రెస్ కండువా కప్పుకొని సుదీర్ఘకాలం ఆ పార్టీలోనే ఉన్నారు. అంచెలంచెలుగా ఎదిగిన కృష్ణ.. ముఖ్యమంత్రి పీఠం ఎక్కాక.. 'బ్రాండ్ బెంగళూరు' కోసం తపించారు. ఐటీ రంగంలో బెంగళూరును ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న సిలికాన్ వ్యాలీకి ప్రత్యామ్నాయంగా బెంగళూరును అనతి కాలంలోనే తీర్చి దిద్దారు. ఎస్ఎం కృష్ణ పాలనా కాలంలో టెక్నాలజీ రంగం పరుగులు పెట్టింది. కాగా, టెన్నిస్ అంటే అమితంగా ఇష్టపడే కృష్ణ.. కాలేజీ రోజుల్లో పలు పతకాలు సాధించారు.

యువత 'మత్తు'కు దూరంగా ఉండాలి

» పదిమంది మంచి కోసమే స్వర్ణ భారత్ ట్రస్టు

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



శంషాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. కొందరు యువత మత్తుకు బానిసలై జీవితాన్ని అర్ధంతరంగా ముగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టు (హైదరాబాద్ చాప్టర్)లో శిక్షణ పొందిన యువతకు మంగళవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ సమాజానికి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు పెద్ద సమస్యగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పదిమంది స్నేహితులు కలిసి సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో పెట్టిందే స్వర్ణభారత్ ట్రస్ట్ అని తెలిపారు. ఏటా వేలాది మంది నిరుద్యోగులకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తున్న ఘనత స్వర్ణభారత్ ట్రస్ట్‌దేనన్నారు. తమ ట్రస్ట్ ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకోదని, స్నేహితులే నిధులు సమాకురుస్తారని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన యువత తమ కాళ్ల మీద తాము నిలబడి, లక్ష్యాలను సాధించిన తరువాత సమాజానికి తిరిగివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ దీపావెంకట్, ఇన్‌చార్జి డీవీఎన్ రావు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లాడాడు.. అనుమానంతో చంపేశాడు..!

» భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

» అది హత్యే.. మృతురాలి కుటుంబసభ్యుల ఆరోపణ



పవిత్ర (ఫైల్)

గద్వాల క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నువ్వంటే నాకిష్టం.. నువ్వు లేకుండా నేను బతకలేనని మాయమాటలు చెప్పి పెళ్లాడాడు. ఆపై కొద్ది రోజులకే ఆమెపై అనుమానం పెంచుకుని వేధించసాగాడు. దాంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గద్వాల జిల్లా మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన బోయ పవిత్ర (22) అదే గ్రామానికి చెందిన కమ్మరి వినయ్ ప్రేమించుకున్నారు. పవిత్ర బీటెక్ చదువుతుండగా, వినయ్ ఓ గాజు కంపెనీలో పని చేస్తున్నాడు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో వారిని ఎదురించి 2022లో రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకున్నారు. వివాహమైన కొద్దిరోజులకే పవిత్రపై వినయ్ అనుమానం పెంచుకున్నాడు. ఆమెకు ఎవరు ఫోన్ చేసినా ఆరా తీసి వేధించేవాడు. దీంతో పవిత్ర అతన్ని వదిలి తల్లిదండ్రుల వద్దకు చేరుకుని తిరిగి తన చదువును కొనసాగిస్తోంది. ఈ క్రమంలో కొద్ది రోజులకు పవిత్రను కలిసి తాను మారిపోయానని ఇకపై వేధించనని చెప్పి వినయ్ ఆమెను తిరిగి తన ఇంటికి తీసుకెళ్లాడు. మంగళవారం వారిరువురి మధ్య మళ్లీ గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన పవిత్ర గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వినయ్ తమ కుమార్తెను అన్యాయంగా చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని పవిత్ర కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జవాన్ సుబ్బయ్య వీరమరణం

» జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు పెట్టిన మందుపాతర పేలి మృతి

» స్వగ్రామం ప్రకాశం జిల్లా రావిపాడులో విషాదఛాయలు



వెంకటసుబ్బయ్య(ఫైల్)

కంభం/నార్పల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లో ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి ప్రకాశం జిల్లాకు చెందిన జవాన్ వరికుంట్ల వెంకటసుబ్బయ్య(40) వీరమరణం పొందారు. ఆయన ఆర్మీలోని 25వ రాష్ట్రీయ రైఫిల్స్‌లో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం విధుల్లో ఉండగా చోటుచేసుకొంది. వెంకటసుబ్బయ్య స్వస్థలం ప్రకాశం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామం. 15 ఏళ్ల క్రితం ఆర్మీలో జవాన్‌గా చేరారు. ఆయన అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి చెందిన జీమాను రామకృష్ణ కుమార్తె లీలావతిని వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లల చదువుల కోసం ఆరేళ్ల క్రితం కుటుంబాన్ని నార్పలకు మార్చారు. తండ్రి ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందడంతో సుబ్బయ్య అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు రావిపాడు వచ్చి వెళ్లేవారు. సుబ్బయ్య చిన్నతనం నుంచే సైన్యంలో చేరేందుకు ఆసక్తి చూపేవాడని తల్లి గాలెమ్మ రోదిస్తూ తెలిపింది. అనుకున్నట్లుగానే సైన్యంలో చేరాడని, ఇప్పుడు దేశం కోసం ప్రాణాలర్పించాడని పేర్కొన్నారు. వెంకటసుబ్బయ్య పార్థివదేహాన్ని నార్పలకు తీసుకువస్తున్నట్లు సమాచారం. అంత్యక్రియలను బుధవారం నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

బోయింగ్‌లో 1000 మంది ఉద్యోగుల తొలగింపు

» కంపెనీ ఆర్థిక సమస్యలతో లేఆఫ్‌లు

వాషింగ్టన్, డిసెంబరు 10: ముందస్తు ప్రణాళికలో భాగంగా ప్రముఖ ఏరోస్పేస్ దిగ్గజ సంస్థ బోయింగ్.. అమెరికాలో దాదాపు వెయ్యి మంది ఉద్యోగులను తొలగించింది. వాషింగ్టన్‌లో 400 మంది, కాలిఫోర్నియాలో 500 మందిని పైగా ఇంటికి పంపిందని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. దీంతో కంపెనీ ప్రస్తుత శ్రామిక శక్తి దాదాపు 17 వేలకు తగ్గింది. ఆర్థికపరమైన, నియంత్రణ సమస్యలు, దాదాపు రెండు నెలలు కొనసాగిన మెషినిస్టుల సమ్మె నుంచి కోలుకునేందుకు రాబోవు కాలంలో ఉద్యోగుల సంఖ్యను 10 శాతం మేర తగ్గించుకుంటామని బోయింగ్ ఇప్పటికే ప్రకటించింది.

పూరింటికి సీసీ కెమెరా భరోసా!



గట్టిగా గాలి దుమారమో.. వర్షమో వస్తే చెల్లాచెదురయ్యే పూరిపాక ఇది! అందులో నివాసం ఉండే పామర్తి కృష్ణయ్య దంపతులు తమ వాకిట్లో ఓ పక్కన కర్రపాతి దానికి రెండు వైపులా సీసీ కెమెరాలు బిగించారు. ఈ దంపతులకు 20 కోళ్లు, 30 మేకలున్నాయి. వీటిపై దొంగల కన్ను పడింది. అదును చూసి రెండు కోళ్లు, ఒక మేకను ఎత్తుకెళ్లారు! మరి.. కోళ్లు, మేకల కోసం రాత్రంతా నిద్ర మానకొని కావలి కాయలేరు కదా? అందుకే తమ తాహతుకు మించిన ఖర్చు అయినా కూడా భరించి... ఇలా సీసీ కెమెరా ఏర్పాటు చేయించుకున్నారు. కృష్ణయ్య దంపతులది ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం! -పెనుబల్లి (ఆంధ్రజ్యోతి)

వణుకు లేదు.. ఉక్కపోతే!

(మొదటి పేజీ తరువాయి)

చలి తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పది డిగ్రీలలోపు నమోదై చలి గజగజలాడించేది. గత డిసెంబరులో అన్ని జిల్లాల్లో సగటున 10-16 డిగ్రీల మధ్య రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ ప్రస్తుతం 16-22 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు పది డిగ్రీలలోపు నమోదైతే చలి తీవ్రత చాలా అధికంగా ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి దాకా ఓ నాలుగైదు రోజులు మాత్రమే పది డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అది కూడా సంగారెడ్డి, అసిఫాబాద్ జిల్లాల్లో నవంబరులో 8-9 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 11, ఆసిఫాబాద్‌లో 13 డిగ్రీలు మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో 15-21 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. ముఖ్యంగా 14 జిల్లాల్లో 19 డిగ్రీలపైగానే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. గతేడాది ఇదే నెల ఇదే రోజున అవే జిల్లాల్లో 13 నుంచి 17 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వడం గమనార్హం.



హిమాలయాల నుంచి వీచే గాలులు లేవు

హిమాలయాల నుంచి వీచే గాలులు ఈసారి లేవు. తూర్పు నైరుతి గాలులు ప్రస్తుతం తెలంగాణ మీదుగా వీస్తున్నాయి. దీంతో చలి లేదు. మరో నాలుగైదు రోజులు ఇలాంటి వాతావరణమే ఉంటుంది. వచ్చే వారం రోజులు కొన్ని జిల్లాల్లో ఉదయం వేళల్లో పొగమంచు పడే అవకాశం ఉంది.

- డాక్టర్ నాగరత్న, డైరెక్టర్, హైదరాబాద్ వాతావరణ కేంద్రం

ఎందుకింత వేడి ?

రాష్ట్రంలో చలి తీవ్రత కనిపించకపోవడానికి ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుపానులే కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తుపాను ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, వర్షాలు కురవడం, సూర్యకిరణాలు నేరుగా భూమిని చేరుతుండడంతో చల్లదనం ఏర్పడటం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. వర్షాల వల్ల చలిగాలులు ఎక్కువ ఎత్తులో వెళ్లిపోతాయని అందువల్ల చలి తీవ్రత ఉండదని వివరిస్తున్నారు. రాష్ట్రంలో మరో పది రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని. డిసెంబరు 20 తర్వాత చలి పంజా విసిరే అవకాశాలున్నాయని విశ్లేషిస్తున్నారు.

గత, ఈ ఏడాది డిసెంబరు 10న నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

గతేడాది	జిల్లా	ప్రస్తుతం
12.3	ఆదిలాబాద్	11
10.3	ఆసిఫాబాద్	13.7
13.3	నిర్మల్	15.7
14.3	నిజామాబాద్	16.4
15.4	హైదరాబాద్	19
13.7	హన్మకొండ	19.2
12.4	సంగారెడ్డి	19.4
14.6	ములుగు	19.4
17.6	వనపర్తి	20

రాజధాని శివారుల్లో కమ్మేస్తున్న పొగమంచు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిసరాల్లోనూ చలి తీవ్రత పెద్ద ఉండడం లేదు. కానీ, హైదరాబాద్ శివారు ప్రాంతాలను పొగమంచు కమ్మేస్తోంది. దుండిగల్, డిపోచంపల్లి, సారెగూడెం, బాచుపల్లి నిజాంపేట ప్రాంతాలను పొగమంచు కమ్మేయడంతో మంగళవారం తెల్లవారుజామున రహదారులు కనిపించని పరిస్థితి నెలకొంది.

తెలంగాణలో లక్ష క్రియాశీల కంపెనీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాలకు చెందిన కంపెనీలు లక్షకు పైగా తెలంగాణలో క్రియాశీలంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా ఈమేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత నవంబరు నాటికి వివిధ రంగాలకు చెందిన 1,05,424 కంపెనీలు క్రియాశీలంగా(యాక్టివ్) ఉన్నాయని చెప్పారు. 2023-24కు సంబంధించి ఈ కంపెనీల టర్నోవర్ దాదాపు రూ.11 లక్షల కోట్ల వరకు ఉందని తెలిపారు. నమోదిత కంపెనీల పరంగా దక్షిణ భారతదేశంలో కర్ణాటక, తమిళనాడు తర్వాత తెలంగాణ మూడో స్థానంలో ఉందని పేర్కొన్నారు.

ఐపీఎస్ కేడర్ సమీక్ష పరిశీలనలో ఉంది

- లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్

తెలంగాణలో ఐపీఎస్ కేడర్ సమీక్ష ప్రతిపాదన తమ పరిశీలనలో ఉందని కేంద్ర సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. ఈమేరకు లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం అడిగిన ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ప్రతి ఐదేళ్ల వ్యవధిలో.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి ప్రతి కేడర్ అవసరాలు, కూర్పును పునఃపరిశీలిస్తుందన్నారు. అందులో భాగంగా తెలంగాణ ఐపీఎస్‌లకు సంబంధించి 2016లో సమీక్ష నిర్వహించామని వెల్లడించారు. మళ్లీ 2021లో ఈ సమీక్ష జరగాల్సి ఉండిందన్నారు. అయితే 2021 నుంచి తెలంగాణకు కొత్తగా 49 మంది ఐపీఎస్‌లను కేటాయించినట్లు నిత్యానంద్ రాయ్ తన సమాధానంలో వెల్లడించారు.

ఆహారం వికటించి.. 15 మంది విద్యార్థినులకు అస్వస్థత

» తాండూరు గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఘటన

» నలుగురికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

తాండూరు /తాండూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారం వికటించి పిల్లలు ఆస్పత్రి పాలవుతున్న ఘటనలు ఆగడం లేదు. వికారాబాద్ జిల్లా తాండూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో మంగళవారం ఫుడ్ పాయిజన్ కలకలం రేగింది. వసతి గృహంలో మంగళవారం ఉదయం అల్పాహారంలో వడ్డించిన కిచిడి తిన్న తర్వాత 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కడుపులో నొప్పి, వాంతులతో అవస్థ పడ్డారు. మొత్తం 15 మందిలో శ్రావణి, బోలిబాయి, గీత, శైలజ అనే బాలికలకు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారికి ప్రథమ చికిత్స చేసిన వైద్యులు తిరిగి వసతి గృహానికి పంపించారు. ఉదయం అల్పాహారం తిన్న కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడాన్ని గమనించిన పాఠశాల యాజమాన్యం వారిని వెంటనే ఆస్పత్రికి తరలించింది. దీంతో విషయం బయటకు రాగా రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు వసతి గృహం వద్దకు చేరుకున్నారు. వసతి గృహం లోపలికి వెళ్లకుండా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే, వికారాబాద్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు, కౌన్సిలర్ సాహు శ్రీలత, మరో కౌన్సిలర్ అంతారం లలిత బలవంతంగా వసతి గృహంలోకి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. కడుపు నొప్పితో అల్లాడిపోతున్న ఓ బాలికను గమనించిన వారు తమ చేతులతో మోసుకుని ఆమెను బయటికి తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. కాగా, విషయం తెలిసి వసతి గృహం వద్దకు చేరుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులు అస్వస్థత గురి కావడానికి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోపక్క, విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారన్న విషయం తెలిసి స్థానిక తహసీల్దార్ తారాసింగ్, ఎంఈఓ వెంకటయ్య తదితరులు వసతి గృహానికి చేరుకుని ప్రిన్సిపాల్ విశ్వకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే వంటగదితోపాటు నిల్వ ఉన్న సరుకులు, కూరగాయాలను తహసీల్దార్ పరిశీలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని ప్రిన్సిపాల్‌కు స్పష్టం చేశారు. అలాగే, ఈ విషయంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బాధిత బాలికలకు మెరుగైన వైద్య సాయం అందించాలని కోరారు.

18న సర్వే నౌక 'ఐఎన్ఎస్ నిర్దేశక్' జలప్రవేశం

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో హైడ్రోగ్రఫిక్ సర్వేల నిర్వహణ, నేవిగేషన్ సహకారం కోసం కొత్తగా నిర్మించిన సర్వే నౌక 'ఐఎన్ఎస్ నిర్దేశక్' ఈ నెల 18న జలప్రవేశం చేయనుంది. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో నిర్వహించే ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ పాల్గొంటారు. సర్వే నౌకల తయారీకి చేపట్టిన భారీ ప్రాజెక్టులో ఇది రెండోది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని రూపొందించారు.

చెరువుల్ని ఆక్రమిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలు !

» ఆ ప్రాజెక్టులకు అనుమతులు రద్దు చేయాలి

» అధికారులు, నేతలపై చర్యలు తీసుకోవాలి

» ప్రభుత్వం స్పందించకుంటే న్యాయ పోరాటం

» హైడ్రా కమిషనర్‌కు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఫిర్యాదు



రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు చెరువులను ఆక్రమించి ప్రాజెక్టులు చేపడుతున్నాయని, వాటికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారు అధికారులైనా.. రాజకీయ నేతలైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో పలు ప్రాజెక్టులను చెరువుల్లో నిర్మిస్తున్నారంటూ మంగళవారం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు ఇలంబరిది, సర్ఫరాజ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, రెరా ఛైర్మన్ సత్యనారాయణలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గాగిల్లపూర్‌లో ఉస్మాన్ కుంట, పుప్పాల్‌గూడలో ముక్కసాని కుంట, రాజేంద్రనగర్ ప్రేమావతిపేటలో పెద్ద చెరువు, గోపన్‌పల్లిలో మేడికుంట చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను ప్రముఖ నిర్మాణ సంస్థలు ఆక్రమిస్తున్నాయని ఆరోపించారు. చెరువుల చుట్టూ విల్లాలు, 40, 50 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని, ఈ ప్రాజెక్టులకు సంబంధిత సంస్థలు గుడ్డిగా అనుమతులిస్తున్నాయన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఇతర విభాగాల నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఉందన్న కారణంతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టీజీఐఐసీలు అనుమతులు ఇస్తున్నాయని చెప్పారు. రెండు నెలల క్రితం తాను ఎక్కడెక్కడ ఏ నిర్మాణ సంస్థ చెరువులను ఆక్రమిస్తోందో బహిరంగంగా చెప్పానని, ఆ తర్వాత పది రోజులకు అనుమతులున్న భవనాల జోలికి హైడ్రా వెళ్లదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారని గుర్తు చేశారు. మరోసారి అనుమతులిచ్చిన, వాటిని పర్యవేక్షించాల్సిన సంస్థలకు ప్రత్యక్షంగా వెళ్లి ఫిర్యాదు చేస్తున్నానని, అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈవిషయాన్ని లేవనెత్తుతామని చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. ఫిర్యాదు చేయకుండా కోర్టుకెళ్తే కేసు నిలవదని, అందుకే ముందుగా ఆయా విభాగాల దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అనుమతులున్న భవనాలను కూల్చలేదని రంగనాథ్ చెబుతున్నారని, పర్మిషన్ ఉన్నా ఇళ్లు కూల్చితే.. సంబంధిత యజమానులు తనను సంప్రదించాలని వెంకటరమణారెడ్డి కోరారు.

శ్రీవారి సేవలో మాజీ మంత్రి హరీష్‌రావు

తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ మంత్రి హరీష్‌రావు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అర్చన సేవలో పాల్గొన్న హరీష్‌రావుకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అంతకుముందు సోమవారం రాత్రి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని హరీష్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధిపేట కోమటి చెరువు ప్రాంతంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం ఆ ప్రాంతంలో 5 ఎకరాల స్థలాన్ని మంజూరు చేసినట్టు ఛైర్మన్‌కు వివరించి రానున్న బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఈవీఎం శంకలు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన మహావికాస్ అగాడీ నేతలంతా ఈవీఎంలను తప్పుబడుతున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటన చేసింది. ఈవీఎంలలో పోలైన ఓట్లకూ, వీవీప్యాట్ స్లిప్పులకూ మధ్య వీసమెత్తు వ్యత్యాసం కనబడలేదని, దేశస్థాయిలో ఏ విధానమైతే అమలు జరుగుతున్నదో, మహారాష్ట్రలోనూ అదేరీతిలో ఎన్నికలు జరిగాయని ఈసీ వివరణ ఇచ్చింది. 288మంది సభ్యులున్న అసెంబ్లీలో 235సీట్లను మహాయుతి ఎగరేసుకుపోయి, అగాడీ కూటమికి 46మాత్రమే దక్కినందువల్ల, ఈ ఘోరపరాజయం ప్రజల నిరాదరణవల్ల కాక, ఓట్లమిషన్‌లో సాంకేతిక మతలబు వల్ల జరిగిందని గట్టిగా నమ్ముతున్న అగాడీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈసీ వివరణతో సంతృప్తిచెందని వీరంతా ఇప్పుడు సుప్రీంకోర్టుకు పోవాలని నిర్ణయించుకున్నారు. సుప్రీంకోర్టు ఇటీవలే వ్యాఖ్యానించినట్టుగా ఓడినవారికి ఈవీఎం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఓ ఆత్మరక్షణ కవచం.

ఓటింగ్ మెషీన్లనూ, వాటిద్వారా జరిగిన ఎన్నికలను తిరస్కరిస్తూ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో విపక్ష ఎమ్మెల్యేలు ఒకటి రెండురోజుల పాటు ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండిపోయారు కూడా. బ్యాలెట్‌పేపర్లతో తిరిగి ఎన్నికలు జరగాలంటూ మర్కడ్‌వాడి గ్రామ ప్రజలు డిమాండ్ చేయడం, ఈవీఎం వ్యతిరేక విపక్ష ఉద్యమానికి అది కేంద్రం కావడం తెలిసిందే. ఈ గ్రామం ఉన్న అసెంబ్లీస్థానం శరద్‌పవార్ వర్గానికే దక్కినప్పటికీ, గెలిచిన అభ్యర్థికి కంచుకోటలాంటి ఈ గ్రామంలో మాత్రం అతడికి ప్రత్యర్థికంటే అతితక్కువ ఓట్లు పడ్డాయట. గ్రామస్తులంతా ప్రమాణంచేయడంతో, పవార్ వర్గం ఓ పాతికలక్షలు ఖర్చుపెట్టి మళ్ళీ అక్కడ బ్యాలెట్ ఓటింగ్ జరపడం, అధికారులు అడ్డుకోవడం, పోలీసుల దాడి, కర్ఫ్యూ ఇత్యాది పరిణామాలతో ఈ గ్రామానికి బాగా పేరొచ్చింది. శరద్‌పవార్ అక్కడకు వెళ్ళి మర్కడ్‌వాడీని చూసి రాష్ట్రమంతా, ఇంకా చెప్పాలంటే దేశమంతా నేర్చుకోవాలనీ, ఈవీఎంలకు వ్యతిరేకంగా ఉద్యమించాలనీ ఉపన్యసించి వచ్చారు. ఆ చిన్నగ్రామం దేశస్థాయిలో ఈవీఎం వ్యతిరేక ఉద్యమాన్ని రగల్చాలన్నది పెద్దాయన ఆశ.

ఒకపక్క ఓట్లమెషీన్ ఎన్నికలను నమ్మబోమని అంటూనే, మరోపక్క తమకు విపక్షస్థానం ఇవ్వాలంటూ అగాడీ నేతలంతా అధికారపక్షాన్ని డిమాండ్ చేస్తున్నారు. విపక్షంగా గుర్తించాలంటే మీలో ఏ ఒక్కపార్టీకీ కనీసంగా ఉండాల్సిన పదిశాతం స్థానాలు రాలేదు కదా అని అధికారపక్షం అంటోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు అసలు ఓనర్లనూ, వారసులనూ పక్కకు నెట్టేసి, పార్టీలను చీల్చిన వారిని ఘనంగా ఆదరించిన విషయం తెలిసిందే. ఉద్ధవ్ ఠాక్రే సరేసరి, ఒకప్పుడు మహారాష్ట్రలో చక్రం తిప్పిన శరద్‌పవార్, కాంగ్రెస్‌లకు సైతం ప్రజలు ఈ ఎన్నికల్లో విపక్షహోదాకు సరిపడా 29స్థానాలు కూడా ఇవ్వలేదు. అత్యంత బల ప్రజాస్వామ్యం నిలవాలంటే విపక్షం ఉండాల్సిందే, సభలో మంచీచెడూ చర్చ జరగాల్సిందే అని ఓపక్కన అంటూనే అధికారపక్షం గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ స్పీకర్‌గా రాహుల్ నర్వేకర్ మరో రాకడ ఇటువంటి అనేకానేక అంశాల్లో బీజేపీ చక్కని ఎత్తులు వేయడానికి ఉపకరిస్తుంది. ఆ హోదా ఇచ్చేదీ లేనిదీ, ఇస్తే ఏ పార్టీకి, ఏ నాయకుడికి ఆ కిరీటం దక్కాలన్నది నర్వేకర్ తొలిగా తేల్చబోయే సమస్య. ఆయన ఘనమైన గతం తెలిసిందే కనుక, భవిష్యత్తులో వచ్చిపడే చిక్కు సమస్యలను కూడా సునాయాసంగా పరిష్కరించగలడని బీజేపీ నమ్మకం. రెండేళ్ళక్రితం తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతూనే స్పీకర్‌స్థానంలో కూచున్న ఆయన అత్యంత సంక్షుభిత ఘట్టాల్లో బీజేపీని ఒడ్డునపడేశారు. అసలు శివసేన, అసలు ఎన్సీపీ ఎవరో సునాయాసంగా తేల్చేశారు. రెండుపార్టీలనుంచి పెద్ద ఎత్తున సాగిన బహిష్కరణలు, అనర్హతల లెక్కలను బీజేపీ సున్నితపు త్రాసులో తూచి, ఎవరూ అనర్హులు కారంటూ తేల్చి శిందే, అజిత్‌పవార్ కక్షానికి ఏమాత్రం నష్టం వాటిల్లకుండా చేశారు.

ఫడ్నవీస్ చల్లగా నాలుగుకాలాలపాటు రాజ్యం చేసుకోవడానికి నర్వేకర్ వంటి విశ్వాసపాత్రుడు అవసరం. స్పీకర్ పోస్టు ఇవ్వమని ఏక్‌నాథ్ శిందే, అజిత్‌పవార్ అడిగినా బీజేపీ ఒప్పుకోలేదని, మరో నాలుగురోజుల్లో జరిగే మంత్రివర్గ విస్తరణలో వీరికి దక్కే శాఖలను బట్టి పైచేయి ఎవరన్నది పూర్తిగా తేలిపోతుందనీ అంటున్నారు. హోం కావాలన్న శిందే ఇప్పటికే చల్లారినప్పటికీ, ఆర్థికం కోసం అజిత్‌పవార్ పట్టుబడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర బీజేపీలో ఫడ్నవీస్‌కు ఎదురులేదు. కానీ, కష్టపడి చీల్చితెచ్చుకున్న బలం భవిష్యత్తులో తనకు గానీ, పార్టీకి గానీ ప్రమాదం తెచ్చిపెట్టకుండా అతిజాగ్రత్తగా అడుగులువేయాల్సిన బాధ్యత ఆయనమీద ఉంది.

సిరియాలో ప్రస్తుత పరిణామాలు షియా– సున్నీ తెగల మధ్య అధికార పోరాట పర్యవసానాలు ఎంత మాత్రం కాదు. అవి మూమ్మాటికీ గ్యాస్ విపణిపై పట్టు కోసం జరుగుతున్న పోరాటం విపరిణామాలే. చమురు, సహజ వాయువు నిల్వలు అపారంగా ఉన్న అరబ్బు నేల నుండి ఐరోపాకు వెళ్లే మార్గంలో భౌగోళికంగా అనువైన ప్రదేశంలో సిరియా ఉండడంతో అక్కడ అస్మదీయ పాలకులు అవసరం.

చమురు విపణిపై పోరులో సిరియా బలి

ప్రచ్చన్న యుద్ధ కాలం నుంచి నేటి ఉక్రెయిన్ వివాదం వరకు రష్యాకు విశ్వసనీయ మిత్రుల జాబితాలో అగ్ర స్థానంలో ఉన్న దేశం సిరియా. వామపక్ష భావజాలం కంటే సిరియా భౌగోళిక స్థానమే వాణిజ్య అవసరాలరీత్యా ఆ అరబ్ దేశానికి రష్యాను అత్యంత సన్నిహితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా రష్యా ప్రభావం అంతరించిపోయిందని భావించిన క్రమంలో దశాబ్దం క్రితం సిరియాలో అమెరికా అనుకూల తిరుగుబాటుదారుల కారణాన బషార్ అల్ అస్సాద్ సర్కారు పతనపు అంచుకు చేరింది. రష్యా ఆ కీలక సమయంలో బషార్ ప్రభుత్వానికి సైనికంగా చేయూతనిచ్చి నిలబెట్టింది. తద్వారా తాము ఇంకా అమెరికాకు అడ్డుకట్ట వేయగలుగుతామని ప్రపంచానికి రష్యా సంకేతాలు పంపించింది.

అత్యధికులు అభిప్రాయపడుతున్నట్లుగా సిరియాలో ప్రస్తుత పరిణామాలు షియా– సున్నీ తెగల మధ్య అధికార పోరాట పర్యవసానాలు ఎంత మాత్రం కాదు. అవి, మూమ్మాటికీ గ్యాస్ విపణిపై పట్టు కోసం జరుగుతున్న పోరాటం విపరిణామాలే. చమురు, సహజ వాయువు నిల్వలు అపారంగా ఉన్న అరబ్బు నేల నుండి ఐరోపాకు వెళ్లే మార్గంలో భౌగోళికంగా అనువైన ప్రదేశంలో మధ్యధరా సముద్రం తీరంలో సిరియా ఉండడంతో అక్కడ అస్మదీయ పాలకులు అవసరం.

టర్కీ, ఐరోపా ఖండం తమ చమురు, గ్యాస్ అవసరాల కొరకు రష్యాపై ఆధారపడుతున్నాయి. వాటి ఈ అనివార్యతను రష్యా తన వజ్రాయుధంగా వాడుకొంటోంది. అమెరికా, ఐరోపా దేశాలు రష్యా ఆధిపత్యాన్ని నిర్మూలించి దాని ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో బెలరూస్, ఉక్రెయిన్ ఉద్రిక్తతలు

గల్ఫ్ లేఖ

తెరపైకి వచ్చాయి. రష్యా తరహా భారీ నిక్షేపాలు ఉన్న ఇరాన్, ఖతర్ దేశాలు కూడ గ్యాస్ విపణిపై పట్టుకొరకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా ఆంక్షల కారణాన ఇరాన్ వెనుకంజలో ఉండగా ఖతర్ మాత్రం ముందుకు దూసుకెళ్లతోంది. ఖతర్ నుండి పైపు లైను ద్వార ఐరోపాకు చమురు, గ్యాస్ సరఫరాలకు సిరియా సహకారం అనివార్యం. అమెరికా, ఐరోపా, టర్కీలు ఖతర్‌కు ఈ విషయమై బాసటగా నిలుస్తున్నా సిరియా అందుకు అంగీకరించడం లేదు. తమకు అన్ని విధాలుగా అండగా ఉంటున్న రష్యా ఇరాన్‌లను కాదని ఖతర్ ప్రతిపాదనకు సిరియా అంగీకరించలేదు, అధ్యక్షుడు బషార్ అల్ అస్సాద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ఇది ఒక ప్రధాన కారణమని విశ్లేషకుల అభిప్రాయం.

సిరియాలోని మధ్యధరా సముద్రతీర ప్రాంతాలలో నౌకా, వైమానిక దళాల స్థావరాలను నెలకొల్పుకోవడం ద్వారా ఐరోపాకు అవసరమైన



చమురు సరఫరా జరుగుతుండే సముద్ర మార్గాలపై తన పట్టును పటిష్టపరచుకోవడానికి రష్యా ప్రయత్నిస్తోంది. అలాగే కీలక జలాల్లో నాటో, అమెరికాలను నిలువరించడం, తమపై తిరగబడ్డ ఉక్రెయిన్, బెలరూస్ దేశాల భూభాగాల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయంగా తన గ్యాస్, చమురు సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి రష్యా సంకల్పించింది. ఇందుకు మిత్ర దేశమైన సిరియా సముద్ర తీరం రష్యాకు కలిసి వచ్చింది. చమురు ఉత్పాదక దేశమైన రష్యా మధ్యధరా తీరంలోని లిబియాతో సహా అవతలి వైపు ఉన్న చమురు ఉత్పాదక అరబ్బు దేశాలలో కూడ తన పలుకుబడిని పెంచుకున్నది. సిరియాలో బషార్ అల్ అస్సాద్ ప్రభుత్వాన్ని పరిరక్షించడం ద్వారా రష్యా తన సైనిక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకున్నది. కీలక ప్రపంచ వ్యవహారాలలో తన పాత్ర, అభీష్టం కూడా ఉంటుందని దౌత్యపరంగా సూచనలు పంపింది.

బషార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దానికి పైగా పోరాడుతున్న తిరుగుబాటుదారులకు అమెరికా, టర్కీ, కొన్ని గల్ఫ్ దేశాలు బాసటగా ఉన్నాయి. అయినా తిరుగుబాటుదారులను రష్యా వైమానిక దళాల సహాయంతో నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం ద్వారా తన అధికారాన్ని బషార్ కాపాడుకోగలిగారు. ఇరాన్, దాని అనుకూల సాయుధ షియా బృందాలు కూడా బషార్‌కు పూర్తిగా మద్దతుగా నిలిచాయి. బయటి నుండి ఎంత మద్దతు పొందినా స్థానికంగా తిరుగుబాటుదారులతో సంధికి కాదు కదా కనీసం చర్చలు జరిపేందుకు సైతం సిరియా ప్రభుత్వం ముందుకు రాలేదు. తిరుగుబాటును బషార్ ప్రభుత్వం పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చిందని అత్యధికులు భావించారు, బషార్‌ను గద్దె దించడం వీలుకాదని చాలా మంది విశ్వసించారు. అయితే అనూహ్యంగా గత పక్షం రోజులలో ఎలాంటి ప్రతిఘటన లేకుండా సిరియా సైనిక దళాలు స్వచ్ఛందంగా తిరుగుబాటుదారులకు లొంగిపోవడంతో బషార్ ప్రభుత్వం పతనమయింది. ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం.

సరే, బషార్ దేశం నుంచి పరారయ్యారు. ఇప్పుడు సిరియాను ఎవరు ఏ విధంగా పాలించనున్నారు? ఇదే అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సద్దాం హుస్సేన్ తర్వాత ఒకప్పటి అరబ్బు అగ్రరాజ్యం, విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన ఇరాక్ విచ్ఛిన్నమై ఉగ్రవాదానికి ఊతమైంది. పొరుగున ఉన్న ఇరాక్‌లో వలే సిరియాలో కూడ క్రైస్తవులు, షియా, సున్నీ తెగల ముస్లింలు కలిసి మెలిసి నివసిస్తున్నారు. ఈ రెండు దేశాలలోనూ సిరియా క్రైస్తవుడయిన మైఖెల్ అఫ్లాఖ్ స్థాపించిన (వామపక్ష భావజాల ప్రభావిత) బాత్ పార్టీ సైనిక కమాండర్లు సద్దాం హుస్సేన్, బషార్ అల్ అస్సాద్ తండ్రి హాఫెజ్ అల్ అస్సాద్‌లు ఇరాక్, సిరియా దేశాధినేతలుగా సుదీర్ఘకాలం పాలించారు. వర్గ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలలకు బాత్ పార్టీ భావజాలం ప్రాధాన్యమిస్తుంది.

అరబ్బులలో అభ్యుదయ భావాలు కలిగి లౌకిక వాదం వర్ధిల్లిన ఏకైక దేశం సిరియా కూడా ఎట్టకేలకు ఇస్లామిక్ మతఛాందసవాదుల చేతికి చిక్కిందని చెప్పవచ్చు. అల్‌ఖైదా ఒడిలో పెరిగిన ఉగ్రవాది అబూ మోహమ్మద్ అల్ జ్వాలనీ ఆచూకీ తెలిపితే పది మిలియన్ డాలర్ల పారితోషికాన్ని ఇస్తామని అమెరికా ఒకప్పుడు ప్రకటించింది. మరి అదే జ్వాలనీ నేడు సిరియాను పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకుంటే పరాయి దేశం వ్యవహారంతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రక్కకు తప్పుకున్నది! ఇది, ప్రపంచ అగ్రరాజ్య ద్వంద్వ నీతిని ప్రతిబింబిస్తుందనడంలో సందేహం లేదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రహసనంగా మారుతున్న పార్లమెంట్



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఒక గుర్రానికీ, దుప్పికీ మధ్య ఘర్షణ జరుగుతుంది. దుప్పితో నెగ్గకురాలేని గుర్రం వేటగాడి వద్దకు వెళ్లి సహాయం కోరుతుంది అందుకు సరేనన్న వేటగాడు నీ దవడల మధ్య ఇనుప కడ్డీ పెట్టి కళ్లెం బిగించేందుకు, నీ వీపుపై జీను వేసి నేనెక్కి నడిపించేందుకు అనుమతించు చాలు. నీ శత్రువును వెంటాడి వేటాడొచ్చు.. అని అంటాడు. ఈ షరతులకు గుర్రం అనుమతిస్తుంది. చివరకు దుప్పినైతే వేటగాడు వేటాడి చంపుతాడు కాని గుర్రాన్ని అలాగే అదుపులో ఉంచుకుంటాడు. దుప్పిమీద కోపంతో వేటగాడి సహాయం కోరితే జీవితాంతం వేటగాడి అదుపులో ఉండాల్సి వస్తోందని గుర్రం బాధపడుతుంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం గ్రీసులో ఒక బానిస చెప్పిన పిట్టకథల్లో ఇదొకటి.

'ప్రజాస్వామ్యాలు ఎలా మరణిస్తాయి' (హౌ డెమాక్రసీస్ డై) అన్న పుస్తకంలో హార్వార్డ్ యూనివర్సిటీకి చెందిన రాజనీతి శాస్త్రజ్ఞులు స్టీవెన్ లెవిట్స్కీ, డేనియల్ జిబాల్ట్ ఈ పిట్టకథను ఉటంకిస్తూ ఎన్నికైన నేతలు తమ అధికారాన్ని పెంచుకునేందుకు ప్రజాస్వామ్యాన్ని ఎలా హరిస్తారో వివరించారు. అమెరికా ప్రజాస్వామ్యంపై డోనాల్డ్ ట్రంప్ ప్రభావాన్ని కూడా ఈ పుస్తకం వివరిస్తుంది. పరస్పర సహనం, గౌరవం అధికార ప్రతిపక్షాలు ఎలా కోల్పోతాయో ఈ రచయితలు వివరించారు. వెనిజులా, రష్యా వంటి లాటిన్ అమెరికా, యూరప్ దేశాల్లో పరిస్థితులను కూడా వారు తమ వాదనలను సమర్థించుకునేందుకు ఉదహరించారు.


భారతదేశంలో కూడా పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అనిపించదు. గత పది రోజులుగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలను చూస్తుంటే అసలు ప్రజాస్వామ్య ప్రక్రియను కొనసాగించేందుకు ఎవరికైనా ఆసక్తి ఉన్నదా అనిపిస్తుంది. 18వ లోక్‌సభ ప్రారంభమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ తన ప్రభుత్వం సభలోనూ, బయటా ఏకాభిప్రాయం సాధించేందుకు కృషి చేస్తుందని, కాని ప్రతిపక్షం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ప్రజలు ఆశిస్తారని, సభలో హంగామా సృష్టించడం వారికి నచ్చదని చెప్పారు. నవంబర్ 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా మోదీ దాదాపు ఇదే వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తిరస్కరించిన గుప్పెడు మంది తమ స్వార్థపర రాజకీయ ప్రయోజనాలకోసం పార్లమెంట్‌ను భగ్నం చేయాలని చూస్తున్నారని కొత్త ఆలోచనలతో, ఉత్సాహంతో వచ్చిన కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం లభించడం లేదని అయన ఆవేదన వ్యక్తం చేశారు.

మోదీ వ్యాఖ్యలు ఎలా ఉన్నప్పటికీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు, శీతాకాల సమావేశాలు రెండూ పెద్దగా జరగలేదు. బీజేపీని 240 సీట్లకు కుదించామన్న ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తొలి సమావేశాల్లో కలిసికట్టుగా సభలో తమదే పై చేయి అన్నట్లుగా వ్యవహరించాయి. కాని బడ్జెట్ సమావేశాలకూ శీతాకాల సమావేశాలకూ మధ్య జరిగిన హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఘన విజయాలు సాధించడంతో ప్రతిపక్షాల నైతిక సె[illegible]ం దెబ్బతిన్నది. కాని సరిగ్గా శీతాకాల సమావేశాలకు ఒకటి రెండు రోజుల ముందు అదానీ రాష్ట్ర ప్రభుత్వాలకు ముడుపులు చెల్లించారని అమెరికన్ ప్రాసిక్యూటర్లు ఆరోపించడం ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఉత్సాహాన్ని రేకెత్తించింది. దీనితో అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని వారు డిమాండ్ చేస్తూ ఉభయ సభలను స్తంభింపచేయడం మొదలు పెట్టారు. రాజ్యాంగ దినోత్సవం, ఒకటి రెండు బిల్లులపై చర్చలు జరిగినప్పటికీ గత 15 రోజులుగా పార్లమెంట్‌లో పెద్దగా కార్యకలాపాలు జరగలేదు.

అసలు పార్లమెంట్‌లో జరుగుతున్నది ప్రజలు గమనిస్తున్నారా? ఎంతమందికి పార్లమెంటరీ కార్యకలాపాల పట్ల ఆసక్తి ఉన్నది? జాతీయ స్థాయిలో ఢిల్లీలో కాలుష్యం, మహారాష్ట్రలో దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణస్వీకారం, ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన, సిరియాలో తిరుగుబాటు వంటి వార్తలకు వచ్చిన ప్రాధాన్యం కూడా పార్లమెంట్ సమావేశాలకు రావడం లేదు. పార్లమెంట్‌లో ఎంపీలు లిఖిత పూర్వకంగా అడిగే ప్రశ్నల్లో, మంత్రులు ఇచ్చే జవాబుల్లో పస కనబడడం లేదు. అంతా యాంత్రికంగా, మొక్కుబడిగా జరుగుతున్నట్లు కనపడుతోంది. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా పార్లమెంట్‌లో అద్భుతమైన ప్రసంగాలు కానీ, చర్చలు కానీ జరిగిన దాఖలాలు లేనే లేవు. ఒకప్పుడు హేమాహేమీలైన నేతలు మాట్లాడుతుంటే మీడియా, అతిథుల గ్యాలరీలు కిక్కిరిసిపోయి కనిపించేవి. ఇప్పుడు పార్లమెంట్ గ్యాలరీలు మీడియా ప్రతినిధులు లేక వెలవెలబోతున్నాయి. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, అధిక దూరం నడవాల్సి రావడం, పార్లమెంట్‌లో చర్చలు జరగకపోవడం వల్ల మీడియా ప్రతినిధులు ఎప్పుడో కాని వెళ్లవలసిన అవసరం కూడా కనపడడం లేదు. మొదటి లోక్‌సభ సగటున ఏడాదికి 135 రోజులు సమావేశమయితే రాను రానూ ప్రతి లోక్‌సభ సమావేశాలు తగ్గిపోతూ వస్తున్నాయి. 17వ లోక్‌సభ కేవలం 55 రోజుల పాటే సమావేశమైంది. పార్లమెంట్‌లో ఆమోదించే అనేక బిల్లులు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కాని వాటి గురించి కూడా పార్లమెంట్‌లోనూ, బయటా జరగాల్సిన చర్చ జరగడం లేదు. చర్చ లేకుండా వాటిని ఆమోదించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. 17వ లోక్‌సభలో 35 శాతం బిల్లులపై కేవలం గంటలోపే చర్చ జరిగి ఆమోదం పొందాయి. 18వ లోక్‌సభ ముగిసే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు.

అసలు 'మోదీ అదానీ ఏక్ హై' అని పార్లమెంట్‌లో నినాదాలు చేస్తూ, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న ప్రతిపక్షాలకు మీడియాలోనూ, బయటా ఎంత ప్రాధాన్యత లభిస్తోంది? అదే సమయంలో కశ్మీర్ స్వతంత్రతను సమర్థించిన అమెరికన్ పారిశ్రామికవేత్త జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని బీజేపీ నేతలు చేస్తున్న వాదనలను ఎంత మంది పట్టించుకుంటున్నారు? నిజానికి ఈ అంశాలు ఎన్నికల ప్రచారంలోనూ చర్చకు వచ్చాయి కాని ఈ ఆరోపణల ఆధారంగా ప్రజలు ఓటింగ్ చేశారని చెప్పేందుకు ఖచ్చితమైన ఆధారాలు ఏమీ లేవు. కాని పార్లమెంట్ సమావేశాల సమయంలోనే వీటిని ప్రస్తావించి సభను భగ్నం చేసేందుకు ఇరు పక్షాలు ఎందుకు పూనుకుంటున్నాయి?

నిజానికి పార్లమెంట్ సజావుగా జరగాలని అధికార ప్రతిపక్షాల్లో ఎవరు అనుకుంటున్నారో చెప్పడం కష్టం. ఉభయ పక్షాలూ తాము అధికారంలో లేనప్పుడు పార్లమెంట్ ప్రతిష్టంభనను ఆయుధంగా వాడుకున్నవారే. 1987లో బోఫోర్స్ కుంభకోణంపై ప్రతిపక్షాలు 45 రోజుల పాటు సభ స్తంభించిపోగా 2010లో శీతాకాల సమావేశాలు మొత్తం 2జీ కుంభకోణంపై అట్టుడికిపోయాయి. 2012లో బొగ్గు కుంభకోణంపై ఆరు



పార్లమెంట్‌లో ఎంపీలు లిఖిత పూర్వకంగా అడిగే ప్రశ్నల్లో, మంత్రులు ఇచ్చే జవాబుల్లో పస కనబడడం లేదు. అంతా యాంత్రికంగా, మొక్కుబడిగా జరుగుతున్నట్లు కనపడుతోంది. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా పార్లమెంట్‌లో అద్భుతమైన ప్రసంగాలు కానీ, చర్చలు కానీ జరిగిన దాఖలాలు లేనే లేవు. 17వ లోక్‌సభ (2019–24)లో 35 శాతం బిల్లులు కేవలం గంటలోపు చర్చతోనే ఆమోదం పొందాయి. 18వ లోక్‌సభ ముగిసే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు.

రోజుల పాటు సభలు జరగలేదు. అప్పుడు భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సమావేశాలను స్తంభింపచేసేందుకు వెనుకాడలేదు. 'పార్లమెంట్‌ను స్తంభింపచేయడం ప్రజాస్వామ్యానికి మంచిది. అదేమంత అప్రజాస్వామికం కాదు' అని రాజ్యసభలో ప్రతిపక్ష నేత అరుణ్ జైట్లీ నాడు వ్యాఖ్యానించారు. 'పార్లమెంట్‌ను సరిగ్గా పనిచేసేందుకు అనుమతించకపోవడం కూడా ప్రజాస్వామ్య లక్షణమే' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ కూడా వ్యాఖ్యానించారు. 2001లో తెహెల్కా కుంభకోణంపై కూడా కాంగ్రెస్ 17 రోజులు పార్లమెంట్‌ను స్తంభింపచేసినప్పుడు కూడా తన్ను తాను సమర్థించుకుంది. ఇప్పుడు కూడా పార్లమెంట్ ప్రతిష్టంభనను సమర్థించుకుంటోంది.

నిజానికి బోఫోర్స్, హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణం 2జీ కుంభకోణాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని నియమించిన తర్వాత సభలు సజావుగా సాగాయి. జేపీసీలకు తమ పార్టీ సభ్యులే చైర్మన్లుగా ఉంటారని, వాటి ద్వారా ప్రభుత్వాలు క్లీన్ చిట్ ఇప్పించుకోవడం సాధ్యమని తెలిసినప్పటికీ ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఎలాంటి పట్టువిడుపులకూ ఆస్కారం కల్పించడం లేదు. అదే సమయంలో ప్రతిపక్షాలు ఒకే అంశంపై చర్చించాలని పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్‌కు ఒప్పుకోనప్పుడు ఇతర అంశాలపైన అయినా చర్చించేందుకు అవి ముందుకు రావడం లేదు. ప్రభుత్వమే ఈ ప్రతిష్టంభనకు కారణమని కొత్తగా సభ్యురాలైన కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ వాద్రా కూడా విమర్శించారు. ఎవరూ వెనక్కు తగ్గేందుకు సిద్ధంగా లేనందువల్లే ఈ పరిస్థితి తలెత్తుతోంది. గతంలో ఇందిరాగాంధీ తన ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి విదేశీ శక్తులు కారణమని తరుచూ ఆరోపించేవారు ఇప్పుడు బీజేపీ కూడా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విదేశీ శక్తులు కుట్ర చేస్తున్నాయని ఆరోపిస్తోంది.

దీనివల్ల కొన్ని అవాంఛనీయమైన పరిణామాలు జరుగుతున్నాయి. సోనియాగాంధీకి విదేశీ నిధులపై బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, ఇతర ఎంపీలు సభలో ప్రకటనలు చేయడాన్ని అనుమతించడంతో పాటు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రతిపక్షాలపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం, మణిపూర్, రైతుల నిరసనపై నోటీసులను తిరస్కరించడం ఒక ఎత్[illegible] రాజ్యసభ చైర్మన్‌పైనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష నేతలు నిర్ణయించడం రాజకీయాలను మరింత అనారోగ్యకరంగా మార్చాయి. కాంగ్రెస్ వైఖరి రాజ్యాంగానికే అవమానమని జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. గతంలో వెంకయ్యనాయుడు రాజ్యసభ చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రతిపక్షాలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి వారిని శాంతిపచేసేవారు. ఇప్పటి రాజ్యసభ చైర్మన్ అధికార పార్టీ నేతల కన్నా కటువుగా మాట్లాడుతున్నట్లు కనపడుతోంది. అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ జరిగినా ప్రతిపక్షాలు నెగ్గే అవకాశం లేదు అయినప్పటికీ పెద్దల సభ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించడం, దానిపై చర్చ జరగడం ఏ మాత్రం ఆరోగ్యకరం కాదు. ఇలా జరగడం పార్లమెంట్ చరిత్రలో మొదటిసారి. అధికార, ప్రతిపక్షాల మధ్య సంబంధాలు ఇంత విషపూరితంగా మారేందుకు ఎవరు కారణం? 18వ పార్లమెంట్ తొలి రెండు సమావేశాలే ఇలా జరిగితే రానున్న అయిదు సంవత్సరాలు ఎంత దారుణంగా మారతాయో చెప్పలేము.

భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడం అనేది దేశ పాలక ప్రతిపక్షాల చేతుల్లో లేదని రోజురోజుకూ స్పష్టమవుతోంది. ఏ ఒక్క రాజకీయ పార్టీ, ఏ ఒక్క రాజకీయ నేతకూ ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం సాధ్యం కాదు. ప్రజాస్వామ్య ఆలయమైన పార్లమెంటు సమావేశాలు, చర్చలు హాస్యాస్పదంగా, విషాదంగా మారకుండా చూడడం ప్రజల బాధ్యత.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

మారిన సర్కారు – మారని ధరణి

గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రారంభించి నాలుగు సంవత్సరాలు గడిచింది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర భౌగోళిక వైశాల్యం రెండు లక్షల పన్నెండు వేల ఏడు చదరపు కిలోమీటర్లు. భూమి మొత్తం విస్తీర్ణం రెండు కోట్ల ఎనభై లక్షల ఎకరాలు. రాష్ట్రంలో భూమి రికార్డుల కంప్యూటరీకరణలో భాగంగా 2018లో భూప్రక్షాళన పేరుతో తేలిన భూమి విస్తీర్ణం రెండు కోట్ల 55 లక్షల ఎకరాలు. ఏ వివాదాలు లేని భూములు రెండు కోట్ల ముప[illegible]నిమిది లక్షలు. వివాదాలు ఉన్న భూములు 17 లక్షల 89వేల ఎకరాలు. ఏ వివాదాలు లేని పట్టా భూములు 1,42,12,826 ఎకరాలు. నగరాలు, గ్రామీణ నివాస ప్రాంతాలు మొత్తం కలిపితే 24 లక్షల ఎకరాలు. వక్ఫ్, దేవాలయ భూములు రెండు కలిపితే ఒక లక్షా పందొమ్మిది వేల ఏడు వందల ఎకరాలు. లావుని పట్టాలుగా ఇవ్వబడినవి 20 లక్షల పైచిలుకు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి ఏడు లక్షల ఇరవై వేల ఎకరాలు. గెట్టు పంచాయితీ లేని అటవీ భూములు 41,74,652 ఎకరాలు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా నమోదు చేయబడినవి 11 లక్షల 95 వేల 889 ఎకరాలు. అందులో పట్టాదారులందరికీ కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేసింది. వీటితో పాటుగా ప్రభుత్వ భూములను, వ్యవసాయేతర భూములను, వక్ఫ్, దేవాలయ భూములు, అటవీ భూములు, లావణి పట్టాల భూములను చేర్చింది. వాటి విస్తీర్ణాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేసింది. కొంచెం మొత్తం భూమి లెక్కలు బయటికి వచ్చాయి.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోవడానికి ధరణిలోని లోపాలు ఒక కారణం. గ్రామీణ ప్రజలు, వ్యవసాయం ఆధారంగా జీవించే వారికి వారి భూములు భద్రంగా ఉన్నాయని భరోసా ఇవ్వగలిగే చట్టం కావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చే కొత్త చట్టం ధరణికి భిన్నంగా ఉంటేనే ప్రజలు స్వాగతిస్తారు. లేకుంటే దూరమవుతారు.

పట్టా భూముల రిజి[illegible]న్ అధికారాలను సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి తహశీల్దారుకు జాయింట్ రిజిస్ట్రార్ హోదాగా నామకరణం చేసి అక్కడే పట్టా భూముల రిజి[illegible]న్‌కు అధికారాలను ఇచ్చింది. ల్యాండ్ రికార్డ్స్ అప్డేషన్ ప్రోగ్రాంలో చోటుచేసుకున్న తప్పులు ఒక్కొక్కటి బయటికి వచ్చాయి. అందులో పట్టేదారు పేరు, తండ్రి పేరు, కులం, జెండర్, విస్తీర్ణం, భూమి స్వభావం, కాస్తు కాలం లాంటి ఎన్నో తప్పులు బయటికి వచ్చాయి. పొరపాట్లు సవరించే అధికారం స్థానిక రెవెన్యూ అధికారికి కాకుండా ప్రతి చిన్న తప్పు సరిదిద్దడానికి పై అధికారులకు అధికారాలను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. 80 శాతం పనులు తహశీల్దారు వద్దనే జరగవలసింది కానీ, అన్ని అధికారాలు కలెక్టర్‌కి ఇచ్చేశారు. ఇక్కడే రైతుల అవస్థలు మొదలయ్యాయి. ఒక్కొక్కరిది ఒక్కో సమస్య.. తహశీల్దారు నా పరిధి లేదంటున్నారు. అన్నీ కలెక్టర్ అనేసరికి అందరూ కలెక్టర్, ఆర్డీఓ, మండల ఆఫీస్ చుట్టూ తిరగలేకపోతున్నారు. 60 నుంచి 70శాతం రైతులు అనేక కష్టాలు పడుతూనే ఉన్నారు.

ఎంతోమంది ఎన్నో రకాల సమస్యలతో రెవెన్యూ కార్యాలయాల ముందు దరఖాస్తు చేసినప్పటికీ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. అన్నింటికీ జవాబులు కలెక్టర్ లేదా హైదరాబాదు నాంపల్లి భూమి కమిషనర్ వద్దనే కేంద్రీకృతమయ్యాయి. గత ప్రభుత్వంలోనే గ్రామాల వారీ సర్వే చేసినప్పుడు ప్రతి గ్రామంలో 200 నుంచి 300 వరకు సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు లెక్క తేలింది. వాటిని



ధరణి పోర్టల్‌లో ప్రవేశపెట్టిన ఏ మాడ్యులర్ కూడా పరిష్కరించలేదు. దీనికి కారణం ధరణి మాడ్యూల్ సాఫ్ట్‌వేర్ టెక్ ఇతర దేశస్థుల చేతుల్లో ఉంది. రోజురోజుకు సమస్య తీవ్రమయ్యింది. ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వంలో మార్పు రాలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయింది. దీనికి ధరణిలోని లోపాలు ఒక కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామంటూ ప్రచారం చేసింది. ఆ స్థానంలో కొత్త ఆర్‌ఓఆర్ చట్టం తెస్తానని ఎన్నికలలో వాగ్దానం చేసింది. ప్రజలు ప్రజా సంఘాలు, రైతులు, రైతు సంఘాలు, మేధావులు, పత్రికలు, అందరూ కలిసికట్టుగా ధరణి పోర్టల్‌ను వ్యతిరేకించారు.

కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రోజు వరకు ధరణిలో ఉన్న పోర్టల్ పని బాధ్యతలను ఎన్ఐసికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్టుగా చెబుతున్నారు. పట్టేదారు తండ్రి పేరు, జెండర్ కరెక్షన్, కులం, జీపీఏ రిజి[illegible]న్లకు అనుమతించినట్టుగా సమాచారం ఉంది. నిజానికి జరగవలసిన పనులు పట్టేదారు పేరులో ఉన్న తప్పులు, విస్తీర్ణంలో దొర్లిన తప్పులు, భూమి రకం, కాస్తు కాలంలో కౌలుదారు పేరు, పట్టేదారులను నిషేధిత జాబితా నుంచి తొలగించే పనులు పార్టు బి, డిజిటల్ సంతకాల పెండింగ్ లాంటివి ఇప్పటివరకు జరగలేదు. ఐదు లక్షల ధర వరకు భూమి విలువ చేసే పనులను ఆర్డీఓకి దఖలుపరిచారు. ఇవి తప్ప మిగతావన్నీ కలెక్టర్ లేదా సీసీఎల్ఏ వద్దనే ఉండనిచ్చారు.

అంతేకాకుండా ధరణి స్థానంలో 'భూమాత' పేరుతో కొత్త ఆర్‌ఓఆర్ చట్టం తెస్తాం అంటున్నారు. పూర్తి స్థాయి ధరణి 2020 చట్టం, 2024... రెండు చట్టాల ముసాయిదాలు నల్సార్ యూనివర్సిటీకి ఇచ్చారు. క్షేత్రస్థాయి అనుభవం ఉన్నవారిని పరిగణనలోకి తీసుకున్నట్టుగా అనిపించడం లేదు. ముసాయిదా పాత చట్టాలను పోలి ఉన్నది. అందుకు 1971లో రూపొందించబడిన చట్టాన్ని పరిగణనలోకి తీసుకుంటే సరిపోయేది. 2024 కొత్త ఆర్‌ఓఆర్ ముసాయిదాపై అన్ని జిల్లాల కలెక్టర్లు సమావేశాలు నిర్వహించారు. కొన్ని ప్రజా సంఘాలు, రెవెన్యూ సంఘాలు, రిటైర్డు రెవెన్యూ ఉద్యోగులు, అందరూ సూచనలు, సలహాలు ఇచ్చారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే బాగుండేది. కానీ అవేవీ పరిగణనలోకి తీసుకోలేదు. సమస్య మరింత జటిలం కాకుండా ఉంటే ప్రజలు స్వాగతిస్తారు. పది సంవత్సరాలుగా పడుతున్న కష్టాలు కొత్త సర్కారు నివృత్తి చేస్తుందని అనుకున్నారు. సంవత్సరం దాటినా చూస్తాం, చేస్తామంటూ గత ప్రభుత్వ పనితీరును ఎండగడుతూ కాలం వెళ్లదీయడం సరికాదు. కొత్త ఆర్‌ఓఆర్–2024 చట్టంలో పోర్టల్ నుంచి 'భూమాత'గా పేరు మార్చటంలో అభ్యంతరం ఉండదు. కాంగ్రెస్ పార్టీ మార్కు కోసం మార్చుకోవడం అది మీ ఇష్టం. కానీ సాధారణ చిన్న, సన్నకారు, బడుగు రైతు ఈజీగా పలికే విధంగా ఉంటేనే బాగుంటుంది. పేరు మార్చినంత మాత్రాన మంచి జరుగుతుందని అనుకోకూడదు.

ఇతర పథకాలు బాగున్నాయని అనుకున్నా, 60 శాతం గ్రామీణ ప్రజలు, వ్యవసాయ ఆధారంగా జీవించే వారికి వారి భూములు భద్రంగా ఉన్నాయని భరోసా ఇవ్వగలిగే చట్టం కావాలి. తీసుకురాబడిన మార్పు ఫలాలు రైతులు అనుభవించే విధంగా, సులభంగా ఉండి అందుబాటులో ఉండాలి. వాళ్లకున్న భయాలను దూరం చేయగలిగితే మంచిది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో కొత్త భూ చట్టం ప్రవేశపెడతామని ప్రభుత్వం అంటున్నది. ధరణికి భిన్నంగా ఉంటేనే ప్రజలు స్వాగతిస్తారు. మాటలతో మభ్యపెడితే మనుగడ సాధ్యం కాదు. పనులు ఆచరణాత్మకంగా ఉంటే అందరు సహకరిస్తారు. లేకుంటే దూరమవుతారు.

● వి. బాలరాజు


రాజ్యాంగ చర్చల ముందు సవాళ్లెన్నో!

రాజ్యాంగ దినోత్సవానికి అమృతోత్సవ సంవత్సరం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ వారం చెరో రెండు రోజుల పాటు రాజ్యాంగంపై చర్చ జరగబోతున్నది. సందర్భానికి తగ్గట్టుగా అర్థవంతమైన చర్చ జరిగి, దేశానికి పార్లమెంటు దిశా నిర్దేశం చేయగలదని ఆశ.

ఈ రాజ్యాంగం ఎంతో కాలం మనజాలదని నాటి ప్రపంచం భావించింది. ఒకవైపు దేశ విభజన జరిగి, మరోవైపు పేదరికం, నిరక్షరాస్యత, ప్రాంతీయ విభేదాలు పెచ్చరిల్లిన సమయంలో దేశ గమనాన్ని నిర్దేశిస్తూ రాజ్యాంగాన్ని తయారు చేసుకోవడం కత్తి మీద సాము అయ్యింది. విభిన్న భావజాలాలు గల మేధావులు, దేశభక్తులు కలిగిన రాజ్యాంగ నిర్మాణ సభ, ముసాయిదా రాజ్యాంగ కమిటీ, డా. అంబేడ్కర్ అధ్యక్షతన అత్యుత్తమమైన, ప్రపంచంలో పెద్దదైన లిఖిత రాజ్యాంగాన్ని అందించింది. పలుమార్లు లోతైన చర్చలు, దాదాపు రెండు వేల సవరణలు, తీవ్ర వాదోపవాదాలు జరిగినా చివరకు అందరి ఆమోదంతో అంతిమ ముసాయిదా తయారయ్యిందంటే దానికి కారణం ఆ పెద్దలు దేశ ప్రయోజనానికి, జాతి ప్రయోజనానికి పెద్దపీట వేస్తూ ఒక్క తాటిపై రాగలగడం వల్లనే. ఆ కష్టఫలమే ఏడు దశాబ్దాల పాటుగా దేశాన్ని మెరుగైన సమాజంగా నడిచే దారి చూపుతోంది. ఈ స్ఫూర్తిని పాటిస్తూ నేడు పార్లమెంటు చర్చించాల్సింది — రాజ్యాంగం ప్రాతిపదికగా దేశ ప్రయోజనాల్ని.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజ్యాంగ నిర్మాతలు భావించినట్టుగానే మన దేశానికి నప్పింది. చిన్న చిన్న సమస్యలు ఉన్నా విజయవంతంగా నడుస్తోంది. అయితే ఎన్నికల విధానం ధన ప్రభావంతో సామాన్యులకు అందకుండా తయారైంది. విప్ విధానంతో పార్టీలో సభ్యుల అభిప్రాయాలకు స్వేచ్ఛ తగ్గింది. అంతర్గత ప్రజాస్వామ్యం, ఫిరాయింపులు తదితర అంశాలపై చర్చ జరగాలి. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం మరింత బలపడుతూ వస్తోంది. బలమైన కేంద్రం మంచిదే కానీ రాష్ట్రాల్ని బలహీనం చేస్తూ పాలన కేంద్రీకృతం కారాదు. నూతన ఆర్థిక విధానాల వల్ల సంపద, ఆదాయం అతి తక్కువమంది చేతిలో కేంద్రీకృతమై, అధిక శాతం ప్రజల్ని పేదరికంలోకి దిగజారుస్తుంది. ప్రభుత్వం ఆర్థిక న్యాయం అందించే బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటోంది. ప్రభుత్వాలు చట్ట సభలకు జవాబుదారీ. కానీ చట్ట సభల్లో చర్చలే తగ్గిపోతున్నాయి. దొడ్డిదారిన పనులు చక్కబెట్టుకుంటున్నాయి. రాజ్యాంగ సంస్థలు, గవర్నర్, ఎన్నికల కమిషన్, స్పీకర్ కార్యాలయం లాంటివి నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కొన్నిసార్లు అలా జరగకపోయినా బాధ్యత వహించడం లేదు. న్యాయస్థానాలు ప్రజల విశ్వాసాన్ని నిలుపుకోవడంలో ముందున్నాయి. కానీ న్యాయమూర్తుల నియామకాలు, కూర్పుల్లో సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించడం లేదు. ఇలా చెప్తూ పోతే ఎన్నో సవాళ్లు. అయినా లోతైన చర్చల ద్వారా పరిష్కారాలు దొరుకుతాయి. చూడాలే గానీ, ఈ సవాళ్లను అధిగమించడానికి రాజ్యాంగమే దారి చూపుతుంది. ప్రభువులైన ప్రజలు తమ అధికారాన్ని తెలుసుకోవాలి. తమకు రక్షణగా ఉన్న రాజ్యాంగం విలువని, దానిలోని విలువల్ని అర్థం చేసుకోవాలి. అందుకు పార్లమెంటులో జరిగే చర్చ దోహదపడగలదని ఆశిద్దాం.

– డి.వి.జి. శంకరరావు
మాజీ ఎంపీ, విజయనగరం



సర్కారు మారినా సమస్యలు తీరలే..



హనుమకొండ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమస్యలతో సతమతమవుతున్నారు. చాలీచాలని వేతనం.. ఇతర ఏ ఆర్థిక ప్రయోజనాల కల్పన లేకుండా అలాగే ఉన్నారు. ఉద్యోగ విరమణ తరువాత పింఛన్ సౌకర్యం లేనే లేదు. ఏళ్లుగా సేవ చేసినా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు శూన్యం. అయితే అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించింది. కానీ 'ప్రజాపాలన' కొలువు తీరి ఏడాది గడిచినా తమ కొలువు కష్టాలు తీరలేదనే వేదన టీచర్లు, హెల్పర్లలో నెలకొంది. సర్కారు మారినా.. సమస్యలు తీరలేదనే వేదనతో ఉన్నారు. ఒకవైపు వేతన కష్టాలు, మరో వైపు వివిధుల సమస్యలు నడుమ ఆర్థికంగా, మానసికంగా చితికిపోతున్నారు. ప్రభుత్వంపై ఉన్న నమ్మకం కార్యాచరణ రూపంలో ఎప్పుడు అమల్లోకి వస్తుందా? అని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.

హామీగానే వేతన పెంపు

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీస రోజు కూలీ స్థాయి మేరకు కూడా నెల మొత్తంగా వేతనం లభించడం లేదు. నెలకు రూ.11,650 గౌరవ వేతనం మాత్రమే టీచర్లకు లభిస్తోంది. హెల్పర్లకు రూ.7,800 గౌరవ వేతనంగా అందుతోంది. ఎంతో కాలంగా వేతన సమస్య తీరకుండా ఉన్న క్రమంలో ఎన్నికల సమయంలో ఈ అంశంపై కాంగ్రెస్ హామీ గుప్పించింది. అధికారంలోకి వస్తే అంగన్వాడీల గౌరవ వేతనం రూ.26వేలకు పెంచుతామని ప్రకటించింది. అదే విధంగా హెల్పర్ల వేతనం కూడా పెంచుతామని చెప్పింది. ప్రజాపాలన ఏడాది గడిచినా ప్రభుత్వం గౌరవ వేతనాన్ని పెంచలేదు. ఇప్పుడా.. అప్పుడా.. అంటూ టీచర్లు, హెల్పర్లు ఆశతో వేతన పెంపుకోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించాలని విన్నవిస్తున్నారు.

అందని ఆర్థిక ప్రయోజనాలు

కాంగ్రెస్ సర్కారు టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు 65ఏళ్ల వయస్సు నిండిన టీచర్లు, హెల్పర్లు రిటైర్మెంట్ పొందితే వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్‌గా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ హామీ అమలు సరిగా లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. రిటైర్మెంట్ అయిన వారందరికీ అందలేదనే వాదనలు ఉన్నాయి. కొందరికి అందినా ప్రకటించిన మేరకు పూర్తిగా డబ్బుల చెల్లింపు జరగలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం టీచర్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.2లక్షలు ప్రకటిస్తే రూ.లక్ష మాత్రమే అకౌంట్లలో పడ్డాయని, ఇక హెల్పర్‌కు లక్ష ప్రకటిస్తే రూ.50 వేలు మాత్రమే జమయ్యాయనే వాదనలు ఉన్నాయి. ప్రభుత్వం దఫాలుగా కాకుండా ఒకేసారి ప్రకటించిన మొత్తాన్ని చెల్లించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్‌తో పాటు నెలవారిగా పింఛన్ అందచేయాలని టీచర్లు, హెల్పర్లు డిమాండ్ చేస్తున్నారు.

పదోన్నతుల కల్పన ఇష్టారీతిలో..

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పదోన్నతి అంశం కూడా ఇష్టారీతిలో ఉంది. పదోన్నతులు కల్పిస్తే టీచర్లు సూపర్‌వైజర్లు అవుతారు. అదే విధంగా అర్హత ఉన్న హెల్పర్లు అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి పొందుతారు. ఈ ప్రక్రియ కోసం రెండేళ్లకోసారి పదోన్నతుల కల్పన జరగాల్సి ఉంది. కానీ పదేళ్లు గడిచినా పదోన్నతులు లేవు. సమయం ప్రకారం పదోన్నతుల ప్రక్రియ చేపట్టకపోవడంతో వయోపరిమితిమించడంతో టీచర్లు, హెల్పర్లు పదోన్నత అర్హతను కోల్పోతున్నారు. రెండేళ్లకోసారి పదోన్నతుల కల్పన జరిగితే న్యాయం టీచర్లకు, హెల్పర్లకు ప్రయోజనం కలుగుతుంది.

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనం అంతంతే..
- హామీగానే రూ.26వేలకు గౌరవ వేతన పెంపు
- ఏడాదిగా అమల్లోకి రాని వైనం
- అందని ఉద్యోగ విరమణ ఆర్థిక ప్రయోజనాలు
- ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తింపు లేనేలేదు
- పదోన్నతులు ఊసే ఎత్తని ప్రభుత్వం కరువు
- పరిష్కరించాలని టీచర్లు, హెల్పర్ల వినతి

పింఛన్ అర్హతపై స్పష్టత కరువు

రిటైర్మెంట్ తదుపరి పింఛన్ కల్పనపై ప్రభుత్వం స్పందించకపోవడం ఒక సమస్య అయితే.. 57 ఏళ్ల వయస్సు దాటిన వారికి ప్రభుత్వం పింఛన్‌కు కూడా తాము అర్హులుగా గుర్తింపు పొందడం లేదనేది టీచర్లు, హెల్పర్ల ఆవేదన. వితంతు, వృద్ధ్యాప్య పింఛన్లు పొందే అవకాశం ఉన్నప్పటికీ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉన్నందున పింఛన్‌కు అర్హతలేదని అధికారులు స్పష్టం చేస్తున్నట్లు టీచర్లు, హెల్పర్లు చెబుతున్నారు. అయితే కొన్నిచోట్ల మాత్రం పింఛన్‌కు అర్హులుగా నమోదు చేస్తున్నారంటున్నారు. ఇలా ఈ విషయమై గందరగోళం నెలకొందని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న టీచర్లు, హెల్పర్లకు ఆర్థిక ప్రయోజనాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశతో ఉన్నాం..



పి.సరస్వతి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (టీఎన్‌జీవోస్), హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా సమస్యలు పరిష్కరిస్తారనే ఆశతో ఉన్నాం. ప్రభుత్వం ప్రకటించిన మేరకు టీచర్లకు రూ.26వేల గౌరవ వేతనం, హెల్పర్‌కు నిబంధనల మేరకు పెంచి ఆదుకోవాలి. రిటైర్మెంట్ తరువాత ఫించన్‌గా టీచర్లకు రూ.5వేలు, హెల్పర్లకు రూ.3వేలు ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగుల వలే హెల్త్‌కార్డులు జారీ చేసి వైద్య సేవలు అందించాలి. టీచర్లు, హెల్పర్లు వైద్య ఖర్చులు భరించలేక అనారోగ్యంతో మృతిచెందుతున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలి. టీచర్లు, హెల్పర్ల డిమాండ్లను తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

నామినల్ రోల్స్ స్వీకరణలో వసూళ్లు?

ప్రైవేటు స్కూళ్లకు ప్రత్యేక రోజు కేటాయింపుపై అనుమానాలు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పదోతరగతి నామినల్ రోల్స్ స్వీకరణలో కొంత మంది వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించిన నామినల్ రోల్స్ స్వీకరణకు ప్రధానోపాధ్యాయులను ఏర్పాటుచేసి వారి ద్వారా స్వీకరించారు. కాగా, ప్రైవేటు స్కూల్స్‌కు సంబంధించిన నామినల్ రోల్స్ స్వీకరణకు ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి స్వీకరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పక్కనున్న హనుమకొండ జిల్లాలో ప్రధానోపాధ్యాయులను ఏర్పాటు చేసి అన్ని స్కూల్స్ నుంచి ఎన్నార్స్ స్వీకరిస్తుంటే ఇక్కడ మాత్రం ప్రైవేటు స్కూళ్లకు ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించడం వెనక వసూళ్ల పర్వం దాగుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, జిల్లాలో మొత్తం 120 ప్రైవేటు స్కూల్స్ నుంచి నామినల్ రోల్స్ రావాల్సి ఉండగా, వారందరినీ బుధవారం ఒక్క రోజే అప్పగించాల్సిందిగా హుకుం జారీ చేయడం వెనుక వసూళ్ల పర్వం దాగి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవెల్2),భవనం సంఖ్య 02,బెరం బ్యూ పార్క్, జనరల్4/1,TTC, ఠానె బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి.నం.1-8-301,1వ అంతస్తు,APRTC బస్‌స్టాండ్ దగ్గర,హనుమకొండ రోడ్, భువనగిరి,యాదాద్రి భువనగిరి జిల్లా-508116.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
ALERPJ2406030007	ANJANEYULU	ALERPJ2406150006	RAPAKA KISTAIAH	ALERPJ2406240003	TATIKAYALA VENKATESH
	CHINTHAKINDI	ALERPJ2406150016	SHARATH KUMAR	ALERPJ2406240016	CHANDRAMOULI
ALERPJ2406070010	KALYANI CHOWDABOINA		MUDDEPAKA		MURARISETTI
ALERPJ2406070008	ANGADI VENKATESH	ALERPJ2406170007	BAIRAPAKA UMESH	ALERPJ2406240017	CHANDRAMOULI
ALERPJ2406120008	SIDDULU BODDU	ALERPJ2406180001	ETTABOINA PRABHAKAR		MURARISETTI
ALERPJ2406120006	CHANDRAMOULI	ALERPJ2406200008	AMBALA MAHENDER	ALERPJ2406240010	JANGA BIKSHAPATHI
	MURARISETTI	ALERPJ2406200003	SATTAIAH NARAMLA	ALERPJ2406260004	MANJULA INJA
ALERPJ2406120007	SIDDULU BODDU	ALERPJ2406210005	SIDDULU BODDU	ALERPJ2406260010	THUNIKI VAISHNAVI
ALERPJ2403120009	BHANU PRSAD ARE	ALERPJ2406210004	SEESA KANAKARAJU	ALERIP2406260001	SAMPATH BEEMAGANI
ALERPJ2406120002	PERUMALLA SAMPATH	ALERPJ2406220011	PARAMESHWARI KOTHA	ALERPJ2406270013	KAVITHA MURARISETTI
	CHANDRA	ALERPJ2406220010	PARAMESHWARI KOTHA	ALERPJ2406280007	RAMESH GANIDAPAKA
ALERPJ2406140004	RAGHURUPULA MAHENDAR	ALERPJ2406220001	JANGA BIKSHAPATHI	ALERPJ2406280010	NARMETA SRIKANTH
ALERPJ2406150005	RAPAKA KISTAIAH	ALERPJ2406240018	CHANDRAMOULI	ALERPJ2406300004	PARAMESHWARI KOTHA
ALERPJ2406150004	RAPAKA KISTAIAH		MURARISETTI		

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి.నం.3-161,మెయిన్‌రోడ్,భూపాలపల్లి,జయశంకర్ భూపాలపల్లి జిల్లా-506169.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
BHPLEPJ2406030014	MOODIKE LAVANYA	BHPLEPJ2403180051	JADI GATTAIAH	BHPLEPJ2406260009	DEVASANI BALAKRISHNA
BHPLEPJ2406030015	MOODIKE LAVANYA	BHPLEPJ2406190012	MADDI SANTHOSH KUMAR	BHPLEPJ2406270008	KACHU KUMAR
BHPLEPJ2406040006	KONDAGORLA RAJENDER	BHPLEPJ2406190020	VANGALA RAMESH	BHPLEPJ2406270007	KACHU KUMAR
BHPLEPJ2406040009	VELPULA SADAIAH	BHPLEPJ2406190021	VANGALA RAMESH	BHPLEPJ2406270016	PUPPALA SAMPATH
BHPLEPJ2406050010	BUTHUKURI RAMESH	BHPLEPJ2406200009	PALTHIA RAJU	BHPLEPJ2406270009	KACHU KUMAR
BHPLEPJ2406050014	HATKAR SAVITHRI	BHPLEPJ2406200011	MADURAKAVI SRINIVAS	BHPLEPJ2406280012	MUKIOTH BHEEM SINGH
BHPLEPJ2406080020	ANIL KUKAMUDI	BHPLEPJ2406200001	PUTTAPAKA VENKANNA	BHPLEPJ2406300024	CHEVVU RAJU
BHPLEPJ2406080013	LAKAVATH BALAJI	BHPLEIP2406210001	SALUPALA THIRUPATHI	BHPLEPJ2406300016	SRIRAM PRASUNA
BHPLEPJ2406080001	MADE KRISHNA	BHPLEPJ2406220004	THOTA SANDEEP	BHPLEPJ2406300013	BAYYANA MAHENDER
BHPLEPJ2406080022	KODARI RAJKUMAR	BHPLEPJ2403230019	BAYYA KAVITHA	BHPLEPJ2406300026	ECHANTHALA SAMMAKKA
BHPLEIP2403090001	RAJESHWARI VANKUDOTHU	BHPLEPJ2406240012	SEELAM RAMESH	BHPLEPJ2407010005	NUNAVATH RAJANNA
BHPLEPJ2406100030	KAMBALA RAMYA	BHPLEPJ2406250017	PINNINTI MANIDEEP	TBHUPPJ2406110001	LINGAMPELLY
BHPLEPJ2406110012	THAINENI SAMMAIAH	BHPLEPJ2406250018	PINNINTI MANIDEEP		RAVIKUMAR THOGARI
BHPLEPJ2406130019	ENUGALA DEVENDER	BHPLEPJ2406250008	VANGALA RAMESH	TBHUPPJ2406240001	RAVIKUMAR
BHPLEPJ2406140012	THIMMAPURAM SHAILAJA	BHPLEPJ2406250001	THANDA BIKSHAPATHI		LINGAMPELLI
BHPLEPJ2403160007	MAHMAD YAKUB PASHA	BHPLEPJ2406260023	SUDULA MADHUKAR	TBHUPPJ2406300001	PURNACHANDAR
BHPLEPJ2406170014	GOLLACHEMUDI LINGAIAH	BHPLEPJ2406260008	KOLUGURI GATTAIAH		

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.2-121,1వ అంతస్తు,పాలకుర్తి రోడ్,స్టేషన్‌ఘన్‌పూర్,జనగాం జిల్లా-506143.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
PLKTYPJ2406040008	YELLAIAH MANDA	PLKTYPJ2403090003	MYTAIAH PUSKURI	GHNPRPJ2406260001	NARESH LINGANAGOINA
GHNPRPJ2406040002	KISHORE RANGU	PLKTYPJ2406130012	RAMACHANDRU BELLI	GHNPRPJ2406260006	ELIYA GABBETA
PLKTYPJ2406040001	KARTHIK PUJARI	PLKTYPJ2403150013	VIJAYA AVULA	GHNPRIP2406270001	MANGA DEVI MINUKURI
PLKTYPJ2406040015	RAMESH GANDHARI	PLKTYPJ2406150008	KRISHNA MURTHI LONKA	PLKTYPJ2406280013	PARAM JYOTHI
PLKTYPJ2406040002	CHANDRASHEKAR	GHNPRPJ2406190007	RAGHUPATHI		GADEPAKA
	GUGULOTH		BACHALIKURA	GHNPRPJ2406280001	RAMESH LALU
PLKTYPJ2406050001	RAMESH GANDHARI	PLKTYPJ2406220006	VENKANNA LAKAVATH	GHNPRPJ2403290001	SRINNU MEDA
GHNPRPJ2406070002	MADHURI EMANI	GHNPRPJ2403250002	VENKATESH PITTALA	GHNPRPJ2403300011	MEDA NIRMALATHA

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.12-267,IST FLOOR, BESIDE SUDHAKAR PETROL PUMP WARANGAL ROAD HUZURABAD-505468

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
JMKNTPJ2406030009	ADULAPURAM	HUZRDPJ2406110003	ANAPURAM ESMAIL	HUZRDPJ2406240009	ELUKATI KRISHNA
	RAMPRASAD	JMKNTPJ2406130008	SHIVARATHRI POCHAIAH	JMKNTPJ2406240007	MUDEDLA RAVI
JMKNTPJ2406050008	GOUDA RAMESH	JMKNTPJ2406170007	PULYALA LAXMI	HUZRDPJ2406240002	SRINIVAS GUNDAYBOINA
JMKNTPJ2406070001	ALAKUNTA MAHENDAR	JMKNTPJ2406200003	GOUDA RAMESH	JMKNTPJ2406260002	THATIKONDA BHAVANI
JMKNTPJ2406100018	RAYISHETTI SATHISH	JMKNTPJ2406220003	KOTHURI MAHESH	THUZRPJ2407010001	DURGAM RAJU

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.2-5-6/2,నెహ్రూలాపార్క్యల్ రోడ్,జనగాం జిల్లా-506167.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
JNGONPJ2406050002	ANUMULA MADHUKAR	JNGONPJ2406080001	VIKAS CHITTIMELLI	JNGONPJ2406150006	BANOTH BALAJI
	MADHUKAR	JNGONPJ2406080004	SATISH BABBURU	JNGONPJ2406240005	AKULA KOTESHWAR
JNGONPJ2406070002	SATISH BABBURU	JNGONPJ2406110004	KETHAVATH SANTHOSH	JNGONPJ2407010010	ANGADI VINAY

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: 2-3-88,బోడ్లా మధుసూధన్ రావు హాస్పిటల్ ప్రక్కన, రామమందిర్ రోడ్ దగ్గర ,మహబూబాబాద్-506101.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
MABOBPJ2406120003	PEDDAPALLY VASANTHA	MABOBPJ2403150003	BANITHU SHANKER	MABOBPJ2407010013	PADMA BANOTH
	LAXMI	MABOBPJ2406240004	VIJENDAR JILUKARA		
MABOBPJ2406120004	POKKULA BHANU SAI VARUN	MABOBPJ2406260004	GUGULOTHU KAVITHA		

వేలం తేది: 26-12-2024 వేలం చిరునామా:2-2/3-1,1ST FLOOR, PALLAVI MEDICAL & GENERAL STOERS, MAIN ROAD. MULUGU 506343

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
MLUGUPJ2406100012	POTHARLA SAIRAM	MLUGUPJ2406180022	SADHU MALLIKARJUN	MLUGUPJ2406260013	GAMPA RAJU
MLUGUPJ2403120025	EMPELLI RAGHU	MLUGUPJ2406190021	MALLEBOINA RAVALI	MLUGUPJ2406260018	NALLEBOINA
MLUGUPJ2406130013	MAMIDISHETTI RAJU	MLUGUPJ2403190014	PODEM SWAMY		PAPA RAO
MLUGUIP2406150001	PRAVEEN KUMAR	MLUGUPJ2403190005	ADDARI VIJAYA KUMARI	MLUGUPJ2403280010	DANASARI LAKSHMI
	VANGARI	MLUGUPJ2403200009	SIRRA RAMA	MLUGUPJ2406290005	MAILAGANI SAROJANA
MLUGUPJ2403160005	MEPATHI DASHARATHAM	MLUGUPJ2406210004	PANDAVULA	MLUGUPJ2406290012	CHUNCHU
MLUGUPJ2406180007	PANDAVULA		RAMANAKAR		NAGALAXMI
	RAMANAKAR	MLUGUPJ2406250014	MADDI SURESH	MLUGUPJ2407010006	GUVVA RAJU

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: 7-89,మొదటి అంతస్తు,ప్రదాన రహదారి,అంబేద్కర్ సెంటర్,నర్సంపేట,వరంగల్ -506132.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
NRSM1PJ2406030006	ITHA YADAGIRI	NRSM1PJ2406290005	BOINI SAMBA LAKSHMI		
NRSM1PJ2406140004	BHUKYA SAMMU	NRSM1PJ2406290009	EDAM SADHAKAR		

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: 20-302 నుండి 304/అ,మొదటి అంతస్తు,ప్రదాన రహదారి,పర్కాల,వరంగల్ జిల్లా -506164.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
CDPRKPJ2406150004	PASULA RAMESH	CDPRKPJ2406240012	KANNOJU SHARATH	CDPRKPJ2406290011	SAMALA PAPAIAH
CDPRKPJ2406170006	KODARI NAGARAJU	CDPRKPJ2406250002	BOLLAPELLE RAVI	TPARKPJ2406130001	THIRUPATHI PULUSU
CDPRKPJ2406220003	SRIRAM ODAYAKAR	CDPRKPJ2403290005	PITTA GEETHA		

వేలం తేది: 26-12-2024 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 8-1-61 నుండి8-1-65 వరకు, 1వ అంతస్తు,జనని కాంప్లెక్స్,హైదరాబాద్ రోడ్,సిద్దిపేట,సిద్దిపేటజిల్లా .502103

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
CHRILPJ2406040011	THADURI TEJESH	CHRILPJ2403200002	DONTHI KAVITHA	CHRILPJ2406270018	ANIL KUMAR SANUVALA
CHRILPJ2406070010	LINGAM UDUGULA	CHRILPJ2406240004	ERROLLA NARSIMHULU	CHRILPJ2309280014	ELOORI VINAY
CHRILPJ2406130004	KARKA MANJULA	CHRILPJ2406240003	BUTTI SHYAMALA	CHRILPJ2406300001	ANJI JANGA
CHRILIP2309160001	KAMALAPURAM KIRAN	CHRILPJ2403260005	KANAKAIAH MADIPADIGE		

వేలం తేది: 26-12-2024 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్.నం. 1-4-249, మొదటి అంతస్తు,కూడా రోడ్,కొత్త బస్టాండ్ దగ్గర,సూర్యపేట,సూర్యపేట జిల్లా -508213 .

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
TRMLGPJ2406030005	KAMMAMPATI NAVEEN	TRMLGPJ2406180004	DARAVATH DEVENDAR		NEERATI
	KUMAR	TRMLGPJ2406220013	BOGA VENU	TRMLGPJ2406280004	KUNUSOTHU VENKAT
TRMLGPJ2406120002	CHIPPALAPALLY NARSAIAH	TRMLGPJ2406220001	DAMERA NARESH	TRMLGPJ2406300001	PATTHEPURAM
TRMLGPJ2406170006	DARAVATH DEVENDAR	TRMLGPJ2406240007	VENKATESHWARLU		JAYASANKAR

వేలం వేయు తేది: 26-12-2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం.16-207, 2వ అంతస్తు,R&Bగెస్టైహౌస్ ఎదురుగా,మెయిన్‌రోడ్,తొర్రూర్,వరంగల్ జిల్లా-506167.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
THRURPJ2406070003	MANJULA THALARI	THRURPJ2406170002	SUMAN JATOTH	THRURPJ2403280006	GUDDETI
THRURPJ2406100005	SAIDHABEE SHAIK	THRURPJ2406200004	PULSINGH JATOTHU		SURESH BABU
THRURPJ2406110007	SAIDULU PITTALA	THRURPJ2406260002	BHARATH KUMAR MANDA		

వేలం. తేది: 27-12-2024 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం.1-8-588,3 వఅంతస్తు,వైష్ణవి హీరో హూండా షోరూమ్ పైన, నక్కలగుట్ట, హన్మకొండ.

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
WRNPTPJ2406030004	GUBA PRAVEEN	WRNPTPJ2406180003	VANKUDOTHU	WRNPTPJ2406290012	SAHADEVULA SANTHOSH
KZIP1PJ2406040001	SRINU JAGANNADHULA		LAKSHMAN	KZIP1PJ2406290002	SUMAN BONDUGULA
WARN2PJ2403050004	MOLUGURI RAKESH	WRNPTPJ2403190004	KATTA SRILATHA	WRNPTPJ2406290001	BHUKYA BIXAPATHI
KZIP1PJ2403070005	SHAIK BILAL AHMED	WRNPTPJ2406190012	GUGULOTHU RAMESH	WRNPTPJ2406290010	RACHAKONDASRINIVAS
KZIP1PJ2406070005	AVINASH PARRE	KZIP1PJ2406200001	RAJU PASTAM		CHARY
KZIP1PJ2406080002	SILIVERU MURALI	WRNPTPJ2403220009	BHUKYA AMMI	WRNPTPJ2406300003	KONDAPALLY
	PRASAD	WARN2PJ2406240004	PODILA CHANDRAMOHAN		SHASHIDAR RAO
WRNPTPJ2406100005	BOTTUMUNCHULA	WRNPTPJ2406250001	SHIVARATHRI	WRNPTPJ2406300001	OJJALA YAKAMMA
	YAKALAXMI		BALAKOMURAIAH	WRNPTPJ2403310004	BHONAGIRI
WRNPTPJ2406100016	PARKALA RAJASHEKAR	WARN2PJ2406260002	MOHAMMED NASEER KHAN		PURUSHOTHAM
WRNPTIP2406110001	THIGALA RAKESH	HANDAPJ2406260006	ASSUNTHA INDHA	TWARAPJ2406190001	JAMEEL MOHAMMED
WARN2PJ2406110005	SHAIK RIZWAN AHMED	HANDAPJ2406260005	ASSUNTHA INDHA	WRNL3PJ2406040001	KUKKAMUDI NARESH
HANDAPJ2406110003	PILLI RAJENDRA BABU	WRNPTPJ2403260011	NUNAVATH BIKU	WRNL3PJ2406080002	KANDUKURI KIRAN KUMAR
WARN2PJ2406110003	MOHD KHAJA	WARN2PJ2406270006	SANGA ARUN	WRNL3PJ2406110003	RAVULA BIXAPATHI
	SADARUDDIN AHM	WRNPTPJ2406270014	KAKARLA VEERASWAMY	WRNL3PJ2406190001	KUKKAMUDI NARESH
WARN2PJ2406110001	NAFISA KOUSAR	WRNPTPJ2406270003	MARUPATLA	WARN1PJ2406210001	AMARAVATHI CHAVOOTIL
WARN2PJ2406120005	PEDDURI RAKESH		BHARATHAMMA	WARN1PJ2406210002	AMARAVATHI CHAVOOTIL
WRNPTPJ2406130008	EEGA BHASKER	WRNPTPJ2406280006	KAJANRLA VIJENDRA	WARN1PJ2406240003	CHAVOTI SUMITHRA
WARN2PJ2406130003	SRIPADI RAMESH	WARN2PJ2406280001	NUNAVATHU SAMPATH	WRNL3PJ2407010001	KAMALA ERRABELLI
WRNPTPJ2406130011	JUNNA YADAGIRI	WRNPTPJ2406280009	MUTHYALA RAJU	WRNL3PJ2407010003	KAMALA ERRABELLI
WRNPTPJ2406150004	ELIKATTE MAHESH	HANDAPJ2406280003	LANJAPALLY VINODA	WRNL3PJ2407010004	KAMALA ERRABELLI
KZIP1PJ2406170002	CHIRRA VAMSHI	WRNPTPJ2406290015	CHANDU SAIMALU	WRNL3PJ2407010005	KAMALA ERRABELLI

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎం సురేష్ కుమార్ ను** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 11.12.2024
స్థలం: వరంగల్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సమ్మెబాటలో సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు

- పర్మినెంట్ చేసే వరకు ఎంటీఎస్ ఇవ్వాలని డిమాండ్
- సమ్మెకు మద్దతుగా పలు ఉద్యోగ సంఘాలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవటంతో సమగ్రశిక్ష (ఎస్ఎ) కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న 9 విభాగాలకు చెందిన వారు మంగళవారం మూకుమ్మడిగా ఏకశిలపార్కు వద్ద దీక్షలు చేపట్టారు. కిందటేడు సెప్టెంబరులో తాము దీక్షలు చేస్తున్న సందర్భంగా పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి దీక్షలను సందర్శించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని సంఘం నాయకులు తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం గడిచినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు మినిమం టైమ్ స్కేలు(ఎంటీఎస్) ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కాగా, ఎస్ఎ ఉద్యోగుల సమ్మెదీక్షలకు పలు ఉపాధ్యాయ సంఘాలు మంగళవారం మద్దతు తెలిపాయి. మాజీ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు సరోత్తంరెడ్డి దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు. 15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఎస్ఎ ఉద్యోగులు వెట్టిచాకిరీకి గురువుతున్నారన్నారు. వారి న్యాయపరమైన డిమాండ్‌లను ప్రభుత్వం గుర్తించి పర్మినెంట్ చేయాలన్నారు. ఎస్ఎ ద్వారా కేంద్రం ఇచ్చే వాటాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను సమకూరిస్తే పర్మినెంట్ చేయవచ్చన్నారు. ఎస్ఎ ఉద్యోగులను అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వాడుకుంటూ వారిని నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. పీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు.



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న సరోత్తంరెడ్డి

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత ఉండాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత పటిష్ఠంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు) భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 3నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ చేశారు. హనుమకొండ జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలతోపాటు భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్‌ల నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వరంగల్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జాతీయ లోక్‌అదాలత్ ప్రచార పోస్టర్లను కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చాలా కాలంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాల కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు. చట్టరీత్యా రాజీకి అర్హత ఉన్న క్రిమినల్ కేసులతో పాటు రాజీ పడదగిన సివిల్ కేసులు, భూవివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్‌ఫండ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, వైవాహిక కేసులు, ట్రాఫిక్ కేసులు, ఇతర అన్ని రకాల కేసులకు సంబంధించి లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చొన్నారు. మరిన్ని వివరాల కోసం పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మనాన్‌భట్, అదనపు డీసీపీ రవి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసు, శ్రీధర్‌రావు, కరుణాకర్‌లు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ

మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా చేపట్టాలి

కేంద్ర విమానయాన మంత్రికి ఎంపీ కడియం కావ్య వినతి



కేంద్ర విమానయాన మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును మంగళవారం న్యూఢిల్లీలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మామునూరు ఎయిర్‌పోర్టు పనుల ప్రారంభం గురించి కేంద్రమంత్రితో చర్చించారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, విమానాల రాకపోకలను ప్రారంభించాలని డాక్టర్ కావ్య కేంద్ర మంత్రిని కోరారు. భవిష్యత్ అవసరాల కొరకు రెండేళ్లలో ఎయిర్‌పోర్టు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అంతటి ప్రాధాన్యం కలిగిన వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.4వేల కోట్లను విడుదల చేశారని తెలిపారు. ఇప్పటికే కుడా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు భూములు ఇచ్చిన 863 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఎయిర్ పోర్టు పునరుద్ధరణ కోసం రూ.250కోట్లతో భూసేకరణకు నిధులు మంజూరు చేశారని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రెండేళ్లలో విమాన రాకపోకలు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు ఎంపీ కావ్య కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి..
- హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు
6

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి
- జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి
- ఓ సిటీలో సీఎం కప్ క్రీడలు ప్రారంభం
6

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

- జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి
- ఓ సిటీలో సీఎం కప్ క్రీడలుఎ ప్రారంభం


ఓ సిటీలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కాశిబుగ్గ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జీడబ్ల్యూ ఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి క్రీడాకారులకు సూచించారు. మంగళవారం ఆయన సీఎం కప్ మండల స్థాయి పోటీల ను ఓ సిటీ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్, ఖిలా వరంగల్ మండలాల క్రీడలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. మండల స్థాయిలో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మొదటి రోజు ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. ముందుగా అధికారులు, కార్పొరేటర్లు క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, గుండు చందన పూర్ణచందర్, అరుణ విక్టర్, సీఎంహెచ్‌వో డా.రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, రవీందర్ రాడేకర్, ఎంహెచ్‌వో డా.రాజేష్, ఎంఈవోలు, పీడీలు పాల్గొన్నారు.

శంభునిపేటలో..

శంభునిపేట: ఖిలా వరంగల్ మండల స్థాయి సీఎం కప్ పోటీలు మంగళవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. పోటీలను 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ డిప్యూటీ కమిషనర్, ఎమ్‌హెచ్‌వో, అధికారులు, పీఈటీలు, పాల్గొన్నారు.

మహిళలు రుణాలను వినియోగించుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కౌసల్యాదేవి

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: మహిళా సంఘాల సభ్యుల ఆరిజిఖిక అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఆర్‌డీవో : గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మహిళలు కిరాణ దుకాణాలు మాత్రమే ఏర్పాటు చేసుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభం ఆర్జించేలా పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఇవేకాకుండా క్యాంటీన్లు, మిల్క్ పార్లర్లు, మీ సేవా కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లు చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సభ్యులకు ఎంత రుణం మంజూరు చేస్తారు..?

డీఆర్‌డీవో: మహిళా సంఘాలకు గరిష్టంగా రూ.10లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది. రూ.5లక్షల రుణం పొందేవారు తప్పనిసరిగా యూనిట్ నెలకొల్పాల్సి ఉంటుంది. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఆసక్తి ఉన్న సంఘాలకు శిక్షణ ఇస్తారా..?

డీఆర్‌డీవో : పెరటి కోళ్ల పెంచేందుకు ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులకు ముందుగా శిక్షణ ఇస్తాం. కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: కోళ్ల పెంపకానికి రుణాల మంజూరు విధానం?

డీఆర్‌డీవో : ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులకు యూనిట్లను బట్టి రుణం మంజూరు ఉంటుంది. 100 కోళ్ల యూనిట్‌కు 4-6 వారాల పిల్లల కొనుగోలు, పోషణకు రూ. 22 వేలు రుణంగా అందజేస్తారు. అలాగే 50 కోళ్ల యూనిట్‌కు రూ. 12,500 రుణం మంజూరు చేస్తారు.

ఆంధ్రజ్యోతి: రుణాలు ఎన్ని రోజుల్లో తీర్చాలి?

డీఆర్‌డీవో : 24నెలల వాయిదాలతో తీసుకున్న రుణం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

- వరంగల్ కలెక్టరేట్

దివ్యాంగ విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా..

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి


దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, డిసెంబరు 7, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దివ్యాంగ విద్యార్థులందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని, విద్యార్థులకు ఏ సమస్యలు ఎదురైనా నేరుగా వచ్చి కలవాలని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని కేయూ దివ్యాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. స్పష్టమైన లక్ష్యంతో దివ్యాంగులు నిర్దిష్టం గా ముందు కు సాగుతారని అన్నారు. వర్సిటీలో న్యాయం గా, చట్టపరంగా రావాల్సిన అన్ని అవకాశాలను దివ్యాంగు లకు కల్పిస్తానని స్పష్టం చేశారు. పరిపాలనా భవనంలో లిఫ్ట్ సౌకర్యం, ఆఫీసులలో ర్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. కేయూ పాలన మండలి సభ్యుడు, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ కరుకాల అనితారెడ్డిలు మాట్లాడుతూ.. దివ్యాంగులకు వర్సిటీలో సౌకర్యాలు, నిధులను రాబట్టేందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మా ట్లాడుతూ.. దివ్యాంగులకు వర్సిటీలో ఇబ్బందులను గుర్తించి అధునాతన ర్యాంపులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విద్యార్థులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దివ్యాంగులు అధైర్యపడొద్దని, పట్టుదలతో అన్ని సాధిస్తామని వివరించారు. వర్సిటీలో ఇటీవల కాలంలో డాక్టరేట్ సాధించిన దివ్యాంగ స్కాలర్లు డాక్టర్ సంజీవ్, శివకృష్ణ, శంకర్‌నాయక్, నరేశ్‌లను వీసీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా శాలువా, పుష్ప గుచ్ఛం, మెమొంటో అందచేసి సన్మానించారు. అలాగే ఈనెల 5న కంబోడియాలో నిర్వహించిన పారా త్రో బాల్ క్రీడల్లో అత్యున్నత ప్రతిభ చూపి వర్సిటీకి గుర్తింపు తెచ్చిన దివ్యాంగ స్టూడెంట్స్ డి.రమాదేవి, ఎం.కృష్ణవేణి, డి.భాగ్య, కె.జ్యోతి, డి.శ్రీనివాస్, జి.ప్రశాంత్‌లను అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్ కుమా ర్‌లోథ్, డాక్టర్ నారగోని శ్రీనివాస్, డాక్టర్ రాజేశ్వర్ రావు, నల్లబెల్లి చంద్రమోహన్, డాక్టర్ వంగ మల్లేశ్, గుండేటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ ఆకస్మిక తనిఖీలు

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అకస్మిక తనిఖీలు చేశారు. ఉదయం తరగతులు జరిగే సమయంలో కేయూ క్యాంపస్‌లోని మానవీయ శాస్త్ర భవనంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్. ఎంహెచ్‌ఆర్‌ఎం, తెలుగు, సోషియాలజీ, హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాల్లో జరుగుతున్న తరగతుల నిర్వహణను ప్రత్యేకంగా క్లాస్‌లు తిరిగి చూశారు. విద్యార్థులతో మాట్లాడారు. నిత్యం క్లాస్‌లకు హాజరై ఉజ్వల భవిష్యత్ పొందాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులున్నా.. నేరుగా వద్దకు వచ్చి సమస్యలను నేరుగా విన్నవిచ్చుకోవాలని కోరారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావుతో క్లాస్ నిర్వహణ, విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను నిత్యంక్లాస్‌కు వచ్చేలా అధ్యాపకులందరూ కృషి చేయాలని కోరారు. అయితే వీసీ ప్రతాప్‌రెడ్డి సందర్శించిన సమయంలో మానవీయ శాస్త్ర భవనంలో చాలామంది అధ్యా పకులు విభాగాలకు రాలేదని గుర్తించారు. కనీసం విభాగాధితులు కూడా రాకపోవడం గమనార్హం. కాగా, వీసీతో పాటు కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, హిస్టరీ విభాగం సీనియర్ ప్రొఫెసర్, సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు పీపీటీ క్లాస్‌ల నిర్వహణను అడిగి తెలుసుకుని అభినందించారు.

ఎంజీఎంలో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

వరంగల్ మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బలవన్మరణం పొందిన ఎస్‌టీఎల్‌ఎస్ భరత్‌కు సంఘీభావంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపారు. మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ మెంబర్ ఎస్‌టీఎల్‌ఎస్ నిర్మల్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న భరత్‌కు రావాల్సిన బెనిఫిట్స్, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, పీఎఫ్, ఇతర బకాయిలను ప్రభుత్వం అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మా ట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మానవతా దృక్పథంతో ఆలోచన చేసి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నూర సంపత్‌కుమార్, పలువురు ఎన్‌హెచ్‌ఎం కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీలో పవన్‌కుమార్‌కు డాక్టరేట్


పవన్‌కుమార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు చెరుకు పవన్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ పవన్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రకటించారు. 'సింథసిస్ అఫ్ కార్బ్రూనోలైడ్ డీహైడ్రోకోస్టస్ లాకోటోన్ అండ్ గార్సినల్ డెరివర్టీస్ అండ్ ఎవల్యూవేషన్ ఆఫ్ దైర్ బయోలజికల్ అక్టోవీటీస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను పవన్‌కుమార్ డాక్టరేట్ పొందారు. హైదరాబాద్ ఐఐసీటీ ప్రొఫెసర్ కె.సురేశ్‌బాబు పర్యవేక్షణలో పవన్‌కుమార్ పరిశోధన పూర్తి చేశారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం బానాజీపేట గ్రామానికి చెందిన పవన్‌కుమార్ మెదక్ జిల్లా రామాంతపూర్‌లోని ఎంఆర్‌ఎం ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పరిశోధన, అభివృద్ధి (ఆర్‌డీ)మేనేజర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన పవన్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

రేపు, ఎల్లుండి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 10:(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో హనుమకొండ డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సబ్ జూనియర్స్ బాలబాలికలకు, శుక్రవారం సీనియర్స్ మెన్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సబ్ జూనియర్స్ బాలబాలికలకు ఈ నెల 20, 21న సీనియర్స్ మెన్ విభాగంలో 22, 23 తేదీల్లో హైదరా బాద్‌లోని షేక్‌పేట మునిసిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు గురువారం ఉదయం 9గంటలకు డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్లో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రైస్‌మిల్లుల యాజమానులపై కేసులు

వరంగల్ క్రైం, డిసెంబర్ 10 : రూ.కోట్ల విలువ చేసే వరి ధాన్యాన్ని వాడుకున్న రైస్ మిల్లుల యాజమానులపై రాష్ట్ర సివిల్ సప్లయ్స్ టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ కేసులు నమోదు చేసింది. మంగళవారం బొల్లికుంటలోని సౌభాగ్య అగ్రో ప్రొడక్స్, చెన్నారావుపేటలోని వెంకటేశ్వర రైస్‌మిల్లు, నెక్కొండ మండలంలోని చంద్రుగొండ మల్లిఖార్జున్ ఇండస్ట్రీపై దాడి చేసి ధాన్యాన్ని వాడుకున్నట్లు గుర్తించారు. సౌభాగ్య మిల్లు రూ.6 కోట్ల విలువ చేసే ధాన్యం, చెన్నారావుపేటలో రూ.3కోట్లు చంద్రుగొండలో రూ.3కోట్ల విలువ చేసే ధాన్యాన్ని వాడుకున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ప్రభాకర్, లక్ష్మారెడ్డి, మామునూరు ఎస్సై జంగయ్య, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.


రైస్‌మిల్లులో దాడులు నిర్వహిస్తున్న సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు

కార్పొరేటర్‌కు పలువురి పరామర్శ


కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

పోచమ్మమైదాన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోచమ్మమైదాన్ ప్రాంతానికి చెందిన 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి తల్లి బస్వరాజు సరోజన అంత్యక్రియలు మంగళవారం కొత్తవాడలోని హిందు శ్మశాన వాటికలో నిర్వహించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో పాటు పలువురు కార్పొరేటర్లు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్మికుల వేతనాలు పెంచేవరకు పోరాడుతాం..


ఏఐటీయూసీలో చేరిన కార్మికులతో గన్నారపు రమేష్

శంభునిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా సామిల్ కార్మికులకు వేతనాలు పెంచేవరకు పోరాడుతామని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. మంగళవారం శంభునిపేట దూపకుంట రోడ్‌లో గల 60 మంది సామిల్ కార్మికులు బీఆర్‌ఎస్‌కేవీ నుంచి ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటం చేస్తామని అన్నారు.

శంభునిపేట కమిటీ ఎన్నిక

ఏఐటీయూసీ సామిల్ కార్మికుల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాళ్లపల్లి జాన్‌పాల్, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఎం.యాకయ్య ఫయాజ్, ఉపాధ్యక్షులుగా ఎస్.మధు, జీ.శ్రీను, కోశాధికారిగా గాజుల బాబు, కార్యదర్శులుగా టి.సాంబయ్య ఏ రాజ్‌కుమార్‌తో పాటు సురేష్, కుమార్, ఐలయ్య, స్వామి, లియాకత్, హైమద్ ఎన్నికయ్యారు. నూతన కమిటీతో గన్నారపు రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.

వాట్సాప్.. గప్‌చుప్..

- చర్చనీయాంశంగా 'బేరాల బదిలీలు' కథనం
- వాట్సాపుల్లో మెసేజ్‌లు తొలగిస్తున్న టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి కాయ దొంగలు భుజాలు తడుముకున్నట్లు పరస్పర బదిలీల ఏజెంట్లు సర్దుకుంటున్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బేరాల బదిలీలు' శీర్షికన ప్రచురితమైన కథనం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉదయం నుంచే పరస్పర బదిలీల ఆశావహులు ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు తీసేస్తున్నట్లు ఉపాధ్యాయులు చెప్పుకుంటున్నారు. ఇక ఏజెంట్లుగా అవతారమెత్తిన కొంతమంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, డీఈవో కార్యాలయాల్లో పనిచేస్తున్న వారు ఆ మాట ఎత్తడం లేదని తెలిసింది. ఇక ఫైనాన్స్ చేసేందుకు సిద్ధమవుతున్న మరికొందరు వెన్నుతడు ముకుంటున్నట్లు తెలిసింది. మొత్తంగా ఆంధ్రజ్యోతి కథనంతో అందరూ అప్రమత్తమ వుతున్నారనే చర్చ ఉమ్మడి జిల్లా విద్యాశాఖలోనే కాకుండా పక్క జిల్లాలనైన కరీంనగర్, ఖమ్మంలోనూ ఉందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నారు. అలాగే ఏజెంట్లను, వాట్సాప్ పోస్టులను, ఫైనాన్షియర్లను కొంత మేరకు కట్టడి చేసిందనే అభిప్రాయాన్ని ఉపాధ్యాయ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

మిగతా నిందితులు ఎక్కడ?

పోలీసులకు సవాల్‌గా రాయపర్తి ఎస్‌బీఐ దోపిడీ

వరంగల్ క్రైం, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకు దోపిడీలో ముగ్గురు నిందితులు పోలీసులు పట్టుబడగా, మిగిలిన నిందితులను పట్టుకోవడం కమిషనరేట్ పోలీసులకు సవాల్‌గా మారింది. గత నెల 18న అర్ధరాత్రి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు నిందితులు బ్యాంకులోకి చొరబడి సుమారు రూ.14కోట్ల విలువ చేసే బంగారాన్ని దోచుకోగా ఈనెల 5న ఏడుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేసి రూ.2కోట్ల విలువచేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులను అరెస్టు చేసి బంగారం చేసుకోవడం కమిషనరేట్ పోలీసులకు అగ్నిపరీక్షగా మారింది. చోరీ జరిగిన తర్వాత నిందితుల కోసం పోలీసులు వెళ్లగా, ఇళ్లకు తాళాలు వేసి పరారయ్యారు. కాగా, పట్టుబడని మిగతా నిందితులు దోచుకున్న బంగారాన్ని తమ సమీప ప్రాంతాల్లో విక్ర యించడానికి ప్రయత్నిస్తారనే ఆలోచనతో పోలీసులు ముంబయి, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీలో నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సమాచారం. నింది తులు సెల్‌ఫోన్‌లు వినియోగించుకోకుండా జాగ్రత్త పడుతుండటంతో పట్టుకోవడం సమస్యగా మారింది. కమిషనరేట్‌లోని వివిధ జోన్‌లలోని సీఐలు, ఎస్సైలు విడతల వారీగా ఇతరరాష్ట్రాలను వెళ్లి సోదాలు చేస్తున్న ప్పటికీ నిందితుల జాడ దొరకకపోవడంతో వెనుతిరిగి వస్తోన్నట్లు తెలుస్తో ంది. రిమాండ్‌కు తరలించిన ముగ్గురు నిందితులు కస్టడీకి కావాలని కోర్టులో పిటిషన్ వేశామని, కస్టడీలో నిందితులు ఏమైనా చెబితే తప్ప మిగతావారిని పట్టుకోవడం కష్టమని ఓ పోలీసు అధికారి పేర్కొనడం విశేషం.

ఉచిత రుమటాలజీ వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత రుమటాలజీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సీనియర్ రుమటాలజిస్టు డాక్టర్ వి.సునీల్ తెలిపారు. హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీ ఏషియన్ రుమటాలజీ సెంటరులో ఉచితంగా ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మెడ, నడుము, మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు 9966554455, 7893588057 సెల్ నెంబరులో తమ పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని డాక్టర్ వి.సునీల్ తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబతాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే గురువారం లోపు తెలియజేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పర్యవేక్షణలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించామన్నారు. జిల్లాలో మొత్తం 210 గ్రామపంచాయతీలు, 1,986 వార్డులు ఉండగా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ 1,986 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించామని పేర్కొన్నారు. 12వ తేదీన అన్ని మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓలు నిర్వహించే సమావేశంలో అభ్యంతరాలు స్వీకరించి వచ్చిన అభ్యంతరాలను 13వ తేదీన పరిష్కరిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదం అనంతరం ఈ నెల 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురిస్తామన్నారు. డీపీఓ లక్ష్మీరమాకాంత్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి ఈవీ శ్రీనివాస్‌రావు, టీడీపీ నుంచి కుసుమ శ్యాంసుందర్, ఇతర పార్టీల నుండి వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే రేపటి లోగా చెప్పండి

వరంగల్ కలెక్టరేట్: ఓటరు ముసాయిదాపై అభ్యంతరాలు ఉంటే గురువారం లోపు తెలపాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. మంగళవారం ఆమె గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు మార్గదర్శకాల జారీపై వివిధ రాజకీయ పార్టీలతో వరంగల్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను మండలాల వారీగా పోలింగ్‌కేంద్రాలలో ఈ నెల 6న ప్రదర్శిస్తామన్నారు. అందులో అభ్యంతరాలు ఉన్నట్లయితే నివేదిక రూపంలో అధికారులకు సమర్పించాలని అన్నారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈనెల 12న సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. 13వ తేదీలోపు వాటిని పరిష్కరిస్తామని, 17న ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని అన్నారు. సమావేశంలో డీపీవో కల్పన, డీఎల్‌పీవో కె.వేదవతి, నర్సంపేట డీఎల్‌పీవో రాజీవ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హరిశంకర్, నాగరాజు, అనిల్, రంగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

● ఎంఈవో కార్యాలయాన్ని తరలించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వరంగల్ ఎమ్మార్సీలో కొనసాగుతున్న ఖిలావరంగల్ మండల విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) ఎంఈవో కార్యాలయాన్ని శంభునిపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని సొంత భవనంలోకి మార్చాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్, ఖిలావరంగల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.పూర్ణచందర్, జి.రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

● నేడు మ్యాథ్స్ ఫోరం టాలెంట్ టెస్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఫోరమ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.భాస్కర్, బి.మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో టాలెంట్ టెస్ట్‌ను ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మండల స్థాయి విజేతలు ఈ టెస్ట్‌లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

● నేడు యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

కేయూ క్యాంపస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నేతృత్వంలో బుధవారం ఉదయం 11 గంటలకు వర్సిటీ ఆడిటోరియంలో యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మంగళవారం వెల్లడించారు. ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగే సదస్సులో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, సీపీ అంబర్ కిశోర్ ఝా, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లా రెడ్డి, కేయూ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, వరంగల్ నార్కోటిక్స్ విభాగం డీఎస్పీ కె.సైదులు, బి.రవీందర్ మాట్లాడతారని పేర్కొన్నారు.

● ఆరోగ్య సంరక్షణలో ఏఐ పాత్ర కీలకం

హసన్‌పర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సంరక్షణలో ఏఐ సాంకేతిక పాత్ర కీలకమని ఎస్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం హెల్త్‌కేర్, మెడికల్ టెక్నాలజీలో ఏఐ ఇన్నోవేషన్‌పై ఆన్‌లైన్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం జరిగింది. డాక్టర్ జె.రవి చందర్ సమన్వయంతో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడంలో ఏఐ సాంకేతికత పరివర్తన ప్రభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ లియోజోసెఫ్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సందీప్, కోఆర్డినేటర్ రాకేష్ సీన్ గుప్తాతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 127 మంది హాజరయ్యారు.

● పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రైతులు బస్తాలలో తీసుకువచ్చిన పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారని వివరించారు. కాగా, ఈ విషయంలో తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

● 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మట్టెవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 15 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోచమ్మమైదాన్ ప్రాంతానికి చెందిన ఎనుగుల ప్రభాకర్, విజయవాడకు చెందిన సన్యాసి నాయుడు కలిసి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశామని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

● చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

శంభునిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేటకు చెందిన గీత కార్మికుడు విలాసాగరం సదానందం తాటి చెట్టుపై నుంచి జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఆయన చింతల్ పెద్దమక్తల్ ప్రాంతంలో తాటిచెట్టు దిగుతుండగా జారి పడ్డాడు. దీంతో ఆయన కాలుకు ఫ్రాక్చర్ అయింది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

● స్కాలర్‌షిప్ దరఖాస్తులకు ఆహ్వానం

వరంగల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి గాను ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమాధికారి బి.రాజమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంలో సంబంధిత ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత ధ్రువపత్రాలను వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని రాజమణి తెలిపారు.

● నిందితుడికి మూడు రోజుల జైలు

మామునూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుట్కా విక్రయిస్తూ పట్టుబడిన నిందితుడికి మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ నెల 5వ తేదీన ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో తనిఖీ చేస్తుండగా గుట్కాతో పట్టుబడిన రంగశాయిపేటకు చెందిన ఆడెపు వెంకటేశ్వర్లును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వేంకటేశ్వర్లు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

● డ్రంకెన్ డ్రైవ్‌లో 38 మందికి జరిమానా

మట్టెవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో 38 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ మంగళవారం రూ.42, 600 జరిమానా విధించారు. కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మన్న గోవర్ధన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామకు చెదిన మహ్మద్‌ఖాన్‌కు మూడురోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.3500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

● కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

మామునూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని ములుగు డీవీహెచ్‌వో డాక్టర్ కొమురయ్య అన్నారు. మంగళవారం మామునూరులోని పశుపరిశోధన క్షేత్రంలో 19 షెడ్యూల్ తెగల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 570 కోడి పిల్లలు, కోళ్లగూళ్లు, దాణా తొట్టెలు, నీటి తొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు పరిశోధన క్షేత్రం- కోళ్ల విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహులు, డాక్టర్ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

● రేపు జేఎన్ఎస్‌లో మండలస్థాయి ఆటల పోటీలు

మడికొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్స్ కప్ మండల స్థాయి ఆటల పోటీలను గురువారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్నట్టు కాజీపేట మండల తహసీల్దార్ బావుసింగ్, మండల విద్యాశాఖాధికారి మనోజ్‌కుమార్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా తదితర అంశాలలో ఛాంపియన్‌షిప్ సెలక్షన్స్ ఉంటాయన్నారు.

● సిద్దిపేట ఏబీవీపీ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 23, 24, 24 తేదీల్లో సిద్ధిపేటలో జరిగే ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ మాచర్ల రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం కేయూలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ వివేకానందుడి స్ఫూర్తి, అంబేద్కర్ ఆశయాల కోసం పనిచేస్తోందన్నారు. దేశ వ్యతిరేక శక్తులను అడ్డుకుంటోందని చెప్పారు. విద్యార్థి సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, గట్టు ప్రశాంత్, సాయికుమార్, రాజ్‌కుమార్, అఖిల్, ఉదయ్, మల్లేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజా వ్యతిరేక పాలన

● మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



ఖిలావరంగల్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు

ఖిలావరంగల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు ప్రజా వ్యతిరేక పాలన అని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సోమవారం కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు నిరసనగా మంగళవారం ఖిలావరంగల్ 38వ డివిజన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వేములవాడ రాజన్న కోడెలను స్థానిక మంత్రి కోతకు పంపడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పరిపాలన మొత్తం అధ్వానంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 34, 42వ డివిజన్ కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై కాంగ్రెస్ కుట్రను తిప్పికొట్టాలి..

కేయూ క్యాంపస్: తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలను తిప్పికొట్టాలని కేయూ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్ అన్నారు. మంగళవారం కేయూ మొదటి గేటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జెట్టి రాజేందర్ మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాలరాసేందుకు కాంగ్రెస్ కుట్రకు పన్నిందని ఆరోపించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ ప్రెసిడెంట్ భైరపాక ప్రశాంత్, హనుమకొండ జిల్లాకోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ తెలంగాణ విగ్రహంలో బతుకమ్మ ప్రతిమను తొలగించడం తెలంగాణ అస్తిత్వంపై దాడి అని ఆరోపించారు. రానున్న రోజుల్లో తెలంగాణను మాయం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడు తెలంగాణ తల్లిరూపాన్ని మార్చడం సరైందని కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకాఉలు పిన్నింటి విజయ్‌కుమార్, రత్నం అశోక్, రోహిత్, విష్ణు, కాంక్షిత్, రాకేశ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి..

హసన్‌పర్తి: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ఉద్యమ ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అని హనుమకొండ ఆత్మ జిల్లా మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టుగుట్ట జంక్షన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నాయకులు సంగాల విక్టర్‌బాబు, అటికం రవీందర్, నాగరాజు, వాసుదేవరెడ్డి, మూల దేవేందర్, తోట నాగరాజు, మురళి పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలి

● కేంద్ర రైల్వే మంత్రికి వినయ్ భాస్కర్ వినతి

హనుమకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో రైల్వే స్టేడియంను అభివృద్ధి చేయాలని కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. మంగళవారం ఢిల్లీలోని రైల్వే కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను వారి నివాసంలో ఎంపీ రవిచంద్రతో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వినయ్ భాస్కర్ అందించారు. ఈసందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, ప్లాట్‌ఫామ్స్ పెంచేందుకు బడ్జెట్ పెంచాలన్నారు. కాజీపేటలోని ఐటీఐ కాలేజీ విద్యార్థులకు అప్రెంటీషిప్ కల్పించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఫాతిమా బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంత్ నర్సింగ్, నాయకులు నార్లగిరి రమేష్, కొండ్ర శంకర్, దువ్వ కనకరాజు, బరిగెల వినయ్, గబ్బెట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఢిల్లీలో ధర్నా చేయడం దివాలాకోరుతనం: రావు పద్మ

రాంనగర్: అరడజను మందితో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఢిల్లీలో ధర్నా చేయడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోయిన అయోమయంలో ఏదేదో మాట్లాడుతున్నాడన్నారు. వ్యాగన్, వందేభారత్ కోచ్‌ల నిర్మాణం పూర్తి చేసుకొని వచ్చే ఏడాది బయటికి వస్తున్న తరుణంలో ఢిల్లీలో ధర్నాలు, వినతిపత్రాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. కాజీపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో కాంట్రాక్టర్‌కు రూ.16 కోట్లు, రైల్వేశాఖకు రూ.18 కోట్లు ఎగనామం పెట్టి అలైన్‌మెంట్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్టీల్ కంపెనీకి రూ.10కోట్లు పెట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకుండా అపి ఈ రోజు ఏదో చేసినట్లు ఫోజులు ఇస్తున్నాడని తీవ్రంగా విమర్శించారు. మాస్టర్ ప్లాన్ అని రెడ్‌జోన్, గ్రీన్‌జోన్ పేర్లతో వసూళ్లకు తెర లేపారన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పేరుతో ఇంకా ఆ ప్రాంత ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న వినయ్‌భాస్కర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతామన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

● బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ



సమావేశంలో మాట్లాడుతున్న వసుధ

శంభునిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని వరంగల్ జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ అన్నారు. రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పోలీస్ కమిషనరేట్‌లోని మానవ అక్రమ రవాణ నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న పాల్గొని ప్రసంగించారు. మనుషులను అమ్మడం, కొనడం నేరమని, అలాంటివారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు అపరిచితులతో చనువుగా ఉండకూడదని, మొబైల్ ఫోన్‌లకు, సోషల్ మీడియా యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా 10 నుంచి 19 ఏళ్ల మధ్యగల బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలతో ఎలాంటి పనులు చేయించినా వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 1098కు సమాచారం అందించాలన్నారు. అనంతరం సైబర్ క్రైమ్, లైంగిక వేధింపులు, చైల్డ్ లేబర్, చైల్డ్ మ్యారేజ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం పీవో రాజు, మహిళా సాధికారిత కోఆర్డినేటర్ పావని, రెడ్ అలెర్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అదానీ అవినీతిపై విచారణ జరిపించాలి



ధర్నాలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గౌతమ్ ఆదానీ అవినీతిపై న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ హనుమకొండ కాళోజీ సెంటర్‌లో జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రజాసంపదను కొల్లగొడుతూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. మణిపూర్ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్న మోదీ ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, బిక్షపతి, సంతోష్, సారంగపాణి, రవి, శంకర్, నర్సయ్య, వెంకటరమణ, వెంకటేష్, రాజయ్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీ విధానాలు దేశానికి ముప్పు

న్యూశాయంపేట: ప్రధాని మోదీ విధానాల వల్ల భవిష్యత్‌లో దేశానికి ముప్పు పొంచి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. సీపీఎం కాజీపేట మండల 3వ మహాసభలు మంగళవారం న్యూశాయంపేటలోని పద్మశాలీ భవన్‌లో ప్రారంభమయ్యాయి. అంతకుముందు నాయకులు న్యూశాయంపేట జంక్షన్ నుంచి ర్యాలీగా సభాస్థలికి వచ్చారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. దేశ సంపదను కొల్లగొట్టి 10మంది కార్పొరేట్లకు మోదీ అప్పనంగా అప్పచెబుతున్నారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల భూములకు కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు అగ్రిస్‌యాక్టు పథకాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు కారు ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, ఎం.చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, గొడుగు వెంకట్, కె.లింగయ్య, మండల పార్టీ సభ్యులు తొట్టె మల్లేశం, జంపాల రమేష్, సంటి రవి, ఎండీ అన్వర్ ఖాన్, కస్తూరి రాజు, సునిత రజిత, శార దతోపాటు పెద్ద సంఖ్యలో సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక



విద్యాశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖలోని నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాశాఖ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎల్. దాస్యనాయక్ సమక్షంలో జిల్లా నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏల్పుల రమణ, ప్రధానకార్యదర్శిగా ఆర్. సంతోష్, కార్యదర్శిగా ఆర్.రవిచంద్ర, ఉపాధ్యక్షులుగా కె.శ్రీకాంత్, పి.జ్యోతి, జాయింట్ సెక్రెటరీగా వెంకటరాజు, కోశాధికారిగా యు.శిరీష, కార్యాచరణ కార్యదర్శిగా సీహెచ్. శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా పి.సురేష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా రామకృష్ణ, రంజిత్, రాహుల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ టీఎన్జీవోస్ జిల్లా ప్రధానకార్యదర్శి గార్లపాటి నిరంజన్‌రెడ్డి, నాయకులు కన్నెబోయిన మనోజ్‌కుమార్, జి.త్రినాథ్ బాబ్జీ, ఎం.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎంలు, కార్మిక సంఘాల నాయకులు

శంభునిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎంలు సమస్యలతో సతమతం అవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎంలో ఆత్మహత్య చేసుకున్న ఎస్‌టీఎల్‌ఎస్ ఉద్యోగి భరత్‌కు సంఘీభావంగా మంగళవారం రంగశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎంలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు గన్నారపు రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరత్ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, పీఎఫ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగశాయిపేట యూపీహెచ్‌సీ ఫార్మాసిస్టు సతీష్ కుమార్, స్టాఫ్ నర్సు సుమలత, సుష్మ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రశాంత్, తాళ్ళపల్లి జాన్‌పాల్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

భూమికి బదులు భూమే ఇవ్వాలి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్‌పోర్ట్ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి కేటాయించాలని గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారు 253 ఎకరాల వ్యవసాయ భూములతోపాటు ఇళ్ల స్థలాలు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం భూమే ఇవ్వాలని, పరిహారం ఇస్తామంటే భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు భాస్కర్‌రావు, మన్నె బాబురావు, బండి కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

వరంగల్ మెడికల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల కోసం హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు కోరారు. ఇటీవల డీఎంహెచ్‌వోగా డాక్టర్ అప్పయ్య బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంగళవారం ఆయనను కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజేశ్‌కుమార్, టి.మాధవరెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రసన్నకుమార్, వి.అశోక్‌రెడ్డి, వేణుగోపాల్, ఇ.అనిల్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పంట రుణాలు ఇవ్వడంలో వెనుకబడిన బ్యాంకులు లక్ష్యాలను పూర్తి చయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్, పీఎంఎఫ్ఎంఈ, ఏఐఎఫ్, పొదుపు సంఘాలకు సోలార్ యూనిట్స్ కోసం బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే పరిశ్రమలకు కూడా రుణాలు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ, స్టాండ్ అప్ ఇండియా, తదితర పథకాల మంజూరులో బ్యాంకులు అలసత్వం వహించొద్దన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రనివాస్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్డీఓ మేన శ్రీను, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధంగా ఉండాలి

మట్టెవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి ఆటో కార్మికులు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ చార్‌బౌళిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. పలువురు ఆటో కార్మికులు సీఐటీయూ నుంచి ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ మోటార్ అండ్ వర్కర్స్ యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనసా ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కందిక కేశవులు, ఆటో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి. అక్బర్, గుండె బద్రి, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక వికాసం

హసన్‌పర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే విద్యార్థులకు మానసిక వికాసమని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం సీఎం కప్ క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ఎం.వెంకటేషం, ఎంపీడీవో జె.ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి రమేష్, హెచ్ఎం విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్టు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆశా వర్కర్లను అరెస్టు చేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు. హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న 8 మంది ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టినట్లు సీఐ తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

వడ్డెపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలన్నారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 16న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వ్యాసభట్టు మధుసూదన్‌రాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు చందు, గజవెల్లి మనోహర్, జిల్లా నాయకులు జినుకల లక్ష్మణ్‌రావు, మహేం దర్, గుర్రపు కరుణాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ చర్యలు

వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు వాహనంతో వచ్చే సైలెన్సర్లలో ఎలాంటి మార్పులు చేసినా వాహనదారుడితో పాటు మార్చిన మెకానిక్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటలలో కొంతకాలంగా సైలెన్సర్లు మార్చి అధిక శబ్దం చేస్తూ వెళ్తున్న వాహనదారులను గుర్తించి 263కిపైగా సైలెన్సర్లను తొలగించారు. వాటిని తిరిగి వినియోగించకుండా మంగళవారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అదాలత్ జంక్షన్‌లో రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సైలెన్సర్లు మార్చి పట్టుబడ్డ వాహనదారుడి లైసెన్సులను ఆర్‌టీఏ అధికారుల సమక్షంలో రద్దుచేస్తామన్నారు. పట్టుబడ్డ 263 సైలెన్సర్లలో హనుమకొండ పీఎస్ పరిధిలో 120, కాజీపేట 82, వరంగల్ 61 సైలెన్సర్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, సీతారెడ్డి, నాగబాబు, ఎస్ఐలు క్రాంతికుమార్, రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోను తొలగించాలి: టీఎస్ఎఫ్

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్‌ను తొలగించాలని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కన్నం సునీల్ మాట్లాడుతూ.. డీఈవోకు కనీస అర్హత బీఈడీ ఉండాలని, కానీ వరంగల్ డీఈవో కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జ్ఞానేశ్వర్ వరంగల్‌కు బదిలీ అయ్యారని, బీకాం అర్హత ఉన్న ఆయన ఇన్‌చార్జి డీఈవోగా ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. అర్హత గల డీఈవోను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు మణితేజ, సాంబరాజు, బన్నీ, కుమార్, సంతోష్, సన్నీ, కార్తీక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లోకేందర్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా లోకేందర్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మంగళవారం నియామకం పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన టీఎన్జీవోస్ యూనియన్ నేతలకు ఈ సందర్భంగా లోకేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చరిత్ర



790 ఏళ్ల కోటగుళ్లు

గణపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోటగుళ్లు.. 790ఏళ్ల చరిత్రకు నిదర్శనం. అద్భుత శిల్పా సంపదకు ఆలవాలం. అలాంటి ఎంతో చరిత్ర గలిగిన కోటగుళ్లలోని గణపతి దేవాలయం నిరాదరణకు గురవుతోంది. కళా సంపద కనుమరుగవుతోంది. గణపతిదేవ చక్రవర్తి ఏలిన ఈ గడ్డపై ఆలయంతో పాటు పెద్ద చెరువు నిర్మాణంతో తమ జీవితం బాగానే ఉన్నా అద్భుత కళా సంపద అంతరించిపోతుండడంతో అసంతృప్తికి గురిచేస్తోంది. ప్రభుత్వాలు మారినా.. ఇక్కడి పరిస్థితి మాత్రం మారడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దం క్రితం పరిశీలనలు జరిపిన పురావస్తుశాఖ అధికారులు ఆలయాన్ని బాగును మరిచారు. ఈ లోపే హరితహోటల్‌ను నిర్మించి ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేశారు. ఓరుగల్లును రాజధానిగా చేసుకుని ఘనంగా పాలించిన కాకతీయ చక్రవర్తుల్లో అగ్రగణ్యుడైన గణపతిదేవ చక్రవర్తి పేరున క్రీస్తుశకం 1234లో గణపురం (గణపవరం), గణపేశ్వరాలయం(కోటగుళ్లు), గణపసముద్రం (చెరువు) నిర్మితమయ్యాయి. రామప్ప దేవాలయాన్ని నిర్మించిన కాకతీయ సర్వసైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రారెడ్డి మూడవ కుమారుడు గణపురం సామంతుడు గణపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు జరగ్గా.. గణపేశ్వరాలయంతో పాటు చుట్టూ 21ఉప ఆలయాలున్నాయి. దాంతో ఈ ప్రాంతానికి గణపురం అని పేరు వచ్చింది. కాకతీయ చక్రవర్తులు తమ సామ్రాజ్య పాలనను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఇప్పటి మండలాల మాదిరిగా సామంత రాజ్యాలను ఏర్పరిచి.. ట్రిపుల్ టీ విధానంలో సామంత రాజ్యకేంద్రాన్ని నిర్మించారు. ట్రిపుల్ టీ.. టీ (టౌన్) నగరం, టీ(టెంపుల్) ఆలయం, టీ (ట్యాంక్) చెరువు. ఈ విధంగా సామంత రాజ్య కేంద్ర నిర్మాణ క్రమంలో నగరాన్ని నిర్మించారు. ఆ నగరంలో ఒక దేవాలయాన్ని, ఒక చెరువును నిర్మించేవారు. ఈ ట్రిపుల్ టీ విధానంలోనే అప్పుడు గణపురం సామంతరాజ్య కేంద్రంగా ఏర్పాటు చేసి గణపురం పేరుతో నగరం, గణపేశ్వరాలయం పేరున ఆలయం, గణపసముద్రం పేరుతో పెద్ద చెరువును నిర్మించారు. ఇంత చరిత్ర ఉన్నా అభివృద్ధికి నోచుకోని ఈ ఆలయ సముదాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) పథకానికి ఎంపిక చేయడం ఊరటనిచ్చే అంశం.

- గణపతిదేవ చక్రవర్తి పేరిట ఏర్పడిన గణపురం
- త్రిపుల్ టీ విధానంతో ఈ ప్రాంత నిర్మాణం
- అద్భుతశిలా సంపదకు ఆదరణ లేక ఆగం
- ఘనమైన చరిత్ర ఉన్నా అభివృద్ధి శూన్యం
- సాస్కీ పథకానికి ఎంపికతో కాస్త ఊరట

ఆలయాభివృద్ధిని ఏళ్ల తరబడి సాగదీత

సింటెక్ టెక్నాలజీతో గణపురం కోటగుళ్లను పునరుద్ధరిస్తామని చెప్పిన పురావస్తు అధికారులు అభివృద్ధిని మరిచారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 13వ ఆర్థిక కమిషన్ నిధుల ద్వారా రూ.2కోట్లు మంజూరైనట్టు సమాచారం.. 13వ ఆర్థిక కమిషన్ నిధుల ద్వారా మొదటి విడతగా రూ.35లక్షలు మంజూరు చేయగా కొన్ని ఉప ఆలయాలను పునరుద్ధరించి మిగిలిన ఆలయాల శిథిల భాగాలను అలాగే వదిలేశారు. అప్పటినుంచే ఆలయ పునరుద్ధరణ ఆగిపోయింది. ఇప్పటివరకు మరిన్ని నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందంటూ అధికారులు సాగదీస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) పథకానికి ఈ చారిత్రక కట్టడాన్ని ఎంపిక కేసింది. రామప్ప ఆలయంతో పాటు గణపురంలోని కోటగుళ్లు, గణప సముద్రం సరస్సు, రామప్ప సమీపంలోని ఇంచర్ల గ్రామాన్ని ఈ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు కేంద్ర పర్యాటక శాఖ రూ. 73.74 కోట్లు మం జూరు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో కోటగుళ్లకు కొత్త రూపు రానుంది.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం..

గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే



కోటగుళ్ల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. కాకతీయుల కళా సంపదను కాపాడి తీరుతాం. ఇక్కడ ఉన్న రెడ్డి గుడి, కోటగుళ్ల శిల్పాకళా సంపదకు పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తాం. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఈ దేవాలయ సముదాయం నిరాదరణకు గురైంది. పురావస్తు శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

నాట్య ప్రదర్శనలకు నిలయంగా...

కాకతీయుల కాలంలో కోటగుళ్ల ఆలయ సముదాయంలో నిత్య ధూపదీప నైవేద్యాలతో అలారేది. నాడు 60ఎకరాల మాగాణి భూమిని సామంతరాజు గణపతిరెడ్డి దానంగా ఇచ్చి అందులో వచ్చే పంటలో ఆదాయాన్ని వినియోగించుకున్నట్టు చారిత్రక ఆధారాలున్నాయి. దేవాలయంలో శివుడు పరవశించేలా 72మంది సేవలు చేసేవారని, నిత్యం ఆలయ మండపంలో ఒక నర్తకి, 16మంది వాయిద్య కారులతో నాట్య ప్రదర్శనలు, సంకీర్తనలు నిర్వహించేవారని చెబుతుంటారు. ఆలయానికి దక్షిణంవైపున్న 60స్తంభాల మండపాన్ని రంగ మండపంగా పిలిచేవారని, ఈ మండపంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన, సంగీత, సాహిత్య కవి సమ్మేళనాలు నిర్వహించేవారని తెలుస్తోంది.

ధ్వంసం చేసిన ఢిల్లీ మహ్మదీయ సైన్యం

గణపేశ్వరాలయ ప్రాంగణంలో రుద్రమదేవి, ప్రతాపరుద్ర చక్రవర్తులకు చెందిన నాయంకర సైన్యంతో పాటు 2వేల అశ్విక సైన్యాన్ని పోషించేవారట. క్రీ.శ: 1323లో కాకతీయుల చివరి చక్రవర్తి ప్రతాపరుద్రుడి కి- ఢిల్లీ మహ్మదీయులకు జరిగిన యుద్ధంలో ప్రతాపరుద్రుడి మరణంతో గణపేశ్వరాలయం వైభవాన్ని కోల్పోయింది. ఓరుగల్లుపై దండయాత్రలకు ఢిల్లీ మహ్మదీయ సైన్యం కరీంనగర్ జిల్లా కాళేశ్వరం ప్రాంతంలోని గోదావరి నది దాటుతూ ఓరుగల్లుకు వెళ్లే మార్గంలో ఉన్న కాకతీయ సంపదలైన గుడులు, చెరువులు, కట్టడాలను ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే గణపేశ్వరాలయ సముదాయాన్ని కూడా ధ్వంసం చేసి.. గణపసముద్రానికి గండి పెట్టి ప్రజల ఆస్తులను దోచుకున్నారని చరిత్ర చెబుతోంది. ఇక క్రీ.శ. 1504నుంచి 1512వరకు ఓరుగల్లును పాలించిన షితాబుఖాన్ అనే సీతాపతి రాజు మహమ్మదీయుల కంటపడి విధ్వంసం కాకుండా కాపాడి భూమిలో పూడ్చిన 8అడుగుల శివ, విష్ణువు ద్వార పాలకుల విగ్రహాలు, రాజనర్తకీ, సూర్యభగవానుల విగ్రహాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. వీటిని పురావస్తు శాఖ గణపేశ్వరాలయ ప్రాంగణంలోని హరితహోటల్ ముందు భద్రపరిచారు.

94 ఏళ్ల కింద వెలుగులోకి వచ్చిన కోటగుళ్లు

కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి అనంతరం నిరాదరణకు గురై సుమారు 696 ఏళ్లు వెలుగులోకి రాని కోటగుళ్లు నిజాం సర్కారు, పురావస్తు శాఖ డైరెక్టర్ గులాం యాజ్దాని 1930లో రామప్ప దేవాలయంతో పాటు గణపేశ్వర ఆలయాన్ని వెలుగులోకి తెచ్చారు. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన గణపేశ్వరాలయానికి 2024నాటికి 790 ఏళ్లు నిండుతాయి. అయితే ఇప్పటికైనా ఆలయాల అభివృద్ధిపై వేల కోట్లు ఖర్చు చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం కోటగుళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




తవ్వకాల్లో బయల్పడిన శిల్పాలు



కోటగుళ్ల చుట్టూ ఉన్న ఉప ఆలయాలు



ఆలయంలోని శివలింగాలు



తను ప్రత్యేకంగా పూజలు చేయడానికి గణపతిరెడ్డి కట్టించుకున్న రెడ్డి గుడి

కొండంత ఎత్తుకు..



అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ పర్వతంపై జాతీయ పతాకంతో యశ్వంత్ (ఫైల్)

- పర్వతారోహణలో సత్తా చాటుతున్న యువకుడు
- బెస్ట్ మౌంటెనర్‌గా యశ్వంత్ రికార్డు
- చదువు కొనసాగిస్తూనే సాధన
- ఎవరెస్ట్ అధిరోహణే లక్ష్యంగా అడుగులు



మరిపెడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అతనో నిరుపేద బిడ్డ. పుట్టింది మారుమూల తండాలో అయినా పర్వతారోహణతో ఖండాంతరాలను దాటుతున్నాడు. అతి చిన్న వయస్సులోనే బెస్ట్ మౌంటినర్‌గా రికార్డులు సాధిస్తున్న ఆయువకుడు.. ఓ చదువుకుంటూనే.. మరోవైపు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాడు. ఇప్పటికే యముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా కిలిమంజారో పర్వాతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించి ఔరా అనిపించాడు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన భూక్యా యశ్వంత్. భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్న కుమారుడు యశ్వంత్ మరిపెడబంగ్లాలోని గ్లోబల్ కేరళ మోడల్‌స్కూల్లో పదోతరగతి వరకు, హైదరాబాద్ ఎన్‌డీసీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్న యశ్వంత్ ఇప్పటికే ఖండాంతరాలు దాటి పలు కఠినమైన పర్వతాలను అధిరోహించి ప్రశంసలు అందుకున్నాడు.

కీర్తి పతాక

ఇంటర్ చదివే సమయంలో కళాశాల యజమాన్యం అప్పుడప్పుడు విహార యాత్రలకు తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో యశ్వంత్ భువనగిరి గుటపై సరదాగా రాక్ క్లైంబింగ్ చేస్తుండగా గమనించిన లెక్చరర్లు పర్వతరోహణకు ప్రోత్సహించారు. వారిచ్చిన ప్రోత్సాహంతో యశ్వంత్ బెస్ట్ మౌంటెనర్‌గా ఎదిగాడు.

ఆర్థిక సమస్యలున్నా వెనక్కు తగ్గకుండా..

నిరుపేద కుటుంబంలో జన్మించిన యశ్వంత్ ఆర్థిక సమస్యలతో సతమతమవుతూనే వెనకడుగేయకుండా లక్ష్య సాధనకు శ్రమిస్తున్నాడు. తండ్రి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్, తల్లి వ్యవసాయ కూలీ. వారి ఆదాయం అంతంత మాత్రమే అయినా సమస్యలను అధిగమిస్తూ లక్ష్యం వైపు సాగుతున్నాడు. ఇప్పటివరకు పలువురి సహకారంతో ప్రపంచంలోని అనేక పర్వతాలను అధిరోహించగా.. పలు రాష్ట్రాల గవర్నర్లు, సీఎంల నుంచి ప్రశంసలందుకున్నాడు. పలువురు ఎస్పీలు ఇచ్చిన స్ఫూర్తి, దాతలు, గిరిజన అధికారులు, కుల సంఘాల నేతలిచ్చిన ప్రోత్సాహంతో సాధన చేస్తున్నాడు.

ఏడు పర్వతాలు అధిరోహించాడు..

యశ్వంత్ 2021నుంచి ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఏడు పర్వతాలను అవలీలగా అధిరోహించాడు. వాటిలో సౌత్‌ఆఫ్రికాలోని 5,895 మీటర్ల ఎత్తుండే కిలిమంజారోతో పాటు రష్యాలోని 5,642 మీటర్లు ఎత్తుండే ఎల్బ్రస్, నేపాల్‌లోని 5,363 మీటర్ల ఎత్తుండే ఎవరెస్ట్‌బేస్, ఆస్ట్రేలియాలోని 7,310 మీటర్లు ఉన్న ఖాసీసీజ్‌గో, లెహ్‌లోని 6,250 మీటర్లు గల ఖాంగ్‌పెట్స్, అరుణాచల్‌ప్రదేశ్‌లోని 6,488 మీటర్లు ఎత్తుండే గోరిచెన్, హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,100 మీటర్లున్న యోమాం పర్వతాలను అధిరోహించి పలు రికార్డులు నమోదు చేశాడు.

ఎవరెస్టే లక్ష్యంగా సాధన చేస్తున్నా : యశ్వంత్



ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. సరదాగా రాక్‌క్లైంబింగ్ చేస్తుండగా గమనించిన లెక్చరర్లు ప్రోత్సహించడంతో మౌంటెనర్‌గా రాణిస్తున్నా. నాలుగేళ్లుగా ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహకారంతో, దాతల చేయూతతో ఇప్పటికే ప్రపంచంలోని పలు కఠినతరమైన పర్వతాలను అధిరోహించా. ప్రభుత్వం నా లాంటి నిరుపేద బిడ్డలను ప్రోత్సహిస్తే జీవితాంతం రుణపడి ఉంటాం.

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్!



ఏకశిల గుట్టపై సినిమా షూటింగ్

వరంగల్ మధ్యకోటలోని ఏకశిల గుట్టపై మంగళవారం 'ఓ భామా అయ్యోరామా' చిత్రం షూటింగ్ చేశారు. హీరోగా కలర్‌ఫొటో ఫేం సుహాస్, హీరోయిన్లుగా మాళవిక, నయని, పావని నటిస్తున్న ఈ చిత్రంలోని పలు సన్నివేశాలను మధ్యకోటలోని శిల్పాలు, ఏకశిల గుట్ట, గుండుచెరువు, ఏకశిల పార్కు పరిసరాల్లో చిత్రీకరించారు. 12వతేదీ వరకు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో షూటింగ్ చేస్తామని యూనిట్ తెలిపింది. ఆనంద్ గాదెగోని నిర్మాణంలో రామ్‌గోదాల దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

- ఖిలావరంగల్, ఆంధ్రజ్యోతి



అయ్యప్ప దేవాయ నమః

హనుమకొండ పద్మాక్షి గుట్టపై పడిపూజ.. మెట్టుగుట్టలో పంబారట్



పడిపూజలో పాల్గొన్న పద్మాక్షి అయ్యప్ప సేవ సమితి సభ్యులు, భక్తులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పద్మాక్షి కాలనీలోని పద్మాక్షి గుట్టపై శ్రీపద్మాక్షి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ అత్యంత వైభవంగా నేత్ర పర్వంగా జరిగింది. పదాక్షి ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ పర్యవేక్షణలో గురుస్వాములు కొండ శ్రీనివాస్, తుమ్మేటి బుచ్చిరాజు ఆధ్వర్యంలో ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి విగ్రహాలకు పూజలు, పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. పదునెట్టాంబడి పూజ, మహా మంగళ హారతి నిర్వహించగా పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. స్వామియే శరణం అయ్యప్ప.. నామ స్మరణతో వందలాది మంది అయ్యప్పస్వామి మాలధారులు శరణుఘోషతో భక్తిని ఇనుమడింపజేసింది. దీంతో ఆ ప్రదేశం అంత పులకించిపోయింది. అనంతరం శ్రీపద్మాక్షి అయ్యప్ప సేవా సమితి సభ్యులు అయ్యప్పస్వామి మాలధారులకు మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు పోల్ లక్ష్మణ్, డప్పు శ్రీను, పెట్టం గంగాధర్, నంద నర్సయ్య, లక్షినారాయణ, సభ్యులు వరుణ్‌రెడ్డి, దొమ్మటి శ్రీకాంత్, కనుకుంట్ల రవికుమార్, దశరథకుమార్, మనోహర్, కుమారస్వామి, టి.ప్రకాష్, టి.శ్రీనివాస్ బొల్లం అశోక్, బండారి మహేందర్, నాగరాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై భక్తిశ్రద్ధలతో పంబారట్టు

మడికొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెట్టుగుట్టపై మంగళవారం అయ్యప్ప స్వామికి అయ్యప్ప మాలధారులు ఘనంగా పంబారట్టు నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి గ్రామ ప్రధాన రహదారుల గుండా ఆటపాటలతో ఊరేగిస్తూ మెట్టుగుట్టపైకి చేర్చారు. పాల గుండంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి భక్తి శ్రద్ధలతో పాటలు పాడుతూ పూజలు చేశారు. అనంతరం దువ్వ సదానందం-సుమతి దంపతులచే మహాన్నప్రసాదం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పూజారి శ్రీకాంత్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, గురుస్వాములు దండిగం సతీష్, పల్లపు నర్సింగరావు, పల్లపు రాజేందర్, కుర్ల మోహన్, బుర్ర రాజన్‌బాబు, పల్లపు కుమార్, ముంజ రమేష్, దువ్వ నవీన్, కల్లెపు భిక్షపతి, పల్లపు అర్జున్, కల్లెపు నర్సయ్య, దువ్వ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం





అయ్యప్ప స్వామిని ఊరేగింపుగా మెట్టుగుట్టపైకి తీసుకువస్తున్న మాలధారులు

ప్రకృతి అందాల నాయిని గుట్ట

- ఆధ్యాత్మికతో పాటు పచ్చని సోయగాలు మచ్చుపహడ్ సొంతం
- సొరిక ప్రాంతంలో వెలసిన వేంకటేశుడు
- నిత్య జలధార, శివరాత్రి జాతర ప్రత్యేకం



గుట్టపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గర్భగుడిలో స్వామివారు

నర్మెట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెండు వైపులా రెండు రిజర్వాయర్లు.. పచ్చని అడవులు. చూడముచ్చటగొలిపే ప్రకృతి సోయగాలు.. వాటికి తోడు ఆధ్మాతిక పరిమళాలు మచ్చుపహడ్ నాయినిగుట్టల ప్రత్యేకం. వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అబ్బురపరిచే ప్రకృతి అందాలతో అలరారుతున్న మచ్చుపహడ్ నాయిని గుట్టలు ఎన్నో విశేషాలకు నిలయం. జనగామ జిల్లా నర్మెట మండలంలోని మచ్చుపహడ్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి స్వయంభువుగా కొలువుదీరాడు. గుట్టపై చిన్న సొరికెలో (గుహ) నీటి ఊట ఉన్న ప్రాంతంలో తాను వెలిసినట్టు సాక్షాత్తు వేంకటేశ్వరస్వామియే ఓ వ్యక్తి కలలోకి వచ్చి చెప్పాడని, దాంతో 1969లో అదే ప్రాంతంలో ప్రజలు స్వామిని ప్రతిష్ఠించారట. నాటి నుంచి గుట్టపై పూజలు కొనసాగుతుండగా 1987లో గుడిని నిర్మించి సొరికె(గుహ)లో ఉన్న విగ్రహాన్ని గుడిలో ప్రతిష్ఠించారు. నాయిని గుట్టపై వెలవడంతో నాయిని వేంకటేశ్వర స్వామిగా సంబోధిస్తుంటారు. ఇక ఈ ప్రాంతంలో మరో విశేషం ఏంటంటే నీటి ఊట. మండు వేసవిలో కూడా ఇక్కడ జలదార వస్తూనే ఉంటుంది. నీటి ఊటలోని నీళ్లు తాగి మీద చల్లుకుంటే కోరిన కోర్కెలను వేంకటేశ్వరస్వామి తీరుస్తాడని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఇక 1969 సంవత్సరంలో వేంకటేశ్వరస్వామి వెలసినప్పటి నుంచి ప్రతీ శివరాత్రికి మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నారు. మధ్యలో కొన్ని సంవత్సరాలు జాతరను నిలిపేయగా.. గ్రామానికి మంచి జరగడం లేదని భావించి మళ్లీ 1981నుంచి జాతరను ప్రారంభించారు. జాతర చివరి రోజు గ్రామ ప్రజలంతా వనభోజనాలకు వెళ్లి గుట్ట వద్ద నిద్రిస్తారు.

కనువిందు చేస్తున్న పరిసరాలు

మండలంలోని మల్లన్నగండి రిజర్వాయర్, రఘునాథ్‌పల్లి మండలంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్‌కు మచ్చుపహడ్ గుట్ట మధ్యలో ఉంది. గుట్టపైకి ఎక్కి చూస్తే ముందు భాగం నుంచి అశ్వరావుపల్లి రిజర్వాయర్ కనిపిస్తుంది. వెనుక భాగంలో మల్లన్న గండి రిజర్వాయర్ ఉంది. రెండు రిజర్వాయర్ల మధ్య పచ్చటి అడవులతో ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా మచ్చుపహడ్ నాయిని వెంకటేశ్వరస్వామి గుట్ట ప్రకృతి అందాలతో, ఆధ్యాత్మీకతను పంచుతోంది. గుట్ట చూట్టూ గిరిజన సమూహాలు, పచ్చటి పంట పొలాలతో కనువిందు చేస్తోంది. పక్షుల కిలకిలలతో పరిసరాలు నయనానందకరంగా కనిపిస్తాయి. గుట్ట పరిసర ప్రాంతంలో వన్యప్రాణులు కూడా సంచరిస్తుంటాయి. ఇటు ప్రకృతి రమణీయత, అటు ఆధ్యాత్మికతతో ఉన్న మచ్చుపహడ్ గుట్టను ప్రభుత్వం గుర్తించి పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి. మల్లన్నగండి రిజర్వాయర్‌ను సైతం పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి. బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రకృతి అందాల మచ్చుపహడ్ గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



గుట్టపై ఉన్న జలధార

ఆధ్యాత్మికం



హర్షిత ప్రియదర్శిని వయసు చిన్నదే కానీ ఆశయం పెద్దది. పద్మశ్రీ పురస్కార గ్రహీత కమలా పూజారి స్ఫూర్తితో రెండువందలకు పైగా అరుదైన దేశీయ విత్తనాలను సేకరించి... 'సీడ్‌బ్యాంక్'ను ఏర్పాటు చేసింది. ఎనిమిదో తరగతి చదువుతున్న పదమూడేళ్ళ ఈ ఒడిశా అమ్మాయి సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యతను, అంతరించిపోతున్న ధాన్యాల పరిరక్షణ ఆవశ్యకతను ప్రచారం చేస్తోంది.

సాధికారమైన భవిష్యత్తు కోసం...

ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన హర్షిత ప్రియదర్శిని మహంతి జీవితం రెండేళ్ళ క్రితం వరకూ అందరు బడి పిల్లల్లా గానే ఆడుతూ, పాడుతూ గడిచింది. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలో చేర్పడానికి హర్షితను తీసుకొని ఆమె తండ్రి బాలకృష్ణ మహంతి బయలుదేరారు. దారిలో కమలా పూజారి ఎదురయ్యారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, దేశీయ విత్తనాలను పరిరక్షించినందుకు పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న కమలను హర్షితకు ఆయన పరిచయం చేశారు. "దేశీయమైన ఎన్నో ధాన్యం రకాలు మాయమైపోతున్నాయి. వాటిని రాబోయే తరాల కోసం భద్రపరచవలసిన బాధ్యత పిల్లలదేనని కమలా పూజారి నాకు చెప్పారు.

ఆ సదస్సుతో జాతీయ గుర్తింపు...

"కిందటి ఏడాది సెప్టెంబర్‌లో రైతుల హక్కులపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ప్రతినిధిగా హాజరై, వేదిక నుంచి నా అభిప్రాయాలను ఆహూతులతో పంచుకున్నాను. ఆ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. భారత హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ కుమార్తె, ప్రముఖ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్‌ను కలుసుకొనే అవకాశం అక్కడ దొరికింది. నేను చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకొని, వాటిని కొనసాగించాలని ప్రోత్సహించారు. ఆమె మాటలు నాలో ఎంతో ఉత్తేజాన్ని నింపాయి. అలాగే నా పేరు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి ఆ సదస్సు దోహదపడింది"

అంతేకాదు... నాలుగు రకాల వరి విత్తనాలను నాకు కానుకగా ఇచ్చారు. ఆమె మాటలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆ తరువాత కొరాపుట్‌లోని గిరిజన మ్యూజియంలో... పర్యావరణ వైవిధ్యంపై 'ఏక్రా' అనే సంస్థ ఒక ఉత్సవం ఏర్పాటు చేసింది. అక్కడ అనేక రకాల ధాన్యం, కూరగాయలు, చిరుధాన్యాలను ప్రదర్శించారు. వాటిని చూశాక... అరుదైన విత్తనాలను సంరక్షించాలనే కోరిక నాలో మరింత బలపడింది" అని గుర్తు చేసుకుంటుంది హర్షిత. కమలాపూజారి మార్గదర్శకత్వంలోనే దేశీయ విత్తనాల సేకరణను ఆమె ప్రారంభించింది.

10 వేల మందిలో మొదటి స్థానం...

ఆ తరువాత... బడి లేని రోజుల్లో తండ్రి సాయంతో పొలాల్లోకి వెళ్ళడం, రైతులతో మాట్లాడడం, విత్తనాల గురించి తెలుసుకోవడం, అరుదైన వాటిని సేకరించడం ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారిపోయింది. "ఒక్కొక్క రకాన్ని సేకరిస్తున్నప్పుడు అంతులేని సంతోషం కలిగేది. వాటి ప్రత్యేకతల గురించి రైతులు చెబుతూ ఉంటే నమోదు చేస్తున్నప్పుడు... ఇతరులకు కూడా ఈ అంశం మీద ఆసక్తి పెంచితే మంచిదని భావించాను. 'హర్షిత ప్రియదర్శిని సైన్స్ క్లబ్' పేరిట ఒక సంస్థను, సీడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాను. అప్పటి నుంచి నా పని ప్రణాళికాబద్ధంగా సాగుతూ వచ్చింది అని చెప్పింది హర్షిత. ప్రతి రకం విత్తనాన్ని 100 నుంచి 250 గ్రాముల వరకూ సేకరిస్తుంది. అంతకన్నా ఎక్కువ దొరికితే రైతులకు వాటిని ఉచితంగా



పంచుతుంది. కిందటి ఏడాది 20మందికి, ఈ ఏడాది 50 మందికి విత్తనాలు అందించింది. కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో 'ఐడియా యంగ్‌స్టర్స్' అనే జాతీయ స్థాయి పోటీలో ఆమె పాల్గొంది. 12-17 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు ఆచరణలోకి తెచ్చేందుకు సాయపడడం ఈ పోటీల లక్ష్యం. పలు దశల్లో దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి సుమారు 10 వేలమంది పాల్గొన్న ఈ పోటీలో హర్షిత మొదటి స్థానంలో నిలిచింది. సేంద్రియ సాగు, సంప్రదాయ విత్తనాల ప్రాధాన్యం గురించి న్యాయమూర్తులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానాలు న్యాయమూర్తులను ఆకట్టుకున్నాయి. విజేతగా తనకు లభించిన రూ. రెండున్నర లక్షల నగదుతో విత్తన సంరక్షణ కోసం ఒక మూల నిధిని హర్షిత ఏర్పాటు చేసింది.

అని చెబుతోంది హర్షిత. ఢిల్లీలో జరిగిన 'జి-20' సదస్సు, భువనేశ్వర్‌లో నిర్వహించిన 'అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు'... ఇలా అనేక ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాల్లో తన సేకరణలను ఆమె ప్రదర్శించింది. హర్షిత కృషికి గుర్తింపుగా పారాదీప్ ఫాస్ఫేట్స్, 'శిక్ష ఓ అనుసాన్' విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'కృషిక్ రత్న' బిరుదుతో సత్కరించాయి. అలాగే 'స్టూడెంట్ ఆఫ్ ఇండియా' అవార్డును 'వార్ ఇండియా' సంస్థ నుంచి 'జ్యూవెల్ ఆఫ్ ఇండియా' పురస్కారాన్ని... ఇలా పలు గౌరవాలను ఆమె అందుకుంది.

వాటి ప్రాధాన్యతను వివరిస్తూ...

ఇప్పటివరకూ 180కి పైగా దేశీయ వరి విత్తనాలను, 80కి పైగా చిరుధాన్యాల రకాలను హర్షిత సేకరించింది. వాటిని గాజు, ప్లాస్టిక్ సీసాల్లో, మట్టి కుండలలో భద్రపరుస్తుంది, అవి పాడవకుండా ఉండడం కోసం వేప మాత్రలను ఉపయోగిస్తుంది. "వేప సహజమైన క్రిమి సంహారిణి. విత్తనాలు, ధాన్యం సంరక్షణ కోసం వందల ఏళ్ళ నుంచి వాటిని మన దేశంలో వినియోగిస్తున్నాం. అందుకే వాటిని వాడాలని నేను అందరికీ చెబుతున్నాను. అలాగే ఎక్కడికి వెళ్ళినా దేశీయమైన విత్తనాల ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాను. అవి మన పరిస్థితులకు అనుకూలమైనవి. మన వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకోగలవు. వాటి సాగుకు నీటి అవసరం తక్కువ. అదే విధంగా వాటిలో పోషక విలువలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి దేశీయ విత్తనాలను సంరక్షించుకొనేలా రైతులను ప్రోత్సహించాలి. దీనివల్ల ప్రతి సీజన్‌లో విత్తనాలు కొనడానికి డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. రైతుల సాధికారమైన భవిష్యత్తుకు ఇది దోహదపడుతుంది. అదే నా లక్ష్యం" అని చెబుతున్న హర్షితకు విత్తనాలతో పాటు విదేశీ కరెన్సీని, స్టాంపులను సేకరించడం కూడా హాబీ. 80 దేశాలకు చెందిన 2వేల నాణేలు, 40 దేశాలకు చెందిన 1,500కు పైగా స్టాంపులు ఆమె సేకరణలో ఉన్నాయి. తోటి విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఒక బృందంతో తను నివసించే బోయ్‌పరిగూడ పరిధిలోని అయిదు గ్రామాలను ఆమె తరచూ సందర్శించి, సేంద్రియ వ్యవసాయం గురించి రైతులకు వివరిస్తూ ఉంటుంది. "అరుదైన అనేక వరి, చిరుధాన్యాల విత్తనాలు నా సేకరణలో ఉన్నాయి. వాటిని సాగు చేసేందుకు రైతులకు సాయపడాలనేదే నా కోరిక" అంటున్న హర్షిత భవిష్యత్తులో వ్యవసాయ శాస్త్రవేత్త అవుతానంటోంది.

విజేత



చదువు... పెళ్లి... ఉద్యోగం... జీవిత గమనంలో పడి ఇష్టమైన ఆర్చరీని అటకెక్కించారు. బజార్లో చూసి కొడుకు ముచ్చటపడితే... విల్లు కొనిచ్చారు. అది ఆట వస్తువే... కానీ ఆ క్షణం ఆమెను కాలేజీ రోజులకు తీసుకువెళ్లింది. ఆర్చరీలో పతకాల కోసం పోటీపడిన ఘట్టాలను గుర్తుకుతెచ్చింది. ఇప్పుడు... లక్ష్యానికి 'గురి' పెట్టి... విజయం సాధించడమే కాదు... గురువుగా కొడుకునూ తన మార్గంలో నడిపి... ఎందరో తల్లులకు ఆదర్శంగా నిలుస్తున్నారు అర్చన. అమెరికాలో తన ప్రస్థానం గురించి ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

ఆర్చరీ అర్చన... గురి కుదిరింది



"లక్ష్యాలు, అభిరుచులు అందరికీ ఉంటాయి. కానీ పరిస్థితుల కారణంగా ఒక్కోసారి అవి పక్కకు వెళ్లిపోతుంటాయి. నా విషయంలోనూ అదే జరిగింది. ఆర్చరీ నాకు ఎంతో ఇష్టమైన క్రీడ. అందులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎన్నో కలలు కన్నాను. పెళ్లి తరువాత కొత్త జీవితం ప్రారంభమైంది. ఇష్టపడిన ఆర్చరీ గురించి ఆలోచించే సమయమే లేకుండాపోయింది. మా అబ్బాయి ద్వారా అనుకోకుండా మళ్లీ అది నా జీవితంలో భాగమైంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం చందాపురంలోని ఓ రైతు కుటుంబం మాది. అక్కడి కేవీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో మొదటిసారి విల్లు చేతపట్టాను. నా నైపుణ్యాన్ని చూసిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు నన్ను ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీలకు ఎంపిక చేశారు. 2009లో అలా తొలి అడుగు పడింది. నాగార్జున విశ్వవిద్యాలయంలో, ఆ తరువాత చండీగఢ్‌లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. సరైన శిక్షణ లేకపోవడంతో ఆ పోటీల్లో పెద్దగా రాణించలేదు.

అమెరికా వెళ్లాక...

డిగ్రీ తరువాత పీజీ చదివాను. ఆ వెంటనే నాకు పెళ్లి చేశారు ఇంట్లోవాళ్లు. 2013లో మావారు శ్రీధర్‌తో కలిసి అమెరికా వచ్చాను. టెక్సాస్‌లో నివాసం. ఇద్దరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నాం. మాకు ఒక అబ్బాయి...

> "ఫీల్డ్ చాంపియన్‌షిప్‌ల కోసం అడవులకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ లక్ష్యాలు నిర్దేశించి పోటీలు నిర్వహించేవారు. నలుగురం చొప్పున అడవిలోకి వెళ్లి పోటీపడాలి. ఆ సమయంలో నాకు ఎంతో భయం వేసింది."

ఈశ్వర్. పెళ్లి, పిల్లాడు, ఉద్యోగం... క్షణం తీరిక లేకుండా పదేళ్లు గడిచిపోయాయి. నాలోని క్రీడాకారిణి మరుగున పడిపోయింది. ఏడేళ్ల మా అబ్బాయికి బొమ్మలు కొందామని బయటకు వెళ్లినప్పుడు... అనుకోకుండా విల్లు ఒకటి వాడి కంట పడింది. వాడికి అది కొని ఇచ్చాను. ఇంటికి వచ్చాక వాడు దాంతో ఆడుతుంటే నాకు పాత రోజులు గుర్తుకువచ్చాయి.

మళ్లీ అలా మొదలైంది...

మా అబ్బాయికి నేర్పించే క్రమంలో నేను కూడా సాధన మొదలుపెట్టాను. మా ఇద్దరి ఉత్సాహం చూసిన మావారు... మాకు మంచి శిక్షణ ఇప్పించాలని అనుకున్నారు. అయితే అది ఎంతో ఖర్చుతో కూడుకున్నదని తెలిశాక... ఆన్‌లైన్‌లో విలువిద్యా నైపుణ్యాల సమాచారాన్ని, ప్రముఖ ఆటగాళ్ల అనుభవాలను, సూచనలను సేకరించారు. వాటిని మా ఇద్దరికీ చెప్పే క్రమంలో ఆయన మాకు గురువుగా మారారు. కొన్ని మాసాల శిక్షణ తరువాత నేను పోటీలకు సిద్ధమయ్యాను.

అమెరికన్ల క్రీడాస్ఫూర్తి...

సౌత్ డకోటా టోర్నీలో నేను రజత పతకం సాధించినప్పుడు. ఆ పోటీల్లో అమెరికాకు చెందిన క్రిస్టిలయన్స్ స్వర్ణం గెలిచింది. తను నాకు ప్రత్యర్థి అయినప్పటికీ ఆటలో పలు సూచనలు ఇచ్చింది. తరువాత జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కూడా క్రిస్టిలయన్స్ పతకాలు నెగ్గింది. ఆమెతో పోటీపడడం నాకు లభించిన అరుదైన అవకాశం. మరో అమెరికా క్రీడాకారుడు రిక్‌స్టోన్ బ్రేకర్ నా ప్రతిభ చూసి అభినందించాడు. తను కూడా నాకు పలు సూచనలు ఇస్తుంటాడు. పోటీలు ఉన్నప్పుడు ప్రోత్సహిస్తుంటాడు.



గెలుపు బాట...

గత ఏడాది జార్జియాలో జరిగిన స్టేట్ ఆర్చరీ చాంపియన్‌షిప్ ద్వారా తిరిగి బరిలోకి దిగాను. అందులో కాంస్య పతకం గెలిచాను. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన కెంటకీ స్టేట్ చాంపియన్‌షిప్‌లో, ఆ తరువాత కాంటినెంటల్ దేశాల ఇండోర్ పోటీల్లో స్వర్ణ పతకాలు నెగ్గాను. అంతేకాదు... మిస్సోరీ, లూసియానా, ఓక్లహోమా రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు వచ్చాయి. జార్జియా స్టేట్ ఇండోర్, ఎన్ఎపి నేషనల్ చాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలు గెలుచుకున్నాను. డకోటాలో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాను. నార్త్ అమెరికా కాంటినెంటల్ పోటీలలో భారత్ తరపున ఆడి స్వర్ణం గెలిచాను. పాన్ అమెరికా ఇంటర్‌నేషనల్ పోటీలలో రజతం, టెక్సాస్ స్టేట్ అవుట్‌డోర్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, ఎన్ఎపి ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో రజతం, అవుట్‌డోర్ టార్గెట్ చాంపియన్‌షిప్‌లో రజతం... ఇలా వెళ్లిన చోటల్లా పతకాలు పట్టుకువచ్చాను. టెక్సాస్ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో అయితే స్టేట్ రికార్డుతో స్వర్ణ పతకం గెలిచాను. ఇది నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది.

నా దారిలోనే మా అబ్బాయి...

మా అబ్బాయి కూడా నాతోపాటే శిక్షణ తీసుకొంటున్నాడు. కొన్నాళ్లకు వాడు కూడా పోటీలకు సిద్ధమయ్యాడు. వివిధ చాంపియన్‌షిప్‌ల్లో పాల్గొని పతకాలు సాధించాడు. జార్జియా స్టేట్ ఇండోర్ టోర్నీలో రికార్డు నెలకొల్పడమే కాకుండా, స్వర్ణ పతకం గెలిచాడు. ఎన్ఎఫ్ఎఏ ఇండోర్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, డకోటా క్లాసిక్ నేషనల్ టోర్నమెంట్‌లో స్వర్ణం, యూఎస్ ఆర్చరీ ఫీల్డ్ నేషనల్స్‌లో రజతం, సదరన్ ఔట్‌డోర్ రీజనల్ పోటీల్లో స్వర్ణ పతకం నెగ్గాడు. విశేషమేమంటే... నార్త్ అమెరికా ఫీల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం, యూఎస్ ఓపెన్ జాతీయ పోటీల్లో రజతంతో పాటు ఎన్ఎఫ్ఎఏ నేషనల్ ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో మూడు జాతీయ రికార్డులు నెలకొల్పాడు. ఇలా ఎన్నో విజయాలు వాడి ఖాతాలో ఉన్నాయి.

లక్ష్యం... టాప్-5...

ప్రస్తుతం నేను అమెరికా ఆర్చరీ అసోసియేషన్ ర్యాంకింగ్స్‌లో పద్నాలుగవ స్థానంలో ఉన్నాను. టాప్-5లో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాను. ఆ స్థాయికి వెళితే అసోసియేషన్ ద్వారా శిక్షణ, ఇతర సౌకర్యాలు అందుతాయి. ఇక మా అబ్బాయిని ఒలింపిక్స్‌లో ఆడించడమే నా ప్రధాన లక్ష్యం. మేమిద్దరం ఆర్చరీలో రాణిస్తున్నామంటే అందుకు మావారే కారణం. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న క్రీడ. ఖర్చుకు వెనకాడకుండా ఆయన మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. మమ్మల్ని క్రీడా ప్రాంగణానికి చేర్చడానికి మావారు ఏకధాటిగా పదిహేను గంటలపాటు కారు డ్రైవింగ్ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి."

• శాఖమూరి మల్లిఖార్జునరావు, నందిగామ

తినేటప్పుడు నీళ్లు తాగొచ్చా?

భోజనం చేసేటప్పుడు, ఏదైనా చిరుతిండి తినేటప్పుడు నీళ్లు తాగవచ్చా? అనే సందేహం చాలామందికి వచ్చే ఉంటుంది. ఆహారాన్ని తింటూ మధ్యలో నీళ్లు తాగడం వల్ల పొట్టలో ఉత్పత్తి అయ్యే ఆమ్లాలు పలుచగా మారి జీర్ణక్రియ ఆలస్యమవుతుందని కొందరు, పోషకాలను వేగంగా గ్రహించడంతోపాటు అధికంగా వేడికి గురికాకుండా శరీరాన్ని కాపాడుతుందని ఇంకొందరు అంటారు. ఇంతకీ ఏం చెయ్యాలి?

మితంగా: తినేటప్పుడు ఎక్కువగా నీళ్లు తాగితే కడుపు ఉబ్బరిస్తుంది. పొట్ట నిండిన భావనను కలిగిస్తుంది. దీనివల్ల భోజనాన్ని ఆస్వాదించడం కష్టమవుతుంది. రుచికరమైన ఆహారపదార్థాలను తినేటప్పుడు... నీళ్లు తాగాలని అనిపిస్తేనే తాగాలి. లేదంటే పొట్టలో నీటి శాతం పెరిగి అజీర్ణ సమస్య ఏర్పడుతుంది.

ఆ ఇబ్బంది రాకుండా : కొన్నిసార్లు తిన్న ఆహారం విఎంగేటప్పుడు కష్టంగా అనిపిస్తుంది. వృద్ధులకు నోరు పొడారిపోయి ఉంటుంది కాబట్టి వీరికి కూడా ఆహారాన్ని మింగడంలో ఇబ్బంది ఎదురవుతుంది. ఇలాంటి సందర్భాల్లో కొద్దిగా నీళ్లు తాగితే అన్నవాహికలోని ఆహారం తేలికగా పొట్టలోకి జారుతుంది. నీరు అన్నవాహికలో కందెనలా పనిచేస్తుంది. ఆహారంలోని పోషకాలను కరిగించి శరీరం త్వరగా గ్రహించేలా చేస్తుంది.

బరువు తగ్గేందుకు: భోజనం మధ్యలో నీళ్లు తాగడం వల్ల ఎక్కువగా తినాలన్న ఆలోచన రాదు. దీనివల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. భోజనానికి ముందు, భోజనం తరవాత కొద్దిగా నీళ్లు తాగడం వల్ల జీర్ణాశయానికి తగినంత తేమ అందుతుంది, జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. మూత్ర పిండాలలో నీరు చేరి మలాన్ని మెత్తబరుస్తుంది. దీనివల్ల మలబద్ధకం రాదు. శరీర వ్యర్థాలన్నీ తేలికగా బయటకు వెళతాయి.

కావాల్సినంత: శరీర తత్వాన్ని అనుసరించి దాహం వేసినంత మేరకు మాత్రమే నీటిని మెల్లగా తాగాలి. అరగ్లాసు నుంచి ఒక గ్లాసు వరకు నీటిని తాగవచ్చు. అంతకుమించి తాగితే కడుపు సాగినట్లయి అసౌకర్యంగా ఉంటుంది. భోజనానికి అర్ధగంట ముందు ఒక గ్లాసు నీళ్లు తాగితే జీర్ణాశయం తేమగా ఉంటుంది. ఆకలి కూడా నియంత్రణలో ఉంటుంది.



ఫ్యాషన్



బ్రొకేడ్ భలే!

వినూత్నంగా కనిపించాలనుకుంటే, మెరుపులీనే దుస్తులను ఎంచుకోవాలి. వాటిలో చెప్పుకోదగినది 'బ్రొకేడ్'. పట్టు మెరుపులు చిందిస్తూ విలాసవంతంగా కనిపించేలా చేసే బ్రొకేడ్ ఫ్యాషన్ దుస్తులు ఇవే!

సిల్క్ బ్రొకేడ్: పట్టు దారాలతో తయారయ్యే ఈ బ్రొకేడ్ సహజసిద్ధమైన మెరుపుతో, మృదుత్వంతో ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సంక్లిష్టమైన ఆకృతుల్లో, వైవిధ్యమైన రంగుల్లో రూపొందే ఈ తరహా బ్రొకేడ్... పండుగలు, వేడుకలకు ఎంతో బాగా నప్పుతుంది.

బెనారస్ బ్రొకేడ్: వారణాసి మూలాలున్న బెనారస్ బ్రొకేడ్ పట్టు దారాలు, ఎంబ్రాయిడరీలతో తయారవుతుంది. పూలు, లతల డిజైన్లు బంగారం, వెండి దారాలతో తయారవుతూ ఉంటాయి. చీరలు, ఇతర సంప్రదాయ దుస్తుల తయారీ కోసం బెనారస్ బ్రొకేడ్‌ను ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.

పట్టు, గోల్డ్ బ్రొకేడ్ వస్త్రాలతో పాటు సౌకర్యానికి పెద్దపీట వేసే నూలు బ్రొకేడ్ వస్త్రంతో తయారయ్యే దుస్తులూ ఉంటాయి. సందర్భానికీ, వాతావరణానికీ తగ్గట్టు నప్పే శైలిని ఎంచుకునే భిన్నమైన మెటీరియల్స్‌తోనూ బ్రొకేడ్ దుస్తులు తయారవుతూ ఉంటాయి.

గోల్డ్ బ్రొకేడ్: అసలైన బంగారు పోగులతో లేదా బంగారు రంగు దారాలతో తయారయ్యే గోల్డ్ బ్రొకేడ్‌ను వేడుకల్లో వేసుకునే విలాసవంతమైన దుస్తుల తయారీకి ఉపయోగిస్తూ ఉంటారు. బంగారు పోగులు వస్త్రానికి రాచరిక హుందాతనాన్ని ఆపాదిస్తాయి. కాబట్టి పెళ్లిళ్లలో వధువులు ధరించే వస్త్రాల కోసం ఈ వస్త్రాన్నే ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.

మెరిసే చర్మానికి మునగాకు

అందానికి, ఆరోగ్యానికి మునగాకు ఎంతగానో తోడ్పడుతుంది. దీనిలో ఎ, సి, ఇ విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు, మరెన్నో పోషకాలు ఉన్నాయి. చలికాలంలో చర్మాన్ని మెరిపించడంలో మునగాకు ఎలా సహకరిస్తుందో తెలుసుకుందాం.

- మునగాకును ఆహారంలో చేర్చుకోవడం వల్ల అందులోని పోషకాలు చర్మం మీద పేరుకునే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. వ్యర్థాలన్నీ తొలగి చర్మం కాంతిమంతం అవుతుంది.
- ఒక గిన్నెలో గుప్పెడు మునగాకులను వేసి ఒక గ్లాసు నీళ్లు పోసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీటిని వడబోయాలి. దీనితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచి టోనర్‌లా పనిచేసి చర్మం మృదువుగా మారుతుంది.
- మునగాకును తరచూ తినడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ పెరిగి, తేమ అందుతుంది. చర్మం మీద నిలిచి ఉండే కొవ్వులను కరిగించి మొటిమలు రాకుండా చేస్తుంది. ముఖం మీద ముడతలు, గీతలు ఏర్పడకుండా నివారిస్తుంది. అకాల వార్ధక్య లక్షణాలు రానీయకుండా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.



- మునగాకులను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. బాగా ఆరాక మెత్తని పొడిలా చేయాలి. దీనితో ముఖాన్ని మెల్లగా రుద్దితే బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ తొలగిపోతాయి.
- గుప్పెడు మునగాకులను తీసుకుని నీళ్లు చల్లుతూ మెత్తగా నూరాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అర్ధగంట ఆరనివ్వాలి. తరవాత మంచినీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మ రంధ్రాల్లోని మురికి తొలగిపోతుంది. మొటిమలు, బ్లాక్ హెడ్స్ రావు. చర్మానికి మంచి ఛాయ వస్తుంది.

'పుష్ప' ప్రీమియర్ షోతో
మాకు సంబంధం లేదు

- దాన్ని డిస్ట్రిబ్యూటర్‌లు ప్రభుత్వ అనుమతితో నిర్వహించారు
- రేవతి మృతిలో మా ప్రమేయం లేదు...మాపై కేసు కొట్టేయండి..
- హైకోర్టులో సంధ్య థియేటర్ యాజమాన్యం పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుష్ప- 2 ప్రీమియర్ షోలో రేవతి అనే మహిళ మృతికి, తమకు ఎలాంటి సంబంధం లేదని సంధ్య థియేటర్ యజమానులు తెలిపారు. అందువల్ల తమపై పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని కోరుతూ యజమానురాలు రేణుకాదేవి, ఇతరులతో పాటు సంధ్య సినీ ఎంటర్‌ప్రైజ్ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 5వ తేదీన పుష్ప-2 ప్రీమియర్ షోకు టికెట్లు కొనుక్కొని వెళ్లిన రేవతి అనే మహిళ తొక్కిసలాటలో మృతిచెందగా ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై రేవతి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ యాజమాన్యం, సినీహీరో అల్లు అర్జున్ సహా పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని యజమానులు కోరారు. థియేటర్ తమదే అయినప్పటికీ ప్రీమియర్ షోతో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ షోను డిస్ట్రిబ్యూటర్లు నిర్వహించారని, ప్రీమియర్ షో, బెనిఫిట్ షోలకు అనుమతిస్తూ ప్రభుత్వం మెమో సైతం జారీచేసిందని తెలిపారు. థియేటర్ మైత్రీ డిస్ట్రిబ్యూటర్ ఆధీనంలో ఉందని తెలిపారు. అయినప్పటికీ తమ బాధ్యతగా తాము బందోబస్తు కల్పించాలని, జనాలను అదుపు చేయాలని పోలీసులకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. కొంతమంది పోలీసులు బందోబస్తుకు వచ్చినప్పటికీ విపరీతమైన తోపులాట వల్ల ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంతో తమకు ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి చేశారంటూ వంటి తీవ్రమైన సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. సినీహీరో సెక్యూరిటీ సిబ్బంది వల్ల ఘటన జరిగినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారే తప్ప తమపై ఎలాంటి ఆరోపణ లేదని తెలిపారు. అందువల్ల కేసు కొట్టేయాలని కోరారు.

అయ్యో... దేవుడా!

- చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్
- 40 రోజులు చర్చిలోనే ఉండి ఉపవాస ప్రార్థనలు
- చర్చిలోనే ప్రాణాలు వదిలిన చిన్నారి



కలువాయి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారికి బ్రెయిన్ ట్యూమర్! తల్లిదండ్రులు నిరక్షరాస్యులు! దానికి తోడు పేదరికం! శస్త్రచికిత్స చేయించేందుకు స్థోమత సరిపోలేదు. పైగా... ఆపరేషన్ చేస్తే ఏమవుతుందో అని భయపడ్డారు! చివరికి దేవుడిని నమ్ముకున్నారు. 40 రోజులు చర్చిలోనే ఉండి ప్రార్థనలు చేశారు. చివరికి... చర్చిలోనే ఆ చిన్నారి కన్ను మూసింది! 'ట్రాన్స్' సినిమాను గుర్తు చేసే ఈ ఘటన నెల్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా కలువాయి మండలం బాలాజీరావుపేట దళిత కాలనీకి చెందిన లక్ష్మయ్య లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. నెల్లూరులో ఓ అపార్ట్‌మెంటులో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తె భవ్యశ్రీ(8)ని నూకనపల్లిలో ఉంటున్న లక్ష్మి చెల్లెలు వద్ద ఉంచి స్కూలుకు పంపుతున్నారు. కొంతకాలంగా భవ్యశ్రీ తలనొప్పి, వాంతులతో బాధపడుతోంది. దీంతో తల్లిదండ్రులు ఆ చిన్నారిని నెల్లూరులో, తిరుపతిలో పలువురు వైద్యులకు చూపించారు. భవ్యశ్రీ తలలో ట్యూమర్ ఉందని, శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు తెలిపారు. అయితే... భవ్యశ్రీకి శస్త్ర చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులు భయపడ్డారు. దీనికితోడు వారి ఆర్థిక స్తోమత కూడా సహకరించలేదు. దీంతో శస్త్రచికిత్స ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ క్రమంలో ఆదూరుపల్లిలోని చర్చిలో ప్రార్థనలు చేస్తే జబ్బు నయమవుతుందని కొందరు బంధువులు చెప్పారు. దీంతో వారు భవ్యశ్రీతోపాటు చర్చికి చేరుకున్నారు. 40 రోజులుగా అక్కడే ఉంటూ ఉపవాసాలతో ప్రార్థనలు చేస్తూ వచ్చారు. బిడ్డ పరిస్థితి క్షీణిస్తున్నా దేవుడినే నమ్ముకున్నారు. చర్చి ఫాదరు కూడా వారిని వారించలేదు. బిడ్డ ఆరోగ్యం కుదుటపడుతుందని, ఇబ్బందిలేదని చెప్పారు. అదే నమ్మకంతో వారు చర్చిలోనే ఉండిపోయారు. భవ్యశ్రీ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తూ వచ్చింది. సోమవారం అర్ధరాత్రి చర్చిలోనే ఆ చిన్నారి ప్రాణాలు విడిచింది!

ఏపీ నుంచి రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికలు జరుగుతున్న మూడు సీట్లు ఏకగ్రీవం అయ్యాయి. ఈ మూడు సీట్లకు మంగళవారం ఇక్కడ ముగ్గురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఉప సంహరణల గడువు ముగిసిన తర్వాత వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించనున్నారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన మంగళవారం ఇక్కడి అసెంబ్లీ భవనంలో టీడీపీ అభ్యర్థులు బీద మస్తాన్ రావు, సానా సతీశ్, బీజేపీ అభ్యర్థి ఆర్ కృష్ణయ్య ఎన్నికల అధికారి వనితా రాణి ముందు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.





చిరిగిన చొక్కాను చూపిస్తున్న మంచు మనోజ్, జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి వద్ద మోహరించిన పోలీసులు, దుబాయ్ నుంచి తమ నివాసానికి చేరుకున్న విష్ణు



మంచు ఫైటింగ్స్

(మొదటిపేజీ తరువాయి)

అయ్యాయి. దీంతో జర్నలిస్టు సంఘాలు మోహన్‌బాబు వైఖరిని తీవ్రంగా ఖండించాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. కాగా, జల్‌పల్లిలో జరిగిన ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు మోహన్‌బాబు, మనోజ్ లైసెన్స్ గన్‌లను స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. బుధవారం విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ మోహన్‌బాబుకు రాచకొండ సీపీ నోటీసులు జారీ చేశారు. మోహన్‌బాబు నివాసం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు మోహన్‌బాబు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. అంతకుముందు తన కుమారుడు మనోజ్‌ను ఉద్దేశించి మోహన్‌బాబు ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. అందులో.. మనోజ్ ప్రవర్తనను తీవ్రంగా తప్పుబట్టారు. భార్య మాటలు విని తప్పుదారి పట్టావంటూ మనోజ్‌ను నిందించారు. ఇంట్లోకి వచ్చే అధికారం, హక్కు మనోజ్‌కు లేవని, తన కష్టార్జితమైన ఆస్తిని తనకు ఇష్టంవచ్చిన వారికి రాసిస్తానని పేర్కొన్నారు.

మనోజ్‌ను ఇంటి నుంచి వెళ్లగొట్టిన విష్ణు బౌన్సర్లు?

మోహన్‌బాబు పెద్ద కుమారుడు విష్ణు దుబాయ్ నుంచి మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు రావడంతో అప్పటిదాకా ఉన్న వివాదం కాస్తా పెద్దదైంది. జల్‌పల్లిలోని నివాసానికి చేరుకున్న విష్ణు.. వస్తూనే తన బౌన్సర్‌లు, తన తండ్రి మోహన్‌బాబు సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మనోజ్ బౌన్సర్లను బయటకు వెళ్లగొట్టినట్లు తెలిసింది. ఇంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారంటూ బౌన్సర్‌లను ఆయన కొట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో విష్ణు, మనోజ్ బౌన్సర్ల మధ్య గొడవ జరిగింది. దాంతో కాసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత మనోజ్‌ను ఆయన భార్య మౌనికను ఇంటి నుంచి బయటకు పంపినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు మీడియాలో వైరల్‌గా మారాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనోజ్ దంపతులు తెలంగాణ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ అభ్యర్థించారు. తిరిగి రాత్రి 7 గంటల సమయంలో వారు నివాసానికి చేరుకున్నారు. అయితే మనోజ్ దంపతులను ఇంట్లోకి రానివ్వకుండా మోహన్‌బాబు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొని గేట్లు మూసివేశారు. దాంతో ఆగ్రహానికి గురైన మనోజ్.. గేట్లు బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. ఇంట్లో తన పిల్లలు ఉన్నారని, వారి కోసం వచ్చానని చెప్పినా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో కాసేపు కారులో వేచి చూసిన మనోజ్.. గేట్లను బద్దలు కొట్టుకొని ఇంట్లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. లోపలికి వెళ్లిన మనోజ్‌ను సెక్యూరిటీ సిబ్బందితోపాటు మోహన్‌బాబు అడ్డుకున్నారు. అనంతరం మనోజ్ చిరిగిన చొక్కాతో బయటకు వచ్చారు.

మీడియాపై మోహన్‌బాబు దాడి..

మోహన్‌బాబు నివాసం వద్ద గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న పహాడీషరీఫ్ పోలీసులు సుమారు 50 మంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో ఇంట్లోంచి గేటు వద్దకు చేరుకున్న మోహన్‌బాబు.. అక్కడ జరుగుతున్న పరిణామాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిదులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. లోగోలను లాక్కొని కోపంతో ఊగిపోతూ విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామంతో ఒకరిద్దరు కెమెరామెన్‌లు కిందపడ్డారు. దాడిలో ఓ ప్రతినిధికి తల భాగంలో ఫ్రాక్చర్ అయినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా.. అక్కడ ఉన్న పోలీసులు మోహన్‌బాబును అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తాను 70 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్‌ను అని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరిన మోహన్‌బాబు.. వారి ఎదుటే మీడియాపై దాడి చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాడి ఘటనను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ), టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేశాయి. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. మరోవైపు అయ్యప్ప మాల ధారణలో ఉన్న మీడియా ప్రతినిధిని మోహన్‌బాబు కొట్టడంపై అయ్యప్ప భక్తులు మండిపడినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. మోహన్‌బాబు ఇంట్లో ఉన్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మీడియాపై దాడికి నిరసనగా మోహన్‌బాబు ఇంటి ముందు ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు: మనోజ్

భార్యా పిల్లలతో ఇంటి నుంచి బయటకు వచ్చాక మనోజ్ మీడియాతో మాట్లాడారు. తన పోరాటం డబ్బు కోసమో, ఆస్తుల కోసమో కాదని, ఆత్మగౌరవం కోసమని అన్నారు. తన భార్య పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే.. ఇంటికి వచ్చి అన్ని వివరాలు తెలుసుకున్న ఎస్సై.. రక్షణ కల్పిస్తానని చెప్పి పారిపోయారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే తన మనుషులను బెదిరించి భయపెట్టి బయటకు వెళ్లగొట్టారని తెలిపారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సోమవారం రాత్రే తన ఇంట్లో జరుగుతున్న గొడవను మనోజ్ తన ట్విటర్ (ఎక్స్) ఖాతాలో వివరించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, ఉప ముఖ్యమంత్రులు, తెలంగాణ డీజీపీకి ట్యాగ్ చేశారు. ఇదిలా ఉండగా.. మూడు రోజులుగా మోహన్‌బాబు ఇంటి వద్ద ఇంత రచ్చ జరుగుతూ.. ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నా.. పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తండ్రీ కొడుకులు నెట్టుకున్నారంతే: పనిమనిషి

ఆస్తుల పంపకంతో పాటు మనోజ్ రెండో వివాహం కూడా మోహన్‌బాబు కుటుంబంలో గొడవలకు ప్రధాన కారణమనే అభిప్రాయం మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోన్న నేపథ్యంలో వారి ఇంటి పనిమనిషి కూడా అదే విషయాన్ని ప్రస్తావించింది. మోహన్‌బాబు కుటుంబంలో గొడవలకు కారణాలను ఆమె చెబుతుండగా ఓ మీడియా సంస్థ సీక్రెట్ కెమెరాతో రికార్డ్ చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అప్పటికే ఒక కుమారుడు ఉన్న మౌనికారెడ్డిని మనోజ్ వివాహం చేసుకోవడం మోహన్‌బాబుకు, విష్ణుకు నచ్చలేదని, ఆ వివాహం వల్ల వారు బాగా కలత చెందారని పనిమనిషి పేర్కొంది. ఆ పెళ్లి జరిగినప్పటి నుంచే కుటుంబంలో కలతలు మొదలయ్యాయని, దానికి కొనసాగింపుగానే సిబ్బందిని మందలించే క్రమంలో తాజా గొడవలు మొదలయ్యాయని ఆమె తెలిపింది. మోహన్‌బాబు వద్ద పని చేసే ప్రసాద్‌ను మనోజ్ ఒక దెబ్బ కొట్టారని, దాంతో మోహన్‌బాబు అడ్డుపడి మనోజ్‌ను పక్కకు నెట్టేశారని, అయినా మనోజ్ వినకపోవడంతో ఇద్దరూ నెట్టుకున్నారని పనిమనిషి చెప్పింది. ఇందులో ఎవరికీ దెబ్బలు తగల్లేదని పేర్కొంది. అయితే ఈ వీడియో వైరల్ కావడంతో పనిమనిషి ఆందోళనకు గురై, ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

మనోజ్.. నా గుండెలపై తన్నావ్: మోహన్‌బాబు

తన చిన్న కుమారుడు మనోజ్‌ను తాను ఎంతో గారాబంగా పెంచానని, ఇప్పుడు అతడే తన గుండెలపై తన్నాడని మోహన్‌బాబు అన్నారు. ఈ మేరకు మనోజ్‌ను ఉద్దేశించి ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మోహన్‌బాబు మాట్లాడుతూ, "మనోజ్.. నిన్ను అల్లారు ముద్దుగా పెంచాను. నీ చదువు కోసం చాలా ఖర్చుచేశాను. నీ భార్య మాటలు విని నా గుండెలపై తన్నావ్. నా మనసు ఆవేదనతో కుంగిపోతుందిరా. నువ్వు ఏది అడిగితే అది ఇచ్చాను. నీకు అన్ని ఇచ్చినా నాకు అపకీర్తి తెచ్చి పెట్టావు. తాగుడుకు అలవాటుపడి చెడు మార్గంలో వెళ్తున్నావ్. కొన్ని కారణాల వల్ల ఇద్దరం ఘర్షణ పడ్డాం. ప్రతి ఇంట్లోనూ గొడవలు ఉంటాయి. ఇంట్లో ఉన్న అందరినీ ఎందుకు కొడుతున్నావ్? బతుకుదెరువు కోసం వచ్చిన పనివాళ్లను కొట్టడం మహాపాపం. నీ దాడిలో కొందరికి గాయాలయ్యాయి. అయినా కాపాడాను. విద్యాసంస్థల్లో ప్రతిది లీగల్‌గా ఉంది. నువ్వు అక్కడే చదువుకున్నావు. కుల మతాలకు తావులేకుండా మనం విద్యను అందిస్తున్నాం. మన దగ్గర చదువుకున్న వారు ఎంతో గొప్ప వారు అయ్యారు. అన్నతో పాటు వినయ్‌ని కొట్టడానికి వచ్చావ్. నీ అన్నను చంపుతానని అన్నావు. నువ్వు నీ భార్య బిహేవ్ చేసే విధానం నీచం. ఎవరు తప్పు చేస్తున్నారనేది భగవంతుడు చూస్తున్నాడురా. అందరికీ మాట్లాడుకునేందుకు ఎంత అవకాశం ఇచ్చాం. నువ్వు ఎందుకిలా చేస్తున్నావ్? నా ఇంట్లో అడుగుపెట్టడానికి నీకు అధికారం లేదు. ఇది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రోడ్డుకెక్కి నా పరువు తీశావు. ఆస్తులు ముగ్గురికి సమానంగా రాయాలా..? వద్దా..? అనేది నా ఇష్టం. పిల్లలకు ఇస్తానా. దాన ధర్మాలు చేస్తానా అనేది నా ఇష్టం. మా నాన్నలు నాకు ఆస్తులు ఇవ్వలేదు. అయినా నేను సంపాదించుకున్నా. మనోజ్ నన్ను కొట్టలేదు. మేం ఇద్దరం ఘర్షణ పడ్డాం. నా ఇంట్లోకి నువ్వే అక్రమంగా చొరబడ్డావు. నా మనుషులను కొట్టావు. నాకు రక్షణ కావాలని పోలీసులను కోరాను. నీ కూతురును వచ్చి తీసుకెళ్లు. నా దగ్గర వదిలిపెట్టినా ఇబ్బంది లేదు. జరిగిన సంఘటనతో మీ అమ్మ ఆసుపత్రిలో చేరింది. పోలీసుల సమక్షంలోనే నీ బిడ్డను నీకు అప్పగిస్తా" అని తన ఆడియోలో మోహన్‌బాబు అన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

శకుంతలక్కయ్య వచ్చింది!



వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడడంతో ప్రమోషన్స్ జోరు పెంచారు. ఇటీవల టీజర్ విడుదల చేయగా, తాజాగా స్నేహ గుప్తా పాల్గొన్న 'శకుంతలక్కయ్య' పాటను రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను ఉమా నేహ పాడారు. సునీల్ కాశ్యప్ స్వర పరిచారు, రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కథానాయికలు. 'క', 'పొలిమేర 2', 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయం సాధించిన వంశీ నందిపాటి 'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.



ఐఏఎస్ ఆఫీసర్ సాహసాలు

రామ్‌చరణ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. రోజురోజుకీ అంచనాలు పెంచుకుంటున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది జనవరి పదిన విడుదల కానుంది.తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఐఏఎస్ ఆఫీసర్‌గా రామ్‌చరణ్ నటిస్తున్నారు. సినిమాలో హై రేంజ్ యాక్షన్ సీన్లు, పొలిటికల్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని దర్శకుడు చెబుతున్నారు. ఈ నెల 21న అమెరికా డల్లాస్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహించ నున్నారు. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, అంజలి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. దిల్ రాజు, శిరీష్ నిర్మాతలు.



షూటింగ్‌లో వీరమల్లు

పవన్‌కల్యాణ్ హీరోగా భారీ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరిహర వీరమల్లు' చిత్రం పార్ట్ వన్ షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. మంగళవారం పవన్‌కల్యాణ్ కు దర్శకుడు జ్యోతికృష్ణ సన్నివేశాన్ని వివరిస్తున్న స్టిల్‌ను విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఏమీ ఇవ్వలేదు కానీ ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ మాత్రం ఈ సినిమా ప్రోగ్రెస్‌ను వివరిస్తూ రెండు మూడు రోజుల వర్క్ మినహా ఫస్ట్ పార్ట్ షూటింగ్ పూర్తయింది. మరో వారం పది రోజుల్లో ఒక పాట విడుదల చేస్తారు. కచ్చితంగా వచ్చే ఏడాది మార్చి 28న సినిమా విడుదలవుతుంది' అని చెప్పింది. రాజమండ్రిలో ఒక షాప్ ఓపెనింగ్‌కు వెళ్లిన నిధి అందించిన సమాచారం ఇది. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకర రావుఈ సినిమాను నిర్మిస్తున్నారు.

హనుమంతుడిగా నటిస్తున్నా



సన్నీ డియోల్

రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని దర్శకుడు నితీశ్ తివారీ రూపొందిస్తున్నారు. 'రాముడి పాత్ర పోషించాలనే నా కల ఈ సినిమాతో నెరవేరుతోంది. భారతీయ సంస్కృతీ సంప్రదాయలను, కుటుంబ విలువలను, అన్నదమ్ముల అనుబంధాన్ని చెప్పిన మహా కావ్యం రామాయణం. దాని ఆధారంగా రూపొందుతున్న చిత్రంలో నేనూ ఉన్నందుకు ఆనందంగా ఉంది. ఫస్ట్ పార్ట్‌కి సంబంధించి నా వర్క్ పూర్తయింది. త్వరలో రెండో పార్ట్ షూటింగ్ మొదలవుతుంది' అని చెప్పారు రణబీర్. ఈ సినిమాలో తను హనుమంతుడి పాత్ర పోషిస్తున్నట్లు సన్నీ డియోల్ ఎట్టకేలకు చెప్పారు. తను ఆ పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరిగినా పెదవి విప్పని సన్నీ తొలిసారిగా 'రామాయణ' చిత్రం గురించి మాట్లాడుతూ 'ఈ సినిమాలో స్పెషల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది.. అవి చాలా సహజంగా ఉండేలా దర్శకుడు నితీశ్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'రామాయణ' గొప్ప సినిమా అవుతుందని నా నమ్మకం' అన్నారు. ఈ చిత్రం తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027లో విడుదలవుతాయి.

చిరంజీవి ఓకే చేసిన కథ



కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించారు. మూవీ ఈనెల 27న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మట్లాడుతూ 'ప్రొడ్యూసర్ బసవరాజు లహరిధర్ వాళ్ల నాన్నగారు శ్రీనివాస్, మెగాస్టార్ చిరంజీవి మంచి మిత్రులు. నేను కథను శ్రీనివాస్ గారికి చెప్పినప్పుడు ఆయన చిరంజీవికి చెబుతాం ఆయన ఒపీనియన్ తీసుకుందాం అన్నారు. కథ విని చిరంజీవి ఓకే చేశారు. అలా మెగాస్టార్ అంగీకారంతో 'డ్రింకర్ సాయి' మొదలైంది' అని తెలిపారు. నిర్మాత ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా రావడానికి టీమ్‌లోని ప్రతి ఒక్కరూ శ్రమించారు. చంద్రబోస్ ఆరు పాటలను అద్భుతంగా రాశారు. అవన్నీ కథను మరింత ఎలివేట్ చేసేలా ఉంటాయి' అని తెలిపారు. మరో నిర్మాత లహరిధర్ మాట్లాడుతూ 'థియేటర్స్‌లో మా మూవీని ఎంజాయ్ చేస్తారు. ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్‌కు బాగా నచ్చేలా ఉంటుంది' అని అన్నారు.

మంచి సినిమాకు హద్దులు ఉండవు



జోజు జార్జ్ మలయాళంలో నటించి దర్శకత్వం వహించిన 'పని' సినిమా ఈనెల 13న తెలుగులో విడుదలవుతోంది. అభినయ కీలక పాత్రలో నటించారు. ఆమ్ వర్ద్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం లాంచ్ చేశారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులోకి తీసుకొస్తుండటం సంతోషంగా ఉంది. ఇది మంచి థ్రిల్లర్ సినిమా. 2 గంటల పాటు ఆడియన్స్‌ను ఎంగేజ్ చేస్తుంది' అని అన్నారు. హీరో, దర్శకుడు జోజు జార్జ్ మాట్లాడుతూ 'నా దృష్టిలో మంచి సినిమాకు భాషా హద్దులు లేవు. ఏ భాషలో ప్రేక్షకులైనా ఆదరిస్తారు. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది' అని అన్నారు. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది అని అభియన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్, నటుడు జెమినీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం నవ్వించేలా



అంకిత్ కొయ్య, శ్రియా కొంతం హీరో హీరోయిన్లుగా శ్రీ హర్ష దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '14 రోజులు గర్ల్ ఫ్రెండ్ ఇంట్లో'. శ్రీ సత్య ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై సత్య నిర్మించారు. సోమవారం నిర్వహించిన ఈవెంట్‌లో ఈ సినిమా నుంచి స్నీక్ పీక్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సత్య మాట్లాడుతూ 'సెన్సిబుల్ మెసెజ్ ఇస్తూనే ఆద్యంతం నవ్వించేలా మూవీ ఉంటుంది. కొత్త కంటెంట్‌ను టాలీవుడ్‌కి ఇవ్వాలని అనుకున్నాం. అందుకే ఈ చిత్రాన్ని నిర్మించాం' అని అన్నారు. హీరో అంకిత్ కొయ్య మాట్లాడుతూ 'కొన్ని సార్లు ఎదుటి వాళ్ల కష్టాలను, బాధల్ని చూసి మనం నవ్వుకుంటాం. హర్ష అనే క్యారెక్టర్ తన గర్ల్ ఫ్రెండ్ ఇంటికి వెళ్లిన తరవాత డోర్ లాక్ అవ్వడం, ఇంట్లోనే పద్నాలుగు రోజులు ఉండటంతో ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి అనేది ఈ సినిమా కథ' అని తెలిపారు.

కొత్తవాళ్లతో హిట్ కొడతాం



సదన్, ప్రియాంక ప్రసాద్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పి.ఎల్.వి ఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మించారు. సాయికుమార్ ముఖ్య పాత్రలో నటించారు. సినిమా ఈనెల 13న రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి, హీరో సోహెల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 'ప్రణయగోదారి టీమ్ అంతా కలసి ఓ చిన్నారి గుండెకు శస్త్ర చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని అందించింది. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో 'సోహెల్ మాట్లాడుతూ 'ఈ మూవీ టీమ్‌లో అందరూ కొత్త వాళ్లే. అయినా హిట్ కొడతాం. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చాలా నేచురల్‌గా చేశారు. వారి కష్టాన్ని గుర్తించి థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి' అని అన్నారు. దర్శకనిర్మాత విఘ్నేశ్ మాట్లాడుతూ 'సినిమా తీయడం, రిలీజ్ చేయడం అంటే మామూలు విషయం కాదు. ఆ సంగతి నాకు ఇప్పుడు అర్థమైంది. డిస్ట్రిబ్యూటర్లు కూడా ముందుకు వచ్చి థియేటర్లు ఇస్తామన్నారు. అందరూ వచ్చి చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.



విరాట్ కోహ్లీ బ్యాక్‌ఫుట్ ప్రాక్టీస్

మూడో టెస్టుకు టీమిండియా సన్నాహకాలు

చెమటోడ్చారు..

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్లు అత్యంత పేలవ ప్రదర్శనతో విమర్శల పాలయ్యారు. ఆ టెస్టులో పది వికెట్ల తేడాతో ఓటమిపాలవడం అభిమానులను నిరుత్సాహపరిచింది. దీంతో 14 నుంచి జరిగే గాబా టెస్టు కోసం మనోళ్లు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడుస్తున్నారు. మరోవైపు ఆసీస్ జట్టు బ్రిస్బేన్‌కు పయనం కాగా.. భారత జట్టు మాత్రం అడిలైడ్‌లోనే సాధన చేస్తోంది. 'మూడో టెస్టు కోసం ఇక్కడి నుంచే మా సన్నాహకాలను సాగించబోతున్నాం' అంటూ బీసీసీఐ తమ ఆటగాళ్ల సాధన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అడిలైడ్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమయ్యారు. ఆరో నెంబర్‌లో బరిలోకి దిగిన రోహిత్ 3,6 పరుగులు మాత్రమే చేశాడు. తన చివరి 12 ఇన్నింగ్స్‌ల్లో కేవలం ఒక అర్ధసెంచరీ మాత్రమే సాధించడం గమనార్హం. ఇక విరాట్ సంగతికొస్తే.. 16 నెలల సెంచరీ కరవును పెర్త్ టెస్టులో తీర్చుకుని అందరినీ అలరించాడు. కానీ ఆ వెంటనే రెండో టెస్టులో తన బలహీనతను బయటపెట్టుకుని 7,11 స్కోర్లకే వెనుదిరిగాడు. ఈ నేపథ్యంలో తను ఈసారి ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కోవాలనే ఉద్దేశంతో మంగళవారం సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేశాడు. ఎక్కువగా బ్యాక్‌ఫుట్ షాట్లను ఆడాడు. అలాగే రాహుల్ డిఫెన్స్, పంత్ పికప్ షాట్లను ప్రాక్టీస్ చేశారు. బుధవారం జట్టు బ్రిస్బేన్‌కు పయనం కానుంది.



బుమ్రా గాయపడ్డాడా?

భారత స్టార్ పేసర్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఆసీస్ మాజీ పేసర్ ఫ్లెమింగ్ సందేహం వ్యక్తం చేశాడు. రెండో టెస్టు రెండో రోజున కండరాలు పట్టేయడంతో ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. అయితే ఇది కేవలం తిమ్మిరి ప్రభావమేనని బౌలింగ్ కోచ్ మోర్కెల్ తెలిపాడు. కానీ ఆ తర్వాత అతడి బౌలింగ్‌లో వేగం తగ్గిందని ఫ్లెమింగ్ గుర్తుచేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో తను కేవలం 130కి.మీ వేగంతోనే బంతులు విసిరాడని, ఇదే అతడి ఫిట్‌నెస్‌పై అనుమానాలను రేకెత్తిస్తోందని అన్నాడు. దీనికి తగ్గట్టుగా మ్యాచ్ ముగిశాక భారత్ ప్రాక్టీస్ సెషన్లలోనూ బుమ్రా పాల్గొనలేదు.

విరాట్ టెక్నిక్ మారింది: హర్భజన్

గాబా బౌన్సీ పిచ్‌పై పరుగులు సాధించేందుకు విరాట్ ఎలా ప్రాక్టీస్ చేస్తున్నాడో మాజీ స్పిన్నర్ హర్భజన్ వివరించాడు. 'విరాట్‌తో నేను చాలా క్రికెట్ ఆడాను. తను ఎక్కువగా ఫ్రంట్ ఫుట్ ఆడతాడు. కానీ బ్రిస్బేన్‌లోని బౌన్స్‌ను ఎదుర్కోవాలంటే ఇలాంటి శైలి సరిపోదు. ఇక్కడ మెరుగ్గా ఆడిన పాంటింగ్, స్టీవ్ వా, లాంగర్, హేడెన్‌లంతా బ్యాక్‌ఫుట్ ప్లేయర్లు. అందుకే విరాట్ కూడా ఇదే రీతిన ఆడేందుకు ప్రాక్టీస్ చేస్తున్నాడు. మంగళవారం నాటి నెట్స్‌లో తను చాలా బంతులను బ్యాట్‌ఫుట్‌లో ఆడడాన్ని గమనించాను. అయితే ఫుల్లర్ బంతులను ఆడేందుకు ముందుకు వెళ్తున్నాడు. వాటిని వదిలేయడమే మంచిది. గాబా పిచ్ ఎలా స్పందిస్తుందో అతనికి బాగా తెలుసు. అందుకే బ్యాక్‌ఫుట్ గేమ్‌ను ప్రాక్టీస్ చేస్తున్నాడు. కచ్చితంగా తను పుంజుకుంటాడనే నమ్మకం ఉంది' అని భజ్జీ తెలిపాడు.

సిరాజ్‌కన్నా షమి బెస్ట్: ఆండీ రాబర్ట్స్

భారత క్రికెట్‌లో మహ్మద్ షమినే ఉత్తమ బౌలర్ అని విండీస్ దిగ్గజం ఆండీ రాబర్ట్స్ అభిప్రాయపడ్డాడు. 'బుమ్రా ఎక్కువ వికెట్లు తీస్తుండవచ్చుగాక. కానీ షమిలో నిలకడ ఉంది. బంతితో చక్కటి సీమ్, స్వింగ్‌ను రాబట్టగలడు. సిరాజ్ అయితే షమీ దరిదాపుల్లోకి కూడా రాలేడు' అని రాబర్ట్స్ తేల్చాడు. 1970-80వ దశకంలో ప్రత్యర్థి జట్లను వణికించిన విండీస్ పేసర్లలో రాబర్ట్స్ కూడా ఒకడు.

వారెవా.. నితీశ్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో అరంగేట్రం చేసిన టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకొంటున్నాడు. ఆసీస్‌తో జరిగిన రెండు టెస్టుల్లోనూ 41, 38 నాటౌట్, 42, 42 పరుగులు సాధించిన నితీశ్.. ఆస్ట్రేలియా గడ్డపై ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక (7) సిక్సర్లు బాదిన భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. ఈ క్రమంలో సెహ్వాగ్ (2003-04 సిరీస్‌లో 6 సిక్సర్లు) రికార్డును అధిగమించాడు. ప్యాట్ కమిన్స్, బొలాండ్ బౌలింగ్‌లో రెండేసి సిక్స్‌లు కొట్టిన నితీశ్.. మార్ష్, స్టార్క్ బౌలింగ్‌లో చెరొకటి సాధించాడు. పెర్త్ టెస్టులో లబుషేన్ బౌలింగ్‌లో మరో సిక్స్ కొట్టిన నితీశ్ మొత్తంగా ఈ టూర్‌లో ఏడు సిక్స్‌లు ఖాతాలో వేసుకొన్నాడు. అయితే, ఓవరాల్‌గా చూస్తే ఆస్ట్రేలియా గడ్డపై రిషబ్ పంత్ (9 టెస్టుల్లో 10 సిక్సర్లు), రోహిత్ శర్మ (8 టెస్టుల్లో 10), సెహ్వాగ్ (8) అత్యధిక సిక్స్‌లు కొట్టిన భారత ఆటగాళ్లలో టాప్-3లో ఉన్నారు. ముఖ్యంగా లోయరార్డర్‌లో పవర్‌ఫుల్ షాట్లతో నితీశ్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. బంతి ఎంత వేగంగా వస్తే.. అంత వేగంగా షాట్లు ఆడడం అతడి ప్రత్యేకత. ఇక, నితీశ్ లాఫ్టెడ్ షాట్లు 60 కిమీ వేగంతో వెళ్లడం కామెంటేటర్లనే ఆశ్చర్యపర్చింది. అంతేకాకుండా ఆడిన తొలి నాలుగు ఇన్నింగ్స్‌లో మూడుసార్లు అత్యధిక స్కోర్లు చేసిన బ్యాటర్‌గా.. సునీల్ గవాస్కర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. 1971లో అరంగేట్రం చేసిన గవాస్కర్ తొలి టెస్టులో 65, 67 పరుగులు.. రెండో టెస్టులో 116, 64 నాటౌట్ స్కోరు చేశాడు. 53 ఏళ్ల తర్వాత నితీశ్ అంతటి ఘనతను అందుకొన్నాడు.

ఫిక్సర్ ధిల్లాన్‌పై ఆరేళ్ల నిషేధం

దుబాయ్: అబుధాబి టీ10 లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు యత్నించిన మాజీ అసిస్టెంట్ కోచ్ సన్నీ ధిల్లాన్‌పై ఐసీసీ కఠిన చర్యలు తీసుకొంది. ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అవినీతి నిరోధక కోడ్‌ను ఉల్లంఘించిన అతడిపై ఆరేళ్ల నిషేధం విధించింది. ధిల్లాన్‌పై ఆరోపణలు వెలుగుచూడడంతో గతేడాది తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి నిషేధం అమలు కానుంది. 2021 అబుధాబి లీగ్‌లో ధిల్లాన్‌తో సహా ఎనిమిది మంది మ్యాచ్ ఫలితాన్ని మార్చే విధంగా ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలు నమోదయ్యాయి. విచారించిన ట్రిబ్యునల్ సన్నీపై నిషేధం విధిస్తూ తీర్పునిచ్చింది.

ఈ గేమ్ కీలకం

లిరెన్‌తో గుకేశ్ 13వ రౌండ్ నేడు

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్



సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ మధ్య ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఉత్కంఠగా సాగుతోంది. టోర్నీ ఆరంభం నుంచి ఇరువురు ఆటగాళ్లు ప్రతి గేమ్‌లో ఆచితూచిగా పావులు కదుపుతున్నారు. ఇప్పటి దాకా 12 రౌండ్లు జరగగా.. ఇద్దరు చెరో రెండు గేమ్‌లు గెలిచారు. మిగతా గేమ్‌లను డ్రాగా ముగించారు. ఫలితంగా ఇరువురు ఆరేసి పాయింట్లతో సమంగా ఉన్నారు. 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు టోర్నీ విజేతగా నిలుస్తారు. ఈ క్రమంలో మరో రెండు రౌండ్లే మిగిలున్న నేపథ్యంలో.. బుధవారం జరిగే 13వ రౌండ్ ఇద్దరికీ అత్యంత కీలకం కానుంది. ఇందులో గెలిచిన వాళ్లు టైటిల్‌కు మరింత చేరువవుతారు. ఈ గేమ్ నెగ్గితే.. ఆఖరి రౌండ్‌ను కనీసం డ్రా చేసుకున్నా ట్రోఫీ సొంతమవుతుంది. మరి.. ఇద్దరిలో ఎవరిది పైచేయి కానుందో ఈ రౌండ్‌తో దాదాపు తేలనుంది.

లక్ష టిక్కెట్లు హాంఫట్..

బాక్సింగ్ డే టెస్టు

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ఆస్ట్రేలియా ప్రేక్షకులు బ్రహ్మారథం పడుతున్నారు. ఐదు టెస్టుల ఈ సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి రెండు మ్యాచుల్లో ఇరుజట్లూ చెరోటి నెగ్గి 1-1తో సమవుజ్జీలుగా ఉన్న విషయం తెలిసిందే. అత్యంత ఆసక్తికరంగా సాగుతున్న ఈ సిరీస్‌లోని నాలుగోదైన బాక్సింగ్ డే టెస్టు కోసం ఇప్పటి నుంచే అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 26 నుంచి మెల్‌బోర్న్ మైదానంలో జరిగే ఈ టెస్టుకు తొలిరోజు టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయినట్టు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. లక్ష సీట్ల సామర్థ్యం కలిగిన ఎంసీజీలో మ్యాచ్‌కు ఇంకా 15 రోజుల సమయం ఉండగానే ఇంత డిమాండ్ ఏర్పడడం విశేషం. అడిలైడ్ ఓవల్‌లో జరిగిన రెండో టెస్టును రికార్డు స్థాయిలో లక్షా 35 వేల మంది తిలకించారు. భారత్‌తో జరిగిన టెస్టుల్లో ఇదే అత్యధిక ప్రేక్షకుల హాజరుగా ఉంది.

గుజరాత్‌పై జైపూర్ గెలుపు

పుణె: అర్జున్ దేశ్వాల్ విజృంభించడంతో.. ప్లేఆఫ్స్ రేసులో జైపూర్ పింక్ పాంథర్స్ కీలక విజయాన్ని నమోదు చేసింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 42-29తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. కెప్టెన్ దేశ్వాల్ 13 పాయింట్లతో అదరగొట్టగా.. డిఫెండర్ అంకుశ్ 5 టాకిలింగ్స్ చేశాడు. ఫస్టాఫ్‌లో రెండుసార్లు గుజరాత్‌ను ఆవుట్ చేసిన జైపూర్ 27-16తో పైచేయిగా నిలిచింది. సెకండాఫ్‌లో జెయింట్స్ దీటుగానే పోరాడినా.. ఆధిక్యాన్ని కాపాడుకొన్న జైపూర్ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 44-29తో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. విశ్వాస్ 14 రైడ్ పాయింట్లు సాధించగా.. డిఫెండర్లు నితీశ్, ఫజల్ చెరో 7 టాకిలింగ్స్ చేయడం విశేషం. బుల్స్ తరఫున పర్‌దీప్ నర్వాల్ 14 పాయింట్లు స్కోరు చేసినా ప్రయోజనం లేకపోయింది.

టీఓఏ పీఠం ఎవరిదో?

ఎన్నికల ఫలితాల వెల్లడి నేడే

హైదరాబాద్: తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికల కౌంటింగ్‌కు లైన్ క్లియరైంది. ఎన్నికల కౌంటింగ్ బుధవారం జరగనుంది. దీంతో టీఓఏ పీఠం ఎవరికి దక్కనుందో తేలిపోనుంది. ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్ వేదికగా గతనెల 21న టీఓఏ కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం పోలింగ్ నిర్వహించారు. అధ్యక్ష పదవికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ పోటీపడ్డారు. మొత్తం 65 మందికి గాను 59 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే, ఎన్నికల ఫలితాలపై సిటీ సివిల్ కోర్టు స్టే ఇవ్వడంతో ఆరోజు కౌంటింగ్‌ను నిర్వహించకుండా బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. తాజాగా కోర్టు స్టే ఎత్తివేయడంతో కౌంటింగ్‌కు మార్గం సుగమమైంది. దీంతో బుధవారం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.

ఓదార్పయినా దక్కేనా..!

- ఆస్ట్రేలియాతో భారత మహిళల మూడో వన్డే నేడు
- ఉ. 9.50 నుంచి

పెర్త్: ఘోర ప్రదర్శనతో ఈపాటికే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను చేజార్చుకొన్న భారత మహిళల జట్టు.. క్లీన్‌స్వీప్‌ను తప్పించుకోవాలనుకొంటోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగే మూడో, ఆఖరి వన్డేలో ఓదార్పు విజయం దక్కించుకోవాలని భారత్ భావిస్తోంది. గత రెండు మ్యాచుల్లోనూ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఏ రంగంలోనూ హర్మన్‌ప్రీత్ సేన ఆకట్టుకోలేకపోయింది. షఫాలీ స్థానంలో ఓపెనర్‌గా రిచా పర్వాలేదనిపిస్తున్నా.. సీనియర్లు స్మృతి మంధాన, హర్మన్ సహా మిగతా బ్యాటర్ల వైఫల్యం జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. బౌలింగ్ విభాగం తేలిపోతుండగా.. ఫీల్డింగ్ వైఫల్యాలు మరింత నిరాశకు గురి చేస్తున్నాయి. మరోవైపు తహిల మెక్‌గ్రాత్ సారథ్యంలోని ఆసీస్ ఫుల్ జోష్‌లో ఉంది. ఓపెనర్ జార్జియా వోల్ పరుగుల వరద పారిస్తూ భారీ స్కోర్లకు బాటలు వేస్తోంది.

టాప్ 500 స్టాక్స్‌కు అదే రోజు సెటిల్‌మెంట్

కొత్త ఏడాది నుంచి దశల వారీగా అమలు: సెబీ

న్యూఢిల్లీ: ఈ డిసెంబరు 31 నాటికి మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాప్-500 కంపెనీల స్టాక్స్‌కు ఐచ్ఛిక టీ+0 (షేరు కొనుగోలు చేసిన రోజే) సెటిల్‌మెంట్‌ను దశల వారీగా అందుబాటులోకి తెస్తున్నట్లు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తెలిపింది. స్టాక్ బ్రోకర్లందరూ టీ+0 సెటిల్‌మెంట్‌లో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, టీ+1, టీ+0 సెటిల్‌మెంట్‌కు మధ్య వ్యత్యాస బ్రోకరేజీని నియంత్రణ పరిధికి లోబడి వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. సెబీ 2024 మార్చిలో 25 స్టాక్స్‌కు ఈ ఐచ్ఛిక టీ+0 సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తాజా ప్రతిపాదిత జాబితాలో తొలుత దిగువ 100 కంపెనీలకు జనవరిలో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుందని సెబీ తన సర్క్యులర్‌లో వెల్లడించింది. ఆ తర్వాత నెలకు 100 కంపెనీల చొప్పున జాబితాను 500కు చేర్చనున్నట్లు సెబీ స్పష్టం చేసింది.

డిజిలాకర్ ద్వారా అన్‌క్లెయిమ్డ్ ఆస్తుల సెటిల్‌మెంట్: సెక్యూరిటీస్ మార్కెట్లో అన్‌క్లెయిమ్డ్ ఆసెట్స్‌ను తగ్గించడంతో పాటు ఆ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన డిజిటల్ డాక్యుమెంట్ స్టోరేజ్ ప్లాట్‌ఫామ్ డిజిలాకర్‌ను ఉపయోగించుకోవాలని సెబీ ప్రతిపాదించింది. డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్లు డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్ స్టేట్‌మెంట్లను డిజిలాకర్ ద్వారానూ అందుబాటులోకి తేవాలని మంగళవారం విడుదల చేసిన చర్చాపత్రంలో సెబీ ప్రతిపాదించింది. అలాగే, కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీలు (కేఆర్ఏ) మదుపరి మరణ సమాచారాన్ని డిజిలాకర్‌తో పంచుకోవాలని కూడా సూచించింది. డిజిలాకర్ వినియోగదారులు తమ ఖాతాలకు ఎవరినైనా నామినీగా ఎంచుకోవచ్చు. దురదృష్టవశాత్తూ వినియోగదారు మరణిస్తే, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) లేదా కేఆర్ఏ వ్యవస్థలోని మరణ నమోదు సమాచారం ఆధారంగా డిజిలాకర్ అకౌంట్ స్టేటస్‌ను అప్‌డేట్ చేస్తుంది. అలాగే, మరణించిన వినియోగదారు నామినీకి డిజిలాకర్ ఆటోమెటిక్‌గా ఎస్ఎంఎస్ లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందిస్తుంది. తద్వారా నామినీ మరణించిన వ్యక్తి డిజిటల్ రికార్డులను యాక్సెస్ చేయగలగడంతోపాటు ఆస్తుల బదిలీకి క్లెయిమ్ ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుంటుంది. ఈ ప్రతిపాదనలపై డిసెంబరు 31లో అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా సెబీ ప్రజలను కోరింది.

వృద్ధి క్షీణతకు రెపో కారణం కాదు

ఆర్‌బీఐ గవర్నర్ దాస్



ముంబై: వృద్ధి రేటు మందగించడానికి అధిక రెపో రేట్లే కారణం కాదని, అందుకు ఎన్నో అంశాలు దోహదపడ్డాయని పదవీ విరమణ చేస్తున్న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. మంగళవారం ఆర్‌బీఐ గవర్నర్ హోదాలో చివరి పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వృద్ధి, ద్రవ్యోల్బణం మధ్య సమతూకం సాధించడమే ఆర్‌బీఐ ముందున్న ప్రధాన సవాల్ అని చెప్పారు. దాస్ నాయకత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వరుసగా 11 విడతలుగా రెపో రేట్లను యథాతథంగా కొనసాగిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ చర్యలను ఆయన సమర్థించుకుంటూ ప్రస్తుత పరిస్థితులతో పాటు భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని అందుకనుగుణంగా ద్రవ్య విధానాన్ని ఉంచేందుకే కృషి చేశామన్నారు. రేట్ల నిర్ణయం అనే అంశాన్ని అంత తేలికైన విషయంగా తీసుకోవద్దని ఆయన కోరారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని బలంగా నిలిచిందంటూ కొత్తగా ఆర్‌బీఐ పగ్గాలు చేపడుతున్న సంజయ్ మల్హోత్రా కూడా విస్తృత అనుభవం గల వ్యక్తి అని, ఆర్‌బీఐని సమర్థవంతంగా ముందుకు నడుపుతారని తెలిపారు.

ఆర్థిక శాఖతో సత్సంబంధాలే...

తన హయాంలో ఆర్థిక మంత్రిత్వ శాఖతో సంబంధాలు అత్యుత్తమంగా ఉన్నాయని దాస్ అన్నారు. అనేక అంశాలపై కేంద్ర బ్యాంక్, ఆర్థిక శాఖ మధ్య భిన్న వైఖరులుంటాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉందని ఆయన చెప్పారు. అయితే తన హయాంలో అలాంటి సమస్యలేవైనా ఉంటే అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోగలిగామన్నారు. తమ మధ్య చక్కని సహకారం, సమన్వయం నెలకొన్నాయని ఆయన తెలిపారు. 2018లో తాను అధికార బాధ్యతలు చేపట్టిన సమయంలో వృత్తిపరమైన విలువలు, విశ్వసనీయత, స్వయంప్రతిపత్తి పరిరక్షించేందుకు తాను కృషి చేస్తానని చెప్పానని, అందుకు అనుగుణంగానే పని చేశానని శక్తికాంత దాస్ అన్నారు.

అన్నీ అర్థం చేసుకుని పని చేస్తా.. సంజయ్ మల్హోత్రా

తాను ఆర్థిక వ్యవస్థకు చెందిన అన్ని కోణాలను పూర్తిగా అర్థం చేసుకుని ఆర్థిక వ్యవస్థకు ఏది మంచిదైతే అలా పని చేస్తానని ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా చెప్పారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్న మల్హోత్రా ఆర్థిక శాఖ కార్యాలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతానికి దూసుకుపోయి వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి క్షీణించిన కీలక దశలో ఆయన ఆర్‌బీఐ గవర్నర్‌గా పగ్గాలు చేపడుతున్నారు.

ఫిబ్రవరి పాలసీలో రేట్ల తగ్గింపు

కొత్త ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా హయాంలో ఫిబ్రవరిలో జరగనున్న ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తొలి విడత రేట్ల కోత ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మల్హోత్రా సారథ్యంలో ఆర్‌బీఐ సరళతర ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలే ఎక్కువ ఉన్నట్టు జపాన్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ నోమురా అంటోంది. కొత్త గవర్నర్ ఆర్థిక శాఖ నుంచి రావడం వల్ల రాబోయే కాలంలో రేట్ల నిర్ణయంలో ప్రభుత్వం శక్తివంతమైన పాత్ర పోషించవచ్చని స్విస్ బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ అంచనా వేస్తోంది. రాబోయే ఎంపీసీ సమావేశం నాటికి ద్రవ్యోల్బణ ఒత్తిడులు తగ్గి రెపో రేటు ఒక మోస్తరుగా తగ్గించే అవకాశాలే ఎక్కువ ఉన్నట్టు ఎస్ అండ్ పీ అంటోంది. ఏది ఏమైనా ఫిబ్రవరి నుంచి ప్రారంభించి రెపో రేటును 0.75 శాతం వరకు తగ్గించే ఆస్కారం ఉన్నట్టు పలువురు అంచనా వేస్తున్నారు.

క్విక్ కామర్స్‌లోకి అమెజాన్

తేజ్ పేరుతో బెంగళూరులో పైలట్ సేవలు ప్రారంభం



భారత్‌లో శరవేగంగా వృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ విభాగంలోకి అమెజాన్ సైతం ప్రవేశించింది. బ్లింకిట్, జెప్టో వంటి క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌కు పోటీగా అమెజాన్ తేజ్ పేరుతో 15 నిమిషాల్లోపు నిత్యావసరాల డెలివరీ సేవలను తొలుత పైలట్ ప్రాజెక్ట్‌గా బెంగళూరులో ప్రారంభించింది. మంగళవారం ఢిల్లీలో ప్రారంభించిన సంభవ్ కార్యక్రమంలో అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం 610 కోట్ల డాలర్ల (రూ.51,758 కోట్లు) స్థాయిలో ఉన్న క్విక్ కామర్స్ మార్కెట్ 2030 నాటికి 4,000 కోట్ల డాలర్లకు (రూ.3.40 లక్షల కోట్లు) చేరుకోవచ్చని దాతుమ్ ఇంటెలిజెన్స్ తాజా నివేదిక అంచనా వేసింది. క్విక్ కామర్స్ విభాగంలో 46 శాతం మార్కెట్ వాటాతో బ్లింకిట్ అగ్రస్థానంలో ఉండగా.. జెప్టో 29 శాతం మార్కెట్ వాటాను చేజిక్కించుకుంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 25 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

2030 నాటికి 8,000 కోట్ల డాలర్ల ఎగుమతులు: భారత్ నుంచి తమ ఎగుమతులను 2030 నాటికి 8,000 కోట్ల డాలర్లకు పెంచాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నామని అమెజాన్ ఇండియా పునరుద్ఘాటించింది. 2025 నాటికల్లా 2,000 కోట్ల డాలర్లకు చేర్చాలనుకుంటున్నట్లు అమెజాన్ ఎమర్జింగ్ మార్కెట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ వెల్లడించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,600 ▲	72,050 ▲	1,04,000 ▲
విజయవాడ	80,000 ▲	74,000 ▲	96,000 ▲
విశాఖపట్నం	75,650 ▲	72,050 ▲	1,04,000 ▲
ప్రొద్దుటూరు	78,800 ▲	72,970 ▲	94,500 ▲
ముంబై	77,175 ▲	76,692 ▲	92,810 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	628
చిత్తూరు	633	విశాఖపట్నం	618
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	77
కర్నూలు	90	నెల్లూరు	77
విశాఖపట్నం	96	అనంతపురం	77
గోదావరి	104		

ఉద్యోగ మార్కెట్‌కు మళ్లీ మంచి రోజులు

- వచ్చే మార్చి వరకు నియామకాల జోరు
- మ్యాన్‌పవర్ గ్రూప్

న్యూఢిల్లీ: ఉద్యోగ మార్కెట్ గాడిన పడుతోంది. వచ్చే జనవరి-మార్చి త్రైమాసికంలో దేశంలో నియామకాలకు ఢోకా ఉండదని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా వెల్లడించింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రంగాలకు చెందిన 3,000 కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి కంపెనీ మ్యాన్‌పవర్ గ్రూప్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ పేరుతో ఒక సర్వేను రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 53% కంపెనీల ప్రతినిధులు వచ్చే మార్చిలోగా తమ ఉద్యోగుల సంఖ్య మరింత పెరుగుతాయని చెప్పారు. 13% మంది తగ్గుతాయని, 31% మంది ఎదుగూ బొదుగు ఉండదని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తామని చెప్పిన కంపెనీలను తీసివేసినా నికరంగా 40% కంపెనీలు నియామకాలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. గత ఏడాది ఇదే కాలం లేదా ఈ ఏడాది డిసెంబరుతో పోల్చినా ఇది మూడు శాతం ఎక్కువ. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుపై కంపెనీలకు పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఎండీ సందీప్ గులాటీ చెప్పారు. ఈ నియామకాల్లో ఐటీ రంగం వాటా 50% వరకు ఉండనుండగా ఆర్థిక, రియల్ ఎస్టేట్ వాటా 44%, కన్స్యూమర్ గూడ్స్, సేవల రంగం వాటా 40% వరకు ఉంటుందని సర్వే వెల్లడించింది.

మెహుల్ చోక్సీ ఆస్తుల వేలం..

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను మోసం చేసిన కేసులో పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీ డొంక కదులుతోంది. అతడికి చెందిన సుమారు రూ.2,500 కోట్ల విలువైన ఆస్తులను వేలం వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమవుతోంది. అక్రమాస్తుల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ ఈ ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకుంది. ఈ ఆస్తులను వేలం వేసి ఆ మొత్తాన్ని పీఎన్‌బీ, ఐసీఐసీఐ బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలని ఈడీ కోర్టు ఇప్పటికే ఆదేశించింది. తప్పుడు పత్రాలతో పీఎన్‌బీని రూ.13,000 కోట్ల మేర ముంచిన కేసులో మెహుల్ చోక్సీ నిందితుడు.

హైదరాబాద్ సీఓఈలో ఐసీఏఐ రీసెర్చ్ హబ్

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి బిజినెస్): చార్టర్డ్ అకౌంటెంట్ల అత్యున్నత స్థాయి సంస్థ ఐసీఏఐ హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో (సీఓఈ) అత్యాధునిక పరిశోధనా హబ్‌ను ఏర్పాటు చేసింది. సీఓఈకి కొత్త డీన్, డైరెక్టర్‌గా నుపుర్ పవన్ బంగ్‌ను నియమించింది. కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్లు, ఆర్థిక అక్షరాస్యత, విధానాల రూపకల్పనలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర, వ్యాపార సౌలభ్యంతో కూడిన సత్పరిపాలన వంటి భిన్న అంశాలపై ఈ కేంద్రలోతైన అధ్యయనం చేపడుతుందని ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

ప్రస్తుతం ఐసీఏఐకి హైదరాబాద్, జైపూర్‌లలో రెండు సీఓఈలు పని చేస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో కోల్‌కతాలో మూడో సీఓఈని ప్రారంభించనున్నారు. పరిశోధన, ఇన్నోవేషన్, నైపుణ్యాల నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు మూడేళ్లలో దేశవ్యాప్తంగా మరో ఎనిమిది సీఓఈలను ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో పని చేసే ఐసీఏఐకి ప్రస్తుతం 4 లక్షల మంది సభ్యులు, 9.85 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు.

లాభనష్టాల మధ్య ఊగిసలాట

ముంబై: ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. మంగళవారం సెన్సెక్స్ 1.59 పాయింట్ల స్వల్ప లాభంతో 81,510.05 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 8.95 పాయింట్లు కోల్పోయి 24,510.05 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 రాణించగా.. బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.33 శాతం వరకు లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో రియల్టీ 1.22 శాతం ఎగబాకగా.. ఐటీ, ఫోకస్డ్ ఐటీ ఇండెక్స్‌లు అర శాతానికి పైగా పెరిగాయి.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక పైసా పెరిగి 84.85 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 0.36 శాతం తగ్గి 71.88 డాలర్లకు దిగివచ్చింది.
- ఢిల్లీ మార్కెట్లో 24 గ్రాముల బంగారం 10 గ్రాముల ధర రూ.820 పెరిగి రూ.79,780కి చేరుకుంది. కిలో వెండి రూ.1,000 పెరుగుదలతో రూ.94,850కి ఎగబాకింది.

కాంటినమ్ గ్రీన్ ఎనర్జీ రూ.3,650 కోట్ల ఐపీఓ

విద్యుత్ ఉత్పత్తి సంస్థ కాంటినమ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.3,650 కోట్లు సమీకరించాలనుకుంటోంది. కాగా, డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్ ఐపీఓ ప్రతిపాదనకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ 3.2 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.

పోలీసుల దురుసు ప్రవర్తనపై
మహిళా కమిషన్ ఆగ్రహం!

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడంపై మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సంబంధిత పోలీసు అధికారులు వివరణ ఇవ్వాలని కమిషన్ ఛైర్‌పర్సన్ శారదా నేరెళ్ల మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మహిళా కార్మికుల గౌరవాన్ని కాపాడటం మహిళా కమిషన్‌కు అత్యంత ప్రాధాన్యమైన అంశమని ఆమె ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలోనూ
'తెలంగాణ తల్లి'ని ప్రతిష్ఠించాలి : చనగాని

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం 'తెలంగాణ భవన్'లో కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆ పార్టీ నేతలకు టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ సూచించారు. తెలంగాణ అస్తిత్వం ఉట్టిపడేలా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహానికి రాష్ట్రంలోని అన్ని వర్గాల మద్దతు లభిస్తోందని అన్నారు. తెలంగాణ తల్లిపైన కేటీఆర్, కవిత అహంకార పూరిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. కాగా, పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. తెలంగాణ తల్లిని అధికారికంగా ఎందుకు ప్రకటించలేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశ్నించారు. తెలంగాణ తల్లిపై విమర్శలు చేస్తే జనం కేటీఆర్, హరీశ్‌రావుల నాలుక కోస్తారంటూ ఆయన విలేకరులతో అన్నారు.

వేములవాడ ప్రజలకు
కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భారత పౌరుడు కాదని తెలిసినా చెన్నమనేని రమేష్‌కు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చిన కేసీఆర్.. వేములవాడ నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిజాన్ని దాచి చెన్నమనేని.. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడంటూ కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో చెన్నమనేనితోపాటు ఆయనకు అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు శిక్ష పడాలన్నారు. ప్రతి విషయంపై స్పందించే కేటీఆర్.. చెన్నమనేని అంశంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. దేశ పౌరుడు కాని వ్యక్తిని చట్ట సభ సభ్యుడిని చేసిన చరిత్ర ప్రపంచంలోనే ఎక్కడా లేదన్నారు.

ప్రతిపక్షనేత పదవిని హరీశ్‌కు ఇవ్వండి: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై గౌరవం ఉంటే మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లేని పక్షంలో ప్రధాన ప్రతిపక్షనేత పదవిని.. బీఆర్ఎస్‌లోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సభ్యుల్లో ఒకరికో లేదంటే హరీశ్‌రావుకో అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తామన్న బీఆర్ఎస్ నేతలకు ప్రజలు ఆ విగ్రహాన్ని తాకే అవకాశం కూడా ఇవ్వరని స్పష్టం చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి
ఉపయోగం లేని ప్రభుత్వాలు: ఎంపీ అర్వింద్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి ఉపయోగం లేని(యూజ్‌లెస్) ప్రభుత్వాలు అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ఆదాయం పెంచే పని ఒక్కటైనా చేశారా? అని నిలదీశారు. పంచాయతీలు అంతో ఇంతో నడుస్తున్నాయంటే కేంద్రం నిధులతోనే అని పేర్కొన్నారు. సీఆర్ఎఫ్(సెంట్రల్ రోడ్ ఫండ్), గ్రామీణ సడక్ యోజన నిధుల కోసం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏడు లక్షల కోట్ల అప్పులు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ. 14 లక్షల కోట్లు చేయబోతుందని ఆరోపించారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను సీఎం రేవంత్ నాశనం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విగ్రహాల రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ తల్లి విగ్రహంపై మీరు అధికారంలో ఉన్నప్పుడు జీవో జారీ చేశారా? అని కేటీఆర్‌ను నిలదీశారు. సీఎంగా ఉన్నప్పుడు సచివాలయానికి రాని కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్షనేతగా అసెంబ్లీకి రావడం లేదు.. మరెందుకు ఆ పదవి? అని అర్వింద్ నిలదీశారు. కేటీఆర్, కవిత, హరీష్, సంతోష్‌రావు.. కేసీఆర్‌తో నాలుగు స్తంభాల ఆట ఆటాడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్ అసెంబ్లీలో తనకు మైక్ ఇవ్వడం లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. కల్వకుంట్ల కుటుంబం కథ ముగిసిపోయింది.. కవిత, కేటీఆర్‌లకు కుక్క కూడా ఓటేయదు.. అని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో మత కలహాలు చెలరేగే ప్రమాదం

- టీయూడబ్ల్యూజే రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

బర్కత్‌పుర, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత కలహాలు చెలరేగే ప్రమాదముందని ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. పద్ధతి మార్చుకుంటేనే రాష్ట్రంలో రేవంత్ సర్కారుకు మనుగడ సాధ్యమవుతుందని హితవు పలికారు. కేసీఆర్ విధానాలు నచ్చకనే ప్రజలు మార్పు కోరుకున్నారని కాంగ్రెస్ ఏడాది పాలనలో పరిస్థితులు కొంత మెరుగుపడినా మరింత మార్పును ఆశిస్తున్నారని తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన 'ప్రజల ఆకాంక్షలు- ఏడాది ప్రభుత్వ పాలన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలన కొంతమేర బాగానే ఉన్నప్పటికీ లగచర్ల, జైనూర్ సంఘటనలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల మరణాలను పూర్తిగా నిరోధించాలని సూచించారు. రాష్ట్రంలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారి ఆధిపత్యమే కొనసాగుతోందని, ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారితోనే మైండ్ గేమ్ ఆడుతున్నారని ప్రజాగాయకుడు మాష్టార్జీ ఆరోపించారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా వర్గీకరణ ఆగదు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొన్ని స్వార్థ శక్తులు ఎస్సీ వర్గీకరణను ఆపాలని చూస్తున్నాయని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఇది ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణను అమలు చేసినందునే అప్పట్లో ఐదేళ్లలో మాదిగలకు అనేక ఉద్యోగావకాశాలు వచ్చాయని గుర్తుచేశారు. కొందరు కోర్టును ఆశ్రయించడంతో కథ మళ్లీ మొదటికొచ్చిందని, చివరికి సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా ఇచ్చిందని చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ వర్గీకరణకు అనుకూలమని ప్రకటించడంతోనే తాము బీజేపీకి మద్దతు తెలిపామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. తాము ఏ పార్టీ జెండా మోయడం లేదని, వర్గీకరణకు అనుకూలంగా ఉన్న పార్టీలకు మద్దతు తెలుపుతూ వచ్చామని చెప్పారు. బీసీ నేత ఆర్.కృష్ణయ్య పదేళ్లలో నాలుగు పార్టీలు మారారని, ఆయనకు ఆయా పార్టీలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని, మాదిగ బిడ్డల భవిష్యత్తు, వర్గీకరణే లక్ష్యంగా ముందుకు పోతున్నానని చెప్పారు.

ఆ పోలీసులను డిస్మిస్ చేయాలి

హామీలు నెరవేర్చమన్న ఆశాలపై దుశ్శాసన పర్వమా?.. రేవంత్ రెడ్డీ... ఆడబిడ్డలపై నీకున్న గౌరవం ఇదేనా?

- పోలీసులు ఏం చేసినా నడుస్తుందనుకుంటే కుదరదు
- కేటీఆర్ ధ్వజం



ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్ రహీంబీని పరామర్శిస్తున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలని కూడా చూడకుండా ఆశా వర్కర్ల చీరలు లాగి, దాడికి పాల్పడిన ఏసీపీ, సీఐ, ఇతర పోలీసులను డిస్మిస్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'పోలీసులు అధికారం ఉంది.. ఖాకీ యూనిఫాం ఉంది.. ఏం చేసినా నడుస్తదనుకుంటే కుదరదు. వదిలిపెట్టబోమ'ని హెచ్చరించారు. సోమవారం ఆందోళన, అరెస్టుల సందర్భంగా గాయపడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్ రహీంబీను మంగళవారం కేటీఆర్ మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్ రెడ్డి తదితరులతో కలిసి పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ ఒక తల్లిగా సోనియాగాంధీకి రాష్ట్రంలోని తల్లుల బాధలు తెలుస్తాయని, ఆమె జన్మదినం సందర్భంగా తమ సమస్యలు చెప్పుకుంటే పరిష్కారమవుతాయని ఆశా వర్కర్లు భావించారని చెప్పారు. ఆరు నెలల్లో వేతనం రూ.18 వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత, బీమా కల్పిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిందని గుర్తు చేసేందుకు వస్తే ప్రభుత్వం జరిపిన దమనకాండ చూసి ప్రతి ఒక్కరి గుండె కదిలిపోయిందన్నారు. ఆందోళన సందర్భంగా ఆశా వర్కర్లను మామూలుగా కొట్టలేదని, మహిళలని చూడకుండా మగ పోలీసులు ఈడ్చుకెళ్లారన్నారు. భౌతికదాడులు చేయడంతో పాటు దుశ్శాసన పర్వానికి తెర తీశారన్నారు. ఓ ఏసీపీ దారుణంగా ఆడబిడ్డ చీర లాగాడన్నారు. 'రేవంత్ రెడ్డీ.. ఇదేనా మహిళల పట్ల నీకున్న గౌరవం. హోం మంత్రిగా నువ్వే ఉన్నావు. నీ ఆధ్వర్యంలో పనిచేసే పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించి 24 గంటలైనా ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఎందుకు చలించలేదు?' అని ప్రశ్నించారు. పోలీసుల దమనకాండకు వీడియో, ఫొటో ఆధారాలు ఉన్నాయని, ఇక్కడి మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్.. అవసరమైతే జాతీయ కమీషన్ల వద్దకు వెళ్తామని చెప్పారు. అసెంబ్లీ ప్రారంభమయ్యే 16లోపు సీఎం స్పందించాలని, లేకుంటే అసెంబ్లీలో కూడా వదిలిపెట్టబోమన్నారు. రహీంబీని పరామర్శించడానికి కేటీఆర్‌తో పాటు ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, మరికొందరు ఆస్పత్రిలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆశా వర్కర్లు బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, బీఆర్ఎస్ నేతలు వస్తుండడంతో పోలీసులు ఆస్పత్రి వద్ద భారీగా మోహరించారు. కొందరినే ఆస్పత్రిలోకి అనుమతించగా మిగతా వాళ్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

ఏకపక్షంగా స్పీకర్ వ్యవహార శైలి

రేవంత్‌ది పాలన కాదు.. పీడన: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ్యులకు బుధవారం నుంచి నిర్వహించే అవగాహనా తరగతులను బహిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ ఏకపక్ష వ్యవహార శైలికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలను ఎత్తిచూపేందుకు నిరసన తెలిపితే అసెంబ్లీ ప్రారంభానికి ముందే తమ హక్కులకు భంగం కలిగేలా స్పీకర్ వ్యవహరించారని పేర్కొన్నారు. మొదటి రోజే తమ పార్టీ ఎమ్మెల్యేలను లోపలికి రాకుండా అరెస్టు చేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ తమ పార్టీ సభ్యుల గొంతునొక్కేలా వ్యవహరించారన్నారు. రేవంత్ రెడ్డిది పాలన కాదు పీడన అని కేటీఆర్ విమర్శించారు.

'ఆశా'ల పోరు పట్టదా?

- ఉద్యోగ భద్రతపై ఏళ్లుగా ఉద్యమం
- విపక్షంలో ఉన్నప్పుడు సమస్యలన్నీ పరిష్కరిస్తామని రేవంత్, సీతక్క భరోసా
- ఆలోచించి న్యాయం చేయాలని విన్నపం

నల్లగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కనీస వేతనాలు, ఉద్యోగభద్రత కోసం పదిహేడేళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "బారెడు పని చారెడు జీతం"గా జీవనం సాగిస్తున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విపక్షంలో ఉన్నప్పుడు అండగా ఉంటామని చెబుతూ అధికారంలోకి రాగానే ముఖం చాటేస్తున్నారని వాపోతున్నారు. జాబ్‌చార్ట్ లేకుండా నిర్దిష్ట పనే కాకుండా సర్వేలకు, ఇతర పనులకు వినియోగిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ పొందిన మంత్రసానుల ఉద్యోగం కాస్తా హెల్త్‌వర్కర్‌గా మారిపోయిందని, తమకు అదే స్థాయిలో వేతనాలు, సదుపాయాలు కల్పించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 2నుంచి 15వ తేదీ వరకు లెప్రసీ సర్వే నిర్వహించాలని సూచించిన అధికారులు, పారితోషికంపై తమకు ఉత్తర్వులు రాలేదని చెప్పడంతో ఈ సర్వేను నిరాకరించారు. పైగా తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట పట్టారు. మంగళవారం చలో హైదరాబాద్ నిర్వహించడం, అదికాస్తా ఉద్రిక్తంగా మారడంతో ఆశావర్కర్ల సమస్యలు మరోసారి తెరమీదకు వచ్చాయి. దశలవారీగా ఉద్యమిస్తామని, సమస్యలు పరిష్కరించేంతవరకు పోరుబాటు వీడేదిలేదని ఆశావర్కర్లు చెబుతున్నారు. కనీస వేతనం సహా మొత్తం 19 డిమాండ్లతో ఆశావర్కర్లు ఆందోళన బాట పట్టారు. అసెంబ్లీ ఎన్నిల సమయంలో ఆశావర్కర్ల వేతనాలు పెంచుతామని, ఉద్యోగభద్రత కల్పిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా పెట్టి హామీ ఇచ్చిందని ఆశా వర్కర్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు నిర్మల్ నుంచి హైదరాబాద్ వరకు బస్సుయాత్ర నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ఆందోళనలు చేస్తామని, ఆ తర్వాత కూడా స్పందించకపోతే బడ్జెట్ సమావేశాల సందర్భంలో సమ్మెకు వెళతామని హెచ్చరిస్తున్నారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు.



లక్ష్మీనారాయణ, మహేశ్వరి, వెంకటమ్మ

న్యాయబద్ధమైన డిమాండ్‌లు పరిష్కరిచాలి

ఆశావర్కర్లు చేస్తున్న శ్రమను గుర్తించి కనీస వేతనాలివ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక మునుపు ఉద్యమించిన రోజుల్లో అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని రేవంత్ రెడ్డి, సీతక్క హామీ ఇచ్చారు. . గతంలో సమ్మెకు దిగిన సమయంలో కమిషనర్ ఇచ్చిన హామీలైన రూ.50లక్షల బీమా సదుపాయం, దహన సంస్కారాలకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని తక్షణం అమలు చేయాలి. మా న్యాయమైన డిమాండ్‌లు సాధించేవరకు దశలవారీగా ఉద్యమిస్తూనే ఉంటాం. ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచించి మా సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తున్నాం.

- లక్ష్మీనారాయణ, ఆశావర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు, డి.మహేశ్వరి, జిల్లా అధ్యక్షురాలు, వెంకటమ్మ, జిల్లా కార్యదర్శి.

ప్రజల భావోద్వేగాన్ని
జీవోలతో మార్చలేరు

బతుకమ్మను తెలంగాణ తల్లికి దూరం చేశారు

ఆశా వర్కర్ల హామీలను అమలు చేయాలి: కవిత



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్థిత్వాన్ని, వారసత్వాన్ని, ప్రజల భావోద్వేగాలను కేవలం ఒక జీవోతో మార్చలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తల్లి రూపాన్ని మార్చి ఇక్కడి వారసత్వాన్ని రూపుమాపాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ భవన్ ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పాలతోభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న జొన్నలు, మక్కలు ఈ ప్రాంతానికి ప్రతీక అని సీఎం అంటున్నారని, కానీ అవి ఇతర రాష్ట్రాల్లో పండవా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో మనకు మాత్రమే ప్రత్యేక పండుగ అయిన బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మను మాయం చేసి ఆస్థానంలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును పెట్టడం చాలా దారుణమన్నారు. తొమ్మిది మంది కవులు, కళాకారులను సన్మానించడమే కాకుండా ఇంటిస్థలం, రూ.కోటి ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషమే అయితే.. అందులో మహిళలకు స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. కాగా.. ఆశా వర్కర్లపై దాష్టీకం తగదని, వారికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని కోరిన ఆశా వర్కర్లపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తించిందని, పోలీసుల దమనకాండను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మహిళానేతలు తుల ఉమ, సుమిత్ర పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు వాడలేని భాషలో మహిళలను నిందించారని, ఇష్టం వచ్చినట్టు కొట్టారనిన్నారు.

విగ్రహాల మీద ఉన్న ధ్యాస
విద్యార్థుల మీద లేదా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఏం చేస్తోంది? ఈ ఘటనలపై స్పందించరా? అని నిలదీశారు. పది రోజులు కాకముందే వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఆహారం వికటించి 15 మంది ఆసుపత్రిపాలైన దుస్థితి. సీఎం సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలాఉంటే, రాష్ట్రవ్యాప్తంగా ఇంకెంత దారుణ పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి తీరువల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలుకావాలి, ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి.. ఇటువంటి ఘటనలపై తక్షణం చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మునిసిపాలిటీల్లో
మళ్లీ గ్రేడింగ్ విధానం!

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. జనాభా, ఆదాయం బట్టి మునిసిపాలిటీలకు గ్రేడింగ్‌లు ఉండేవి. దాని ప్రకారమే అధికారులను నియమించేవారు. 2019లో కొత్త మునిసిపల్ చట్టాన్ని తీసుకొచ్చే క్రమంలో గత ప్రభుత్వం గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసింది. దీంతో గ్రేడ్-3, గ్రేడ్-2 మునిసిపాలిటీల్లో పనిచేసే అర్హత ఉన్న అధికారులు పెద్ద మునిసిపాలిటీల్లో సైతం పోస్టింగులు తెచ్చుకునే అవకాశం ఏర్పడింది. రాజకీయ పలుకుబడి ఉన్న అధికారులు తమకు నచ్చినచోటుకు కమిషనర్‌గా వెళుతున్నారు. ఏ పైరవీ లేకపోతే చిన్న మునిసిపాలిటీలకు కూడా ఐఏఎస్‌ల నియామకాలు జరుగుతున్నాయి. దీంతో కీలకమైన నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతోందని గుర్తించిన పురపాలక శాఖ ఉన్నతాధికారులు మళ్లీ గ్రేడింగ్ విధానం అమలు చేయాలని ఆలోచిస్తున్నారు. ఆదాయం రూ.60 లక్షల్లోపు ఉంటే గ్రేడ్-3గా, రూ.కోటిపైన ఉంటే గ్రేడ్-2, రూ.2 నుంచి రూ.4 కోట్ల మధ్య ఉంటే గ్రేడ్-1, రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల మధ్య ఉంటే స్పెషల్ గ్రేడ్, రూ.6 నుంచి రూ.8 కోట్ల మధ్య ఉంటే సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా పరిగణిస్తారు. రూ.8 కోట్లపైన ఆదాయం, 3 లక్షల జనాభా ఉంటే కార్పొరేషన్‌గా ప్రకటిస్తారు. గతంలో మునిసిపాలిటీల స్థాయిని బట్టి అధికారుల నియామకం చేపట్టేవారు. గ్రేడింగ్ విధానం రద్దు చేసిన తర్వాత నిజాంపేట్, అమీన్‌పూర్, తెల్లాపూర్ వంటి కీలకమైన ప్రాంతాలకు గ్రేడింగ్‌తో నిమిత్తం లేకుండా పైరవీలు చేసుకున్న అధికారులకు పోస్టింగులు ఇస్తున్నారనే విమర్శలున్నాయి. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనుల మీద ప్రభావం పడుతుందనే చర్చ అధికారుల మధ్య జరుగుతోంది. నిజాంపేటలాంటి ప్రాంతాల్లో గతంలో ఐఏఎస్ స్థాయి అధికారి పనిచేసేవారు. ఇప్పుడు నాన్-ఐఏఎస్ అధికారులు, గ్రేడ్-2, గ్రేడ్-3 మునిసిపాలిటీల్లో పనిచేసే అర్హత ఉన్న వారిని నియమిస్తున్నారనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో 13 నగరపాలక సంస్థలు, 129 మునిసిపాలిటీలున్నాయి. పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో మునిసిపాలిటీలకు మళ్లీ గ్రేడింగ్‌ల విధానం అమలుచేయాలనే చర్చ తెరమీదకు వచ్చింది. త్వరలోనే ఈ అంశంపై పురపాలక శాఖ సంచాలకులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

రైతు భరోసాకు నిధుల భరోసా!

- భూమి తనఖా పెట్టి 10 వేల కోట్ల అప్పు
- రుణమివ్వడానికి ఐసీఐసీఐ బ్యాంకు సిద్ధం
- ఆడిటింగ్ పూర్తి చేసి, ఆర్‌బీఐని ఒప్పించే పనిలో టీజీఐఐసీ
- ఈ నెలాఖరుకల్లా దక్కనున్న రుణం



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు అవసరమైన నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి భరోసా లభించినట్లు తెలిసింది. సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రకటించిన ఈ పథకానికి నిధుల సమీకరణ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. రైతు భరోసాకు దాదాపు రూ.10 వేల కోట్లు అవసరమవుతాయి. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) అధీనంలోని భూమిని తనఖా పెట్టి రూ.10 వేల కోట్ల రుణం తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చినట్లు ప్రభుత్వ ఉన్నత వర్గాలు తెలిపాయి. 9.6 శాతం వార్షిక వడ్డీతో రూ.10 వేల కోట్ల అప్పు ఇవ్వడానికి ఐసీఐసీఐ బ్యాంకు ముందుకొచ్చినట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా రుణం అందవచ్చని, జనవరి నుంచి అమలు చేసే రైతు భరోసా పథకానికి ఆ సొమ్మును వినియోగించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కోకాపేట, రాయదర్గంలో టీజీఐఐసీ అధీనంలోని 400 ఎకరాల భూముల్ని తనఖా పెట్టి అప్పు తీసుకోవాలని భావించిన సర్కారు.. ఆ మేరకు భారత రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ)కు ప్రతిపాదనలు పంపింది. కానీ, వాటిని 'ఆడిటింగ్' కొర్రీతో ఆర్‌బీఐ వెనక్కి పంపింది. ఓవైపు ఈ ఆడిటింగ్‌ను కొలిక్కి తెచ్చే చర్యలు చేపడుతూనే మరోవైపు బ్యాంకుల కన్సార్షియంతో టీజీఐఐసీ సంప్రదింపులు జరిపింది. ఆడిటింగ్‌ను పూర్తి చేసి, ఆర్‌బీఐని ఒప్పించే పనిలో పడింది. దీంతో ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఈ నెలాఖరులోగా రూ.10 వేల కోట్ల రుణం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వంలోని కీలక వ్యక్తి ఒకరు చెప్పారు. మరోవైపు ఈ నెలాఖరు నాటికి 7000 మందికిపైగా ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. వారికి చెల్లించే ప్రయోజనాల కోసం రూ.2000 కోట్లకు పైగా నిధులు కావాలి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రూ.10 వేల కోట్ల రుణం తీసుకునేందుకు చర్యలు చేపడుతోంది.

బంగ్లా హిందువులకు
భారత్ అండగా నిలవాలి

- మానవ హక్కుల సంస్థ సమావేశంలో వక్తల విజ్ఞాపన
- అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ తీరును ఎండగట్టాలి
- బంగ్లాపై ప్రధాని మోదీ ఒత్తిడి తేవాలి: పద్మనాభయ్య



కే పద్మనాభయ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను భారత్‌తో పాటు ఇతర దేశాలు తీవ్రంగా నిరసించాలని పలువురు విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్, ఆర్మీ అధికారులు, సామాజికవేత్తలు అన్నారు. బంగ్లాదేశ్ ప్రభుత్వ వైఖరిని అంతర్జాతీయ స్థాయిలో భారత్ ఎండగట్టాలని సూచించారు. బంగ్లా హిందువులకు మద్దతుగా ప్రపంచంలోని హిందువులంతా గళమెత్తాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల సంస్థ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట ప్లాజా హోటల్‌లో 'బంగ్లాదేశ్‌లో హిందువుల హక్కుల హననం' అంశంపై సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కే పద్మనాభయ్య మాట్లాడుతూ ఇస్లామిక్ దేశాల్లో మైనారిటీ మతస్థుల హక్కులు ప్రశ్నార్థకం కావడంపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలని ఆకాంక్షించారు. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం తదితర వేదికల ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రధాని మోదీ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. బంగ్లాదేశ్ పరిణామాలపై తమ నిజ నిర్ధారణ కార్యాచరణ నివేదికలోని కీలకాంశాలను సుప్రీంకోర్టు న్యాయవాది మోనికా అరోరా సభలో ప్రస్తావించారు. 'బంగ్లాదేశ్‌లో హిందువులు బతికిబట్టకట్టాలంటే మతమైనా మారాలి, లేకుంటే జిజియా (ఇస్లాం రాజ్యంలో ముస్లిమేతరులు చెల్లించే పన్ను) కట్టాలని జమాత్-ఇ-ఇస్లామీ కార్యకర్తలు, బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ నాయకులు హింసిస్తున్నారు. హిందువుల ఇళ్లను కొల్లగొడుతున్నారు. ఆస్పత్రులు, ఆలయాలను ధ్వంసం చేస్తున్నార'ని ఉదాహరణలతో వివరించారు. ఇంతటి హింసకు బాధ్యుడైన బంగ్లాదేశ్ అధినేత మహమ్మద్ యూనస్ నుంచి ప్రపంచ నోబెల్ శాంతి బహుమతిని వెనక్కితీసుకోవాలని అరోరా డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై ఇంతటి మారణహోమం జరుగుతుంటే కమ్యూనిస్టులు కనీసం నోరెత్తకపోవడం దౌర్భాగ్యమని సీనియర్ జర్నలిస్టు ఎంవీఆర్ శాస్త్రి విమర్శించారు. బంగ్లాదేశ్, పాక్ తదితర దేశాల్లోని హిందువులు భారత పౌరసత్వం సత్వరం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ మాజీ సీఎస్ ఎస్‌కే జోషి సూచించారు. బంగ్లాదేశ్ కవ్వింపు చర్యల వెనుక చైనా ప్రమేయం ఉండడానికి అవకాశం లేకపోదని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి ఛైర్మన్ త్రిపురనేని హనుమాన్ చౌదరి, సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్, ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఐపీఎస్‌లు రాజీవ్ త్రివేది, కేఆర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ఉచ్చులో పడవద్దు

- ఆశా వర్కర్లు సంయమనంతో ఉండాలి
- వారిని అడ్డం పెట్టుకుని రాజకీయం తగదు: దామోదర



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): "ఆశా వర్కర్లను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం ప్రతిపక్ష పార్టీ నాయకులకు తగదు. ఈ విధానం వారి దిగజారుడు తనానికి నిదర్శనం. ఆశా వర్కర్లు సంయమనంతో వ్యవహరించాలి. రాజకీయ ప్రేరేపిత ధర్నా, నిరసనలు తెలిపే వారి ఉచ్చులో పడవద్దు. ప్రజా ప్రభుత్వం ఆశా వర్కర్ల స్వేచ్ఛను గౌరవిస్తుంది" అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని చాటేలా విజయోత్సవాలు జరుగుతుంటే తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆశా వర్కర్లను రెచ్చగొట్టారని మంగళవారం మంత్రి ఒక ప్రకటనలో ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో ఆశా వర్కర్ల వేతనాల పెంపుపై ఎన్నిసార్లు నిరసనలు, ధర్నాలు చేసినా పట్టించుకోనివాళ్లు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ఇది వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. శాంతి భద్రతలకు భంగం కలిగితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని ఆయన హెచ్చరించారు. కాగా ఆశా వర్కర్ల నిరసనలో సొమ్మసిల్లి పడిపోయిన ఆశా వర్కర్ రహీంబీకు ఉస్మానియా ఆస్పత్రిలో మెరుగైన చికిత్సను అందించాల్సిందిగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను మంత్రి ఆదేశించారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డి



సాంబశివారెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసుతోపాటు ఇతర కీలక కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న సాంబశివారెడ్డిని ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా ఉన్న జి.వైజయంతి ఇటీవలే పదవి విరమణ పొందారు. ఈ క్రమంలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సాంబశివారెడ్డికి డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రవి గుప్తా ఆదేశాలు జారీచేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి న్యాయవిద్య పూర్తిచేసి 2001లో ఖమ్మంలో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 2015లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులై హుజూరాబాద్‌లో విధులు నిర్వహించారు. 2018లో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై హైదరాబాద్ వచ్చారు. 2022లో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. తనను డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా నియమించినందుకు సాంబశివారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై సీఎం నజర్!

» అధిష్ఠానాన్ని కలిసేందుకు నేడు ఢిల్లీకి



కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ విస్తరణపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీ వెళుతున్న సీఎం.. కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశమై మంత్రివర్గ విస్తరణపై చర్చించనున్నారని సమాచారం. తన సమీప బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా మంగళవారం జైపూర్ వెళ్లిన సీఎం రేవంత్.. ఆ వేడుకల అనంతరం ఢిల్లీ వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో అందుబాటులో ఉన్న ఏఐసీసీ అగ్రనేతలను కలిసి వివిధ అంశాలపై చర్చిస్తారని, ఈ క్రమంలో మంత్రివర్గ విస్తరణపై కూడా చర్చించే అవకాశముందని పేర్కొన్నాయి.

ఉద్యాన పంటల రైతులకు రోజూ రూ.కోటి పరికరాల పంపిణీ

» రాబోయే 90 రోజుల పాటు ఈ కార్యక్రమ నిర్వహణ

» అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే 90 రోజులపాటు రాష్ట్రంలో ప్రతి రోజూ రూ. కోటి విలువైన డ్రిప్ పరికరాలను ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార శాఖ విభాగాధిపతులతో మంగళవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ పథకాల అమలు వేగవంతం చేసి ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామ్ ఆయిల్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో భాగంగా ఈ యాసంగి నుంచి అమలు చేయనున్న యాంత్రీకరణ పథకాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని, నాణ్యమైనపనిముట్లు, యంత్రాలను రాయితీపై సరఫరా చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 8,59,272.68 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు మంత్రికి వివరించారు. పత్తి చేల నుంచి రెండో విడత, మూడో విడతలో వచ్చే పత్తిలో నాణ్యత ఉంటుందని, ఇంకా రెండు నెలల పాటు వీటి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.31 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగిందని అధికారులు వివరించారు. మార్చి నాటికి లక్ష ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

'ప్రజావాణి'కి ఏడాది.. 82,955 అర్జీలు

ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి.. పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఏడాది పూర్తయింది. 12నెలల్లో మొత్తంగా 82,955 దరఖాస్తులొచ్చాయి. 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చింది. ఆ వెంటనే ప్రగతి భవన్‌ను మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా ప్రకటించింది. మర్నాడు.. అంటే ఆ ఏడాది డిసెంబరు 8న ప్రజల నుంచి వివిధ సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించేందుకు ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి డిసెంబరు 9 వరకు మొత్తం 84 సార్లు ప్రజావాణి సదస్సులను నిర్వహించినట్లు ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారిని దివ్య దేవరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి ద్వారా 43,272 దరఖాస్తులు పరిష్కరించారు. వీటిలో ప్రభుత్వ పథకాలకు సంబంధించినవి 34,970, ఉద్యోగ సమస్యలకు సంబంధించినవి 4,713 దరఖాస్తులున్నాయి. పరిష్కార దశలో 27,215 దరఖాస్తులున్నాయి.

ఆన్‌లైన్‌లో భద్రాద్రి ముక్కోటి దర్శన టికెట్లు

భద్రాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో 31 నుంచి నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారి ఉత్తరద్వార దర్శనానికి టికెట్లను బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. భక్తులు https://bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లను బుకింగ్ చేసుకోవచ్చని భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి తెలిపారు. తెలిపారు. రూ.2వేలు, రూ.1,000, రూ.500, రూ.250 విలువ గల సెక్టార్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఉత్తరద్వార దర్శన టికెట్లను ఆన్‌లైన్‌లో కొన్న భక్తులు ఈ నెల 25 నుంచి జనవరి 10వ తేదీ తెల్లవారుజామున 5గంటల వరకు తానీషా కల్యాణ మండపం కార్యాలయంలో ఒరిజినల్ టికెట్లను పొందవచ్చునని ఈవో రమాదేవి సూచించారు. అలాగే, ఆలయంలో ప్రత్యక్షంగా స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకోవడానికి వీలు కాని భక్తులు ఆన్‌లైన్‌లో వీక్షించేలా దేవస్థానం టికెట్లను అందుబాటులోకి తెచ్చింది. ఇదే వెబ్‌సైట్ ద్వారా రూ.2వేలు, రూ.1,000 టికెట్లను బుధవారం ఉదయం 11గంటల నుంచి బుక్ చేసుకోవచ్చని రమాదేవి తెలిపారు.

పెన్షనర్ల అంత్యక్రియలకు రూ.30వేల సాయం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల అంత్యక్రియలకు సహాయాన్ని పెంచుతూ ట్రాన్స్‌కో నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా పెన్షనర్లు చనిపోతే అంత్యక్రియలకు రూ.20 వేల సహాయం అందించేవారు. ఇక ముందు రూ.30 వేలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం గతేడాది జూన్ 22వ తేదీన జారీ చేసిన జీవో నెం.65ను అన్వయం చేసుకుంటూ ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ఆయన చెప్పారు.

14న సీఎం చేతుల మీదుగా దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమరయ్య కురుమ సంఘ ఆత్మగౌరవ భవనాన్ని డిసెంబర్ 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. సభ ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షించారు.

పెద్దలకు రూ.3,250, పిల్లలకు రూ.2,600

» స్వల్పంగా పెరిగిన సాగర్- శ్రీశైలం లాంచీ ప్రయాణ ధరలు

నాగార్జునసాగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం టికెట్ రేట్లు స్వల్పంగా పెరిగాయి. ఈ వారం నుంచే తాజా ధరలు అందుబాటులోకి రానున్నాయి. ఈ వారం నుంచి పెద్దలకు రూ.3250, పిల్లలకు రూ.2600కు పెంచారు. అయితే ఇప్పటివరకు ప్రయాణికులకు శ్రీశైలంలో వసతి సౌకర్యం కల్పించలేదు, ఇప్పుడు టికెట్ ధరలోనే వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఒకవైపు ప్రయాణానికి పెద్దలకు రూ.2000, పిల్లలకు రూ.1600గా(మధ్యాహ్న భోజనం కలిపి) ధరలు నిర్ణయించారు. ఇక హైదరాబాద్ నుంచి వెళ్లే వారి కోసం ఇక్కడి నుంచి సాగర్ వరకు నాన్ ఏసీ హైటెక్ బస్సు సౌకర్యంతో పెద్దలకు రూ.5250, పిల్లలకు రూ.4200గా(మధ్యాహ్న భోజనం, శ్రీశైలంలో వసతి కలిపి) టికెట్ ధరలు నిర్ణయించారు. డిమాండ్‌ను బట్టి సోమవారం నుంచి శుక్రవారం వరకు లాంచీలు నడుపుతామని, అయితే 100 టికెట్లు బుక్ అయితే లాంచీ నడుపుతామని అధికారులు చెప్పారు. వివరాల కోసం 9848540371, 9848125720 నంబర్లను లేదా సాగర్ లాంచీ స్టేషన్ 7997951023 నంబర్లను సంప్రదించాలని పర్యాటక శాఖ అధికారులు సూచించారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన తరగతులు

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నిర్వహణ, నిబంధనలపైన శాసనసభ, శాసనమండలి సభ్యులకు అవగాహన కల్పించేందుకు బుధ, గురువారాల్లో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంసీ హెచ్ ఆర్డీలో జరిగే ఈ తరగతులను స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభిస్తారు. ఈ తరగతుల్లో రాజ్యాంగ నిపుణులు వివిధ అంశాలపై సభ్యులకు అవగాహన కల్పిస్తారు.

తినే మాంసంలో యాంటీబయాటిక్స్



(మొదటిపేజీ తరువాయి)

ఈ పరిశోధన చేయగా.. మాంసంలో యాంటీబయాటిక్స్ ఆనవాళ్లున్న జాబితాలో భారత్ 30వ స్థానంలో ఉంది. అంటే.. సగటున ప్రతి కిలో మాంసంలో 114 మిల్లీగ్రాముల మేర యాంటీబయాటిక్స్ ఆనవాళ్లున్నాయి.

మటన్‌లో ఎక్కువ

భారత్‌లో ప్రతి కిలో మటన్(గొర్రె/మేక మాంసం)లో యాంటీబయాటిక్స్ ఆనవాళ్ల 243 మిల్లీ గ్రాముల మేర ఉన్నట్లు ఈ పరిశోధన జరిపింది. ఆ తర్వాతి స్థానాల్లో పందిమాంసం(173 మిల్లీ గ్రాములు), గొడ్డుమాంసం(60 మిల్లీగ్రాములు), కోడి మాంసం/చికెన్(35 మిల్లీగ్రాములు) ఉన్నాయి. ఇలా యాంటీబయాటిక్స్ ఆనవాళ్లున్న మాంసాన్ని తిన్న మానవుల ఆరోగ్యంపై దుష్ప్రభావాలుంటాయని పరిశోధకులు హెచ్చరించారు. పశ్చిమబెంగాల్‌లోని పశు, మత్స్య విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయంలోని లైవ్‌స్టాక్ ఉత్పత్తుల విభాగం కూడా 'మాంసం ఉత్పత్తుల్లో యాంటీబయాటిక్స్ అవశేషాలు' పేరుతో ఓ పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. జాతీయ మాంసం పరిశోధన శాస్త్రవేత్తలు, వెటర్నరీ పరిశోధన సంస్థ, భారత వ్యవసాయ పరిశోధన మండలికి చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలో పాల్గొన్నారు. పశువులకు ఇచ్చే యాంటీబయాటిక్స్.. వాటిని తినే మానవుల శరీరంలోకి ప్రవేశిస్తాయని వీరు గుర్తించారు. పశువులకు యాంటీబయాటిక్స్ ఇచ్చిన 14 రోజుల వరకు వాటి మాంసాన్ని వినియోగించకూడదని సూచించారు. "మేము చికెన్‌లో సిప్రోఫ్లాక్సాసిన్, ఎన్రోఫ్లాక్సాసిన్, డాక్సీసైక్లిన్, స్ట్రెప్టోమైసిన్ లాంటి యాంటీబయాటిక్స్ అవశేషాలను చూశాం. పశువుల్లో టెట్రాసైక్లిన్ యాంటీబయాటిక్స్ అవశేషాలను గుర్తించాం" అని పరిశోధకులు వెల్లడించారు.

ఎందుకు వాడుతారు?

మనదేశంలో పాడి రైతుల్లో అవగాహనారాహిత్యంతో పశువులకు అధికంగా యాంటీబయాటిక్స్ ఇస్తుంటారని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. ఒక కోడిపిల్ల 40 రోజులకే ఎదిగి మార్కెట్‌కు రావాలంటే.. యాంటీబయాటిక్స్ ఇంజక్షన్ ఇవ్వక తప్పదని ఓ కోళ్ల ఫారం యజమాని చెప్పారు. దీని వల్ల కోడి బరువు పెరగదని, కోడిలో ఆకలి పెరిగి.. ఎక్కువగా తిని, త్వరగా లావు అవుతుందన్నారు. పైగా.. కోడి ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటుందన్నారు. ఇక చాలా చోట్ల పశువుల శాలలు అపరిశుభ్రంగా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో పశువులు తరచూ జబ్బు చేస్తుంటాయి. దాంతో.. పాడి రైతులు వాటికి యాంటీబయాటిక్స్ ఇంజక్షన్లు ఇస్తుంటారు. నిజానికి పశువుల కొట్టాలను పరిశుభ్రంగా ఉండేలా చూసి, సరిపడా వెంటిలేషన్ ఏర్పాట్లు చేస్తే.. ఈ సమస్యలను అధిగమించవచ్చని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. 2010లో వెలువడిన ఓ అధ్యయనం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న యాంటీబయాటిక్స్‌లో 70% పశువులకే వినియోగిస్తున్నారు. "పలు చోట్ల పాడిరైతులు ఎక్కువ పాల ఉత్పత్తికి పశువులకు ఆక్సిటోసిన్‌లు ఇస్తుంటారు. ఆ పాలను తాగే ఆడపిల్లలు 9-10 సంవత్సరాల వయసులోనే రజస్వల అవుతుంటారు. కోళ్లు, గొర్రెలకు కూడా ఆక్సిటోసిన్ ఇస్తుంటారు" అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ వెటర్నరీ వైద్యుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. యాంటీబయాటిక్స్ ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల కోళ్లు, గొర్రెలు/మేకలు త్వరగా పెరుగుతాయనేది అపోహేనని మరో వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మల్లేశ్ చెప్పారు.

మానవులకు ప్రమాదమే

మాంసంలోని యాంటీబయాటిక్స్ అవశేషాలు మానవుల్లో చేరితే.. దీర్ఘకాలంలో ప్రమాదకరంగా మారుతాయని కిమ్స్ ఆస్పత్రిలో ఇంటర్నల్ మెడిసన్ స్పెషలిస్ట్ డాక్టర్ శివరాజ్ చెప్పారు. పశు, మత్స్య విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయంలోని లైవ్‌స్టాక్ ఉత్పత్తుల విభాగం పరిశోధనలో కూడా.. మాంసంలోని యాంటీబయాటిక్స్ వల్ల మానవుల్లో జీర్ణక్రియ సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు, నరాలకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని తేలింది. మాంసంలో ఉండే బీటా లాక్టమ్స్ కారణంగా చర్మవ్యాధులు వస్తాయని, టెట్రాసైక్లిన్ అవశేషాల కారణంగా గర్భంలోని పిండం సరిగా ఎదగక పోవడం, పిల్లల పళ్లపై మరకలు, పేగులలో సమస్యలు రావొచ్చని నిర్ధారణ అయ్యింది. పశువులు, కోళ్లలో వాడే పలు రకాల యాంటీబయాటిక్స్ వల్ల పలురకాల క్యాన్సర్లు కూడా వచ్చే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరించారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- మన రాష్ట్రంలో మాంసం వినియోగం ఎక్కువే..! చాలా మందికి ముక్కలేనిదే ముద్ద దిగదు. వేడుక ఏదైనా.. ముక్క ఉండాల్సిందే..! అయితే.. మాంసంలో యాంటీబయాటిక్స్ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు
- పాడి రైతులు పశువుల కొట్టాలు/పాకలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. తగినంత వెంటిలేషన్ ఉండేలా జాగ్రత్తపడాలి. దీని వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి
- పశువుల మేతలో యాంటీబయాటిక్స్ గ్రోత్ ప్రమోటర్లను వాడొద్దని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్ట్స్ ఆఫ్ పౌల్ట్రీ ఫీడ్ చేసిన హెచ్చరికలను పాటించాలి
- మాంసాన్ని వండడం.. శీతలీకరించే విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా ఉడికించడం ద్వారా బీటా లాక్టమేజ్, టెట్రాసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్ ప్రభావాన్ని తగ్గించవచ్చు
- ప్రభుత్వాలు కూడా ర్యాండమ్‌గా మాంసంలో యాంటీబయాటిక్స్ అవశేషాలపై పరీక్షలు నిర్వహించాలి

మైక్రోబియామ్‌పై ప్రభావం చూపుతున్నాయి



మాంసంలో యాంటీబయాటిక్స్ వల్ల మానవులకు కచ్చితంగా నష్టం జరుగుతుంది. పశువులు/కోళ్లకు ఇచ్చిన యాంటీబయాటిక్స్ ఏమిటనేది తెలిస్తే.. ప్రభావం ఎంతవరకు ఉంటుందో చెప్పవచ్చు. ఉదాహరణకు అజిత్రోమైసిన్ ప్రభావం వారాలు, నెలల వరకు ఉంటుంది. యాంటీబయాటిక్-మెటబాలిజాన్ని బట్టి ఈ ప్రభావం ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ ముప్పు పొంచి ఉంటుంది. అయితే.. తెలంగాణలో మాంసం వినియోగం ఎక్కువే. కానీ, ఇక్కడ యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ ప్రభావం ఎక్కువగా ఉందా? అంటే.. శాస్త్రీయ నిరూపణలు లేవు. మాంసంలో ఉండే యాంటీబయాటిక్స్ కారణంగా.. గట్ మైక్రోబియామ్(కడుపులో ఉండే మంచి బ్యాక్టీరియా)పై ప్రతికూల ప్రభావం ఉంటుంది. పలు రుగ్మతలు, మధుమేహం వంటి వ్యాధులకు ఇది కూడా ఓ కారణంగా చెప్పవచ్చు.

- డాక్టర్ శివరాజ్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్, కిమ్స్

పరిమితంగానే తీసుకోవాలి



తీసుకునే ఆహారంపై పరిమితి ఉండాలి. మాంసంతో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్ సహా కొన్ని పోషకాలు లభిస్తాయి. అయితే.. ఎక్కువగా తీసుకుంటే ప్రమాదం పొంచిఉంటుంది. మటన్ వినియోగం తక్కువగా ఉండాలి. చికెన్ రోజుకు గరిష్ఠంగా 50 గ్రాములు, వారానికి 200 గ్రాములకు పరిమితం చేసుకోవాలి. మాంసం వండే పద్ధతుల్లో మార్పులు అవసరం. యాంటీబయాటిక్స్ అవశేషాలు తొలిగిపోయేలా.. పోషకాలు ఏమాత్రం లోపించకుండా.. స్టీమ్డ్, గ్రిల్డ్ లాంటి పద్ధతులు ఒకవిధంగా మంచివే. బార్బిక్యూ లాంటి విధానాలు సరికాదు.

- డాక్టర్ ఎం.గాయత్రి, అపోలో ఆస్పత్రి డైటీషియన్

సింగరేణి సీఎండీ రేసులో శైలజా రామయ్యర్



పోస్టును కోరుకుంటున్న పలువురు ఐఏఎస్‌లు..

» ఇన్‌చార్జి సీఎండీ బలరామ్‌కు సమర్థుడిగా పేరు

» డిప్యుటేషన్‌ను పొడిగించడానికి కేంద్ర ప్రభుత్వం విముఖం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ పోస్టు కోసం పలువురు కీలక ఐఏఎస్‌లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.బలరామ్ కేంద్ర సర్వీసులకు చెందిన అధికారి. రాష్ట్రంలో ఆయన డిప్యూటేషన్ కాలం ముగిసిపోవస్తోంది. డిప్యూటేషన్‌ను పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు రావడంతో ఆ పోస్టును దక్కించుకోవడానికి పలువురు కీలక ఐఏఎస్‌లు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. రేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్ ముందు వరుసలో ఉన్నారు. 1997 బ్యాచ్‌కు చెందిన ఆమె సీఎండీ పోస్టును కోరుకుంటున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమె చేనేత శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈమెకు కోల్‌బెల్ట్‌పై పూర్తి స్థాయిలో పట్టుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సతీమణి కావడం ఆమెకు కలిసొచ్చే అంశం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అత్యధిక కాలం ఎన్.శ్రీధర్ సీఎండీగా ఉన్నారు. 9 ఏళ్లకు పైగా ఆయన సీఎండీ పోస్టులో కొనసాగారు. పలు సందర్భాల్లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతినిధులు కూడా సింగరేణి పాలక మండలి సమావేశంలో ఆయన పదవీ కాలం పొడిగింపుపై అభ్యంతరం వ్యక్తం చేసినా బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీధర్‌ను కొనసాగించింది. గత ప్రభుత్వంలోని కీలక పెద్దలకు ఆప్తుడిగా శ్రీధర్‌కు పేరుండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీ రాగానే శ్రీధర్‌ను తప్పించింది. ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. తాజాగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. శ్రీధర్‌ను తప్పించిన నాటి నుంచి ఎన్.బలరామ్ ఇన్‌చార్జి సీఎండీగా ఉన్నారు. ఆర్థిక రంగంపై బలరామ్‌కు బలమైన పట్టు ఉంది. సింగరేణి ఆర్థిక పరపతి పెంచడంలోనూ ఆయన పాత్ర కీలకమని అధికారులు చెబుతుంటారు. నిధుల సమీకరణలోనూ బలరామ్ దిట్ట. రాష్ట్రంలోని మరే కార్పొరేట్ కంపెనీలో లేని విధంగా సింగరేణి కార్మికులకు రూ.కోటి బీమాను బ్యాంకుల నుంచి వర్తింపచేయడంలో బలరామ్‌దే కీలక పాత్ర. దాంతో కొత్త సీఎండీగా ఐఏఎస్‌లకు అవకాశం ఇస్తారా? లేక కేంద్రాన్ని ఒప్పించైనా బలరామ్‌ను కొనసాగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

పోడు రైతుల సాగుకు సౌర విద్యుత్తు



» ప్రజావాణిని నిరంతరం కొనసాగిస్తాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్, బేటంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల గుర్తింపు చట్టం(రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్-2006) ప్రకారం పట్టాలు పొందిన పోడు రైతుల సాగుకు సౌర విద్యుత్తు(సోలార్ పవర్)ను అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రతి వ్యవసాయ పంపుసెట్‌కు కరెంటు ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజావాణిని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. పోడు రైతులకు సౌర విద్యుత్తును అందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలు, ఇబ్బందులను నేరుగా చెప్పుకోవడానికి ప్రభుత్వం ప్రజావాణిని ఏర్పాటు చేసిందన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజావాణి కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ కంప్యూటరైజ్ చేసి, సంబంధిత అధికారులకు పంపిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని 70 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిందని ఆయన విమర్శించారు. కాగా, ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 424 దరఖాస్తులు వచ్చాయి.

ఏఐలో ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్

» సిలికాన్ సిటీనే హైదరాబాద్‌కు రప్పిస్తాం

» పరిశోధన, అభివృద్ధి రంగాలకు అనువైన ప్రదేశం: మంత్రి దుద్దిళ్ల



మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న యూఎస్ఐబీసీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

హైదరాబాద్, ఘట్‌కేసర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు, ప్రతిభావంతులైన మానవ వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉన్న హైదరాబాద్ నగరాన్ని కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో ప్రపంచ గమ్యస్థానంగా అభివృద్ధి చేయగలిగామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. యూఎస్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యూఎస్ఐబీసీ), తెలంగాణ రాష్ట్రం మధ్య మంగళవారం సచివాలయంలో జరిగిన ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలోని దిగ్గజ ఐటీ, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ జీసీసీలు ఇక్కడ ఉన్నాయని, భవిష్యత్తులో సిలికాన్ సిటీనే హైదరాబాద్‌కు రప్పించాలన్న సంకల్పం తమకుందని వివరించారు. ఇక్కడ పరిశోధన, అభివృద్ధి రంగాలకు కూడా అనువైన వాతావరణం ఉందని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడంలో హైదరాబాద్‌ను భాగస్వామిగా చేయాలని కోరారు. ఏఐ రంగంలో దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందు ఉండేందుకు 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, విద్యుత్తు, బ్యాంకింగ్, పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించి హైదరాబాద్‌లో అత్యంత అనుకూల వాతావరణం నెలకొల్పామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లారెన్స్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, యుఎస్ఐబీసీ ఎండీ రాహుల్ శర్మ, సీనియర్ డైరెక్టర్ ఆదిత్య కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య

రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మునిసిపాలిటీ కొండాపూర్‌లో హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఆధ్వర్యంలో రూ.7.94 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఐటీఐ మహిళా కళాశాల ప్రారంభోత్సవం, ఘట్‌కేసర్‌లోని గురుకుల కళాశాలలో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

రాహుల్ గాంధీతో సీతక్క భేటీ

తెలంగాణలో రాజకీయ పరిస్థితులపై చర్చ

ఎంపీ ప్రియాంకకు మంత్రి శుభాకాంక్షలు



న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమావేశమయ్యారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీని కలిసి రాష్ట్ర రాజకీయాలు, ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనపై సీతక్క రాహుల్ గాంధీకి వివరించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని ఎన్నో పనులను ఏడాదిలోనే చేసి చూపించామని చెప్పారు. ప్రజాపాలన విజయోత్సవాలు ఎలా జరిగాయి? ప్రజల స్పందన ఎలా ఉంది? వంటి విషయాలను రాహుల్ గాంధీ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. జన గణన కార్యక్రమ వివరాలపైనా ఆరా తీశారు. సీతక్క మంత్రిగా ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల పనితీరుపై రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. అనంతరం పార్లమెంట్ ఆవరణలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీని సీతక్క కలిశారు. ఇటీవలే ప్రియాంక వయనాడ్ ఎంపీగా గెలిచినందున శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా 78 పీహెచ్‌సీలు!

» 220 సబ్ సెంటర్లు కూడా..

» రూ.350 కోట్లతో ఏర్పాటుకు సర్కారు నిర్ణయం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలందించే ఆస్పత్రుల సంఖ్యను పెంచబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 78 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), 220 సబ్ సెంటర్లను ఏర్పాటు చేయబోతోంది. అలాగే కొత్తగా మరికొన్ని బస్తీ దవాఖానాలను కూడా అందుబాటులోకి తీసుకురానుంది. సంబంధిత ప్రతిపాదనలను వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సిద్ధం చేశారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.350 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆర్థికశాఖ అనుమతుల కోసం కూడా పంపినట్లు సమాచారం. కొత్తగా ఏర్పాటు చేయబోయే పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లను గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. కొన్నింటిని బొగ్గు గనుల ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది.

జనాభా సంఖ్య ఆధారంగా..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 636 గ్రామీణ, 249 పట్టణ పీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే 4693 సబ్‌సెంటర్లు ఉన్నాయి. గతంలో వీటి ఏర్పాటుకు ఒక ప్రాతిపదిక అంటూ లేకపోయింది. స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో వారివారి సొంత గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు కొందరికి చాలా సమీపంలో ఉంటే.. మరికొందరికి 25-30 కిలోమీటర్ల దూరంలో ఉండిపోయాయి. మరికొన్ని చోట్ల క్షేత్రస్థాయి ఆస్పత్రులు పక్కపక్కనే ఉంటున్నాయి. ఉదాహరణకు కోఠీలో రెండు పట్టణ పీహెచ్‌సీలు ఒకే భవనంలో ఉన్నాయి. ఒకటి సుల్తాన్‌బజార్ యూపీహెచ్‌సీ కాగా, మరొకటి ఇస్లామియా బజార్ యూపీహెచ్‌సీ. వీటికి సరిగ్గా 50 మీటర్ల దూరంలో కోఠీలోని ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మరో యూపీహెచ్‌సీ కూడా ఉంది. విచిత్రం ఏమిటంటే.. దాని పక్కనే ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఉంది. ఇలా వంద మీటర్ల పరిధిలో 3 యూపీహెచ్‌సీలు, ఒక ప్రభుత్వాస్పత్రి ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు చాలా చోట్ల ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన, దూరాన్ని బట్టి సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి 25-30 కిలోమీటర్లకు ఓ ఆస్పత్రి ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేయలే..

రాష్ట్రంలో కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పడగా.. వాటికి తగ్గట్లుగా పీహెచ్‌సీలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ 40కి పైగా మండలాల్లో పీహెచ్‌సీలు లేవు. ప్రభుత్వాలు మాత్రం జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటు చేశామని గొప్పగా చెబుతున్నాయి. కానీ, ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు ప్రజలు బోధనాస్పత్రులకు వెళ్లలేరు. స్థానిక సబ్ సెంటర్లకే వెళ్తారు. 2012 నాటి ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్ఎస్) నివేదిక ప్రకారం గిరిజన ప్రాంతాల్లో 20 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ ఉండాలి. మైదాన ప్రాంతాల్లో ప్రతి 30 వేల మందికి ఒకటి ఉండాలి. ఆ లెక్కన రాష్ట్రంలో కనీసం 1400 పీహెచ్‌సీలు ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 885 పీహెచ్‌సీలే ఉన్నాయి. రాష్ట్ర జనాభాలో 51 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో, 49 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పీహెచ్‌సీలన్నీ గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేశారు. కానీ, కొన్ని పీహెచ్‌సీలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల ఏర్పాటు ఒక శాస్త్రీయ పద్ధతిలో జరగలేదు. హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాల్లోని సర్కారీ ఆస్పత్రుల్లో ఎక్కువ మంది వైద్యులు, సిబ్బంది ఉంటుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో కనీస స్థాయిలో సిబ్బంది ఉండట్లేదు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య సిబ్బందిని హేతుబద్ధీకరించి; పీహెచ్‌సీ, సబ్ సెంటర్లను పెంచాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

15, 16 తేదీల్లో గ్రూపు-2 పరీక్షలు!

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి 15వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రాష్ట్రంలో 783 ఖాళీ గ్రూపు-2 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టుల కోసం సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే అభ్యర్థులకు సంబంధించిన హాల్‌టికెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పరీక్షల నిర్వహణలో భాగంగా డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఏబిలిటీస్ పరీక్షను నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పేపర్-2లో భాగంగా చరిత్ర, పాలిటి, సొసైటీ పరీక్షను, 16వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-3లో భాగంగా ఎకానమి అండ్ డెవలప్‌మెంట్ పరీక్షను, అదే రోజు సాయంత్రం 3 నుంచి 5.30 గంటల వరకు పేపర్-4లో భాగంగా తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయం కంటే 30 నిమిషాల ముందుగానే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు రావాల్సి ఉంటుంది. ఆ తర్వాత గేట్లను మూసివేస్తారు. అన్ని పరీక్షలకు ఒకే హాల్‌టికెట్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా హెల్ప్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

ములుగు జిల్లాలో పెద్దపులి సంచారం

వెంకటాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని బోదాపురం, ఆలుబాక గ్రామశివారుల్లో పెద్దపులి సంచారం కలకలం రేపింది. బోదాపురం, ఆలుబాక గ్రామాల శివారుల్లోని గోదావరి లంకల్లో ఉన్న పుచ్చతోట వద్ద సోమవారం రాత్రి పెద్దపులి సంచరించిందని ఆ గ్రామాల ప్రజలు తెలిపారు. దాని గాండ్రింపులు విన్నామని పలువురు రైతులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ఆ ప్రాంతంలో పరిశీలించగా దాని కాలి వేలిముద్రలను కనిపించడంతో అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించి కాలి వేలిముద్రలను గుర్తించినట్లు వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రమౌళి తెలిపారు.

మామునూరు విమానాశ్రయాన్ని రెండేళ్లలో పూర్తి చేయండి: ఎంపీ కావ్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి):మామునూరు విమానాశ్రయ పనులు త్వరగా ప్రారంభించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును ఎంపీ కడియం కావ్య కోరారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండేళ్లలో మామునూరు విమానాశ్రయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో రామ్మోహన్ నాయుడుతో ఆమె సమావేశమయ్యారు. మరోవైపు తెలంగాణలో అమృత్ టెండర్లలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినా కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నించారు. రాజ్యసభలో కేంద్రాన్ని ప్రశ్నిద్దామంటే సభ జరిగే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అమృత్ టెండర్ల అవినీతిపై కేంద్ర మంత్రి ఒకరికి కేటీఆర్ ఫిర్యాదు చేశారని, కానీ కేంద్రం నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. మోదీ- అదానీ ఫొటోలున్న టీషర్టులతో రాహుల్ నేతృత్వంలో పార్లమెంట్‌లో ఆందోళన చేయొచ్చు కానీ, అదే కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం అదానీ- రేవంత్ ఫొటోలతో అసెంబ్లీలోకి రానివ్వడం లేదని, ఇదెక్కడి న్యాయమని వద్దిరాజు ప్రశ్నించారు.

నీట్ సాధనకు 'కోటా' బుక్‌లెట్‌లు సిద్ధం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నీట్- 2025కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' టెస్టు సిరీస్‌లు, సొల్యూషన్లు, స్టడీ మెటీరియల్, గ్రాండ్ టెస్టులు, ప్రాక్టీసు కోసం కోటా పూర్వ టెస్టులతో పాటు సొల్యూషన్ల(డిజిటల్) బుక్‌లెట్స్ సిద్ధం చేసినట్లు ఐఐటీ- జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్లను మొబైల్ వెర్షన్‌లో వాట్సప్ ద్వారా పొందవచ్చని, మరింత సమాచారం కోసం "NEET&2025' అని 98490-16661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించింది.

శబరిమలకు మరో 10 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రికుల కోసం మరో 10 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 11 నుంచి 28 వరకు ఈ ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి కొల్లాం మార్గంలో ఈ నెల 19, 26వ తేదీల్లో, కొల్లాం నుంచి సికింద్రాబాద్‌కు 21, 28వ తేదీల్లో ప్రయాణికులకు ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షించారు. రాష్ట్రపతి బస కోసం తగిన రీతిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 24 గంటల పాటు స్నేక్ క్యాచర్స్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని, పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని చెప్పారు. కాగా, 21వ తేదీ వరకు ముర్ము రాష్ట్రంలో ఉండనున్నారు.

షరతులతో ఆర్జీవీకి ముందస్తు బెయిల్

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అనకాపల్లి జిల్లా రావికమతం, గుంటూరు జిల్లా తుళ్లూరు, ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్ హౌజ్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో)లకు 10వేల చొప్పున రెండు స్వీయ పూచీకత్తులు సమర్పించాలని ఆర్జీవీని ఆదేశించింది. పోలీసులు కోరినప్పుడు విచారణకు అందుబాటు లో ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం తీర్పు ఇచ్చారు. తీర్పు వెల్లడించిన అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. దర్యాప్తునకు ఆర్జీవీ సహకరించడం లేదని, పోలీసుల నోటీసులకు స్పందించడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ముందస్తు బెయిల్ రద్దు కోసం చర్యలు తీసుకోవచ్చన్నారు.

పోలీసులు నా ఐఫోన్ లాక్కున్నారు

- హైకోర్టులో పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తన ఐఫోన్ 14 ప్రో మ్యాక్స్ సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కుని తిరిగి ఇవ్వడం లేదని పేర్కొంటూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లంచ్‌మోషన్ రూపంలో హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు వాదిస్తూ.. ఈనెల 6న మాసబ్ ట్యాంక్ ఎస్‌హెచ్‌వో పరశురాం బలవంతంగా తన సెల్‌ఫోన్ లాక్కున్నారని ఆరోపించారు. దీనికి ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇస్తూ పిటిషనర్ కౌశిక్‌రెడ్డి, అతని అనుచరులు పోలీస్‌స్టేషన్‌లో అదుపు తప్పి వ్యవహరించారని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడుతున్న నేపథ్యంలో అతడి సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఇది అంత తీవ్రమైన కేసు కాదని తెలిపింది. అయినా పోలీసులు ఫోన్ తీసుకున్న విధానం సరికాదని పేర్కొంది. పోలీసులు ఫోన్ తిరిగి ఇవ్వాలని లేదంటే మధ్యంతర ఉత్తర్వులు జారీచేస్తామని వ్యాఖ్యానించింది. దీనిపై పోలీసుల వైఖరి తెలియజేయాలని పేర్కొంటూ విచారణను 12కు వాయిదా వేసింది.

సిరియాపై.. ఇజ్రాయెల్ ముప్పేట దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన వాహనాలు



పలాయనం చిత్తగించగానే.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) దాడులను మొదలు పెట్టింది. ఈ మూడ్రోజుల్లో కామిష్లీ, షిన్షార్ వైమానికదళ స్థావరాలతోపాటు.. అక్బరా ఎయిర్‌పోర్టుపై వైమానిక దాడులు జరిపింది. ఆదివారం 300కుపైగా.. సోమవారం 100కుపైగా జరిపిన దాడుల్లో ఎయిర్‌బేస్‌లలోని యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు ధ్వంసమయ్యాయి. కీలకమైన మిలటరీ బేస్‌లు, ఆయుధాగారాలు, రాడార్ సెంటర్లు, క్షిపణి క్షేత్రాలను రసాయన ఆయుధాగారాల పేరుతో ధ్వంసం చేసింది. మంగళవారం కూడా డమాస్కస్‌తో పాటు.. శివార్లలోని కునిత్రా, హోమ్స్, హమా, లటాకియా, ఖమిష్లీల్లోనూ ఇజ్రాయెల్ బాంబింగ్ కొనసాగింది. ఈ దాడుల్లో హమాలోని మస్యాల్‌లో ఉన్న శాస్త్రీయ పరిశోధన కేంద్రాలు, జమ్రాయా, బర్జేహ్ ప్రాంతల్లో ఆవాస ప్రాంతాలు ధ్వంసమైనట్లు సిరియా భద్రత బలగాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ ఆదివారం సాయంత్రమే.. గోలాన్‌హైట్స్‌లోని బఫర్‌జోన్‌లోకి చొచ్చుకువెళ్లింది. 400 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న బఫర్‌జోన్‌లో భారీ ఎత్తున యుద్ధ ట్యాంకులను మోహరించింది. ఇజ్రాయెల్ సేనలు డమాస్కస్‌కు 25 కిలోమీటర్ల దూరంలోని ఖతానా పట్టణం వరకు చొచ్చుకుని వెళ్లాయని అల్-జజీరా ఓ కథనాన్ని ప్రసారం చేసింది. ఖతానా నగరం బఫర్‌జోన్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు వివరించింది. రాయిటర్స్ కూడా సిరియా భద్రతాదళాలను ఉటంకిస్తూ.. ఇదే విషయాన్ని ప్రచురించింది. కల్లోల సిరియాపై ఇజ్రాయెల్ బాంబింగ్‌ను ఈజిప్టు, సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే, ఇరాన్ తీవ్రంగా ఖండించాయి. 1974 నాటి ఒప్పందానికి ఇజ్రాయెల్ తూట్లు పొడిచిందంటూ మండిపడ్డాయి. అయితే.. ఇజ్రాయెల్ మాత్రం తమ సేనలు బఫర్‌జోన్‌ను దాటలేదని స్పష్టం చేశాయి. ఇజ్రాయెల్ చర్యలపై ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో సిరియా ప్రతినిధి భద్రతామండలికి ఫిర్యాదు చేయగా.. తాము సిరియా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదని ఇజ్రాయెల్ ప్రతినిధి డానీ డానన్ వివరణ ఇచ్చారు. తమ దేశ భద్రతపైనే ఐడీఎఫ్ దృష్టిసారించిందని పేర్కొన్నారు. మరోవైపు సిరియాలో అమెరికా దాడులపైనా విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. దీనిపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ వివరణ ఇస్తూ.. సిరియాలోని ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) శిబిరాలపైనే దాడులు జరిపినట్లు స్పష్టం చేశారు.

కొలువుదీరిన ఆపద్ధర్మ సర్కారు

తిరుగుబాటు దళాలకు నేతృత్వం వహించిన హయత్ తహ్రీర్ అల్-షామ్(హెచ్‌టీఎస్) ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు సాల్వేషన్ ప్రభుత్వ అధినేతగా సేవలందించిన మహమ్మద్ అల్-బషీర్ నేతృత్వంలో మంగళవారం సిరియా ఆపద్ధర్మ సర్కారు కొలువుదీరింది. ఈ ప్రభుత్వం మూణ్నెల్లపాటు కొనసాగుతుంది. ఆలోగా ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తిస్థాయి సర్కారు ఏర్పాటు దిశగా అల్-బషీర్, ఆయన క్యాబినెట్ మంత్రులు(సాల్వేషన్ ప్రభుత్వంలోని సలహాదారులు) కృషిచేస్తారు. ఈలోగా పారామిలటరీని రద్దు చేసి, భద్రత బలగాల్లో విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ఆపద్ధర్మ సర్కారుకు ప్రస్తుత ప్రధాని జలాలీ సహకరిస్తున్నారు. కాగా.. సిరియాలోని జైళ్లలో తమవారి కోసం పౌరులు గాలింపు చేపడుతున్నారు. నిజానికి 2011లో సిరియా జనాభా 2.1 కోట్లు కాగా.. అసద్ సర్కారు క్రూరత్వానికి 5 లక్షల మందికి పైగా బలయ్యారు. మరో 10 లక్షల మంది దివ్యాంగులుగా మారారు. 1.3 కోట్ల మంది విదేశాల్లో శరణార్థులుగా ఉన్నారు. వారంతా తిరిగి రావాలని ఆపద్ధర్మ ప్రభుత్వం పిలుపునిచ్చింది.



తైవాన్ తీరంలో 90 చైనా యుద్ధ నౌకలు!

(మొదటి పేజీ తరువాయి)

రంగంలోకి దించింది. చైనా తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడుతూనే ఉంటుంది. నౌకాదళంతో విన్యాసాలు చేస్తుంటుంది. అయితే ఈ సారి పెద్దఎత్తున నౌకలను మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జపాన్ దక్షిణ ఐలాండ్స్ నుంచి దక్షిణ చైనా సుమద్రం వరకు చైనా తన యుద్ధనౌకలను మోహరించిందని తైవాన్ రక్షణ శాఖ అధికార ప్రతినిధి సన్‌లీ ఫాంగ్ మంగళవారం తెలిపారు. ఇది 2022లో చేసిన మోహరింపు కంటే చాలా ఎక్కువన్నారు. గతంలో చేసిన విన్యాసాల కంటే అత్యధిక స్థాయిలో యుద్ధనౌకలను మోహరించడాన్ని ముప్పుగానే పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిసారి మొత్తం తైవాన్ తీరాన్నే లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోందన్నారు. తైవాన్ తూర్పు తీరంలో దాదాపు గోడ కట్టినట్లుగా చైనా నౌకలను మోహరించిందని తైవాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. అయితే ఏడు రిజర్వ్‌డ్ జోన్లలో మాత్రం ఎలాంటి ఫైర్ డ్రిల్స్ చేయలేదన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తైవాన్ ఆర్మీ ప్రకటించింది. వ్యూహాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే యుద్ధసన్నద్ధత కార్యకలాపాలు చేపట్టినట్లు తెలిపింది.

అమెరికా పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్

- ట్రంప్ క్యాబినెట్‌లో మరో ఇండియన్ అమెరికన్‌కు ఉన్నత పదవి



వాషింగ్టన్, డిసెంబరు 10: అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ తన క్యాబినెట్‌లో కీలక పదవులకు భారత సంతతి వ్యక్తులను ఎంపిక చేస్తున్నారు. తాజాగా భారతీయ అమెరికన్ సిక్కు న్యాయవాది హర్మీత్ కె. ధిల్లాన్(54)ను అమెరికా న్యాయశాఖలో పౌర హక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా నామినేట్ చేశారు. ఈ పోస్టుకు హర్మీత్‌ను ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ప్రకటించారు. చండీగఢ్‌కు చెందిన హర్మీత్ చిన్నతనంలోనే ఆమె కుటుంబం అమెరికాకు వలసపోయి నార్త్ కరోలినాలో స్థిరపడింది. డార్ట్‌మౌత్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన ఆమె, యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా లా స్కూల్ నుంచి న్యాయశాస్త్రం అభ్యసించారు. యూఎస్ ఫోర్త్ సర్క్యూట్ ఆఫ్ అప్పీల్స్‌లో క్లర్క్‌గా పనిచేశారు. గతేడాది రిపబ్లికన్ నేషనల్ కమిటీ చైర్మన్ పదవికి పోటీ చేసి ఓడిపోయారు.


పుట్టుకతో పౌరసత్వ హక్కును రద్దు చేస్తా

- పాలన పగ్గాలు చేపట్టగానే ఉత్తర్వు: డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్, డిసెంబరు 10: ప్రస్తుతం అమెరికాలో అమల్లో ఉన్న 'పుట్టుకతో పౌరసత్వ హక్కు'ను.. తాను పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే తొలగిస్తానని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం.. ఆ గడ్డపై పుట్టే ప్రతి ఒక్కరికీ ఆ దేశ పౌరసత్వం వస్తుంది. పర్యాటక/విద్యార్థి/ఉద్యోగ వీసాపై వచ్చేవారి పిల్లలకే కాదు.. ఆ దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారికి పుట్టే పిల్లలకు సైతం పౌరసత్వం ఇవ్వకుండా ఎవరూ అడ్డుకోలేరు. అలా ఇచ్చేయడం హాస్యాస్పదమని.. తాను అధ్యక్ష పదవి చేపట్టగానే దీనికి ముగింపు పలుకుతానని 'ఎన్‌బీసీ న్యూస్' వార్తా సంస్థ నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ట్రంప్ తేల్చిచెప్పారు.

ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం

- 'ఎక్స్'లో రష్యా విదేశాంగ శాఖ ట్వీట్



మాస్కో, డిసెంబరు 10: ఉక్రెయిన్‌లో తక్షణ కాల్పుల విరమణకు అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన పిలుపుపై.. రష్యా స్పందించింది. ఉక్రెయిన్‌పై చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని.. శాంతి నెలకొల్పడానికి దక్షిణాది దేశాలు, బ్రిక్స్ భాగస్వాములు చేసే ప్రయత్నాలను స్వాగతిస్తామని స్పష్టం చేసింది. ఈమేరకు.. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి, రష్యా ప్రెసిడెన్షియల్ ప్రెస్ సెక్రటరీ దిమిత్రీ పెస్కోవ్‌ను ఉటంకిస్తూ రష్యా విదేశాంగ శాఖ సోమవారం ఒక ట్వీట్ చేసింది. "ఉక్రెయిన్‌పై చర్చలకు రష్యా సిద్ధమని మా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. శాంతి నెలకొల్పే యత్నాలను స్వాగతించారు. కానీ, ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే.. చర్చలను తిరస్కరించింది ఉక్రెయినే. ఇప్పటికీ ఆ దేశం చర్చలకు నిరాకరిస్తూనే ఉంది. రష్యన్ నాయకత్వంతో ఎలాంటి ఒప్పందాలూ కుదుర్చుకోకూడదని.. జెలెన్‌స్కీ స్వీయ నిషేధం విధించుకున్నారు. చర్చలను పునఃప్రారంభించాల్సిన బాధ్యత ఆయనదే" అని ఆ ట్వీట్‌లో పేర్కొంది. అయితే.. దీనికన్నా ముందే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఒక ట్వీట్ చేశారు. యుద్ధంలో జరిగిన ప్రాణనష్టం వివరాలను తెలుపుతూ.. "ఇదీ యుద్ధం తాలూకా వాస్తవం. ఇదేదో ఒక కాగితం ముక్క మీద కొన్ని సంతకాలతో అంత సులువుగా ముగిసిపోదు. ఎలాంటి హామీలూ లేని కాల్పుల విరమణ ఒప్పందాలు మనలేవు. మళ్లీ ఎప్పుడైనా ప్రారంభమవుతాయి. పుతిన్ గతంలో ఇదే చేశారు. ఆయన యుద్ధపిపాసి" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.


అవినీతి ఆరోపణలపై విచారణకు నెతన్యాహు హాజరు

టెల్ అవివ్, డిసెంబరు 10: అవినీతి కేసులో విచారణ కోసం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ(75) మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. ఇలాంటి విచారణను ఎదుర్కొన్న తొలి సిట్టింగ్ ప్రధాని ఆయనే కావడం గమనార్హం. ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆయనను విచారణ జరిపింది. ఒక పక్క గాజాలో యుద్ధం జరుగుతుండగా, మరోవైపు కోర్టులోని బోనులో నాలుగు గంటల పాటు నిల్చొని సమాధానాలు ఇచ్చారు. మధ్యలో రెండుసార్లు మిలటరీ సెక్రటరీ వచ్చి మెసేజ్‌లు అందజేయడంతో విరామం తీసుకొని వార్ రూమ్‌కు వెళ్లి తగిన ఆదేశాలు ఇచ్చారు. ప్రధానిగా విధులు నిర్వర్తించేందుకు విచారణ సమయంలో విరామం ఇవ్వడం కూడా ఇదే ప్రథమం. తనపై వచ్చిన ఆరోపణలకు మీడియానే కారమణమని అన్నారు.

పన్నుల యుద్ధంలో విజేతలు ఉండరు



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్య



బీజింగ్, టొరంటో, డిసెంబరు 10: వాణిజ్య యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అన్నారు. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై ఏకంగా 60% మేర, కెనడా వస్తువులపై 25% మేర పన్నులను పెంచుతామని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో జిన్‌పింగ్ చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరిచుకొంది. చైనా తమ మేధోపర సంపదను దొంగిలిస్తోందని, అక్రమ వాణిజ్య విధానాలకు పాల్పడుతోందని ఎప్పటి నుంచో విమర్శలు చేస్తున్న ట్రంప్ దానికి ప్రతిగా పన్నులు పెంచాలని భావిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం బీజింగ్‌లో జరిగిన ఆర్థిక సంస్థల అధిపతుల సమావేశంలో ప్రసంగించిన జిన్‌పింగ్ స్పందించారు. "పన్నుల పోరులు, వాణిజ్య పోరాటాలు, సాంకేతిక పరిజ్ఞాన యుద్ధాలన్నవి చారిత్రక పరిణామాలు, ఆర్థిక సూత్రాలకు విరుద్ధంగా జరుగుతాయి. వీటిలో విజేతలు ఎవరూ ఉండరు" అని వ్యాఖ్యానించారు. అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని, సహకారాన్ని పెంచుకుంటామని తెలిపారు. మరోవైపు అక్రమ వలసలు, మాదకద్రవ్యాలను అరికట్టకపోతే కెనడా, మెక్సికోలపై పన్నులు పెంచుతామని కూడా ట్రంప్ హెచ్చరించారు. వాటికి ఆర్థిక సాయం చేసే బదులు అమెరికాలో రాష్ట్రాలుగా చేర్చుకుంటే మంచిదని అన్నారు. దీనిపై కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రూడో స్పందించారు. సోమవారం హలిఫాక్స్ వాణిజ్య మండలి సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ పాలనలో వాణిజ్యం సవాళ్లతో కూడుకొని ఉంటుందని చెప్పారు. జీవనం సులభతరం చేస్తామన్న హామీతో ట్రంప్ అధికారంలోకి వచ్చారని, కానీ కెనడా వస్తువులపై పన్నులు పెంచితే దాని ప్రభావం అమెరికా దక్షిణ సరిహద్దులోని ప్రజలపై ఉంటుందని తెలిపారు. అక్కడి వారు కెనడా నుంచి వస్తువులను ఉపయోగిస్తారని, పన్నులు పెంచితే ఆ భారాన్ని వారు మోయాల్సి ఉంటుందని చెప్పారు.

కెనడా గవర్నర్ ట్రూడో

- ప్రధాని ట్రూడోను ఉద్దేశించి ట్రంప్ సంబోధన

న్యూఢిల్లీ, డిసెంబరు 10: అక్రమ వలసలు, డ్రగ్స్ రవాణాపై తానెంత సీరియస్‌గా ఉన్నానో చెబుతూ అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు సుతిమెత్తగా హెచ్చరిస్తూ మరోసారి అదే పంచ్ వేసిరారు! ట్రూడోను ఉద్దేశించి కెనడా గవర్నర్ అని సంబోధించారు! కెనడా నుంచి వలసలు, డ్రగ్స్ రవాణాను అరికట్టకపోతే ఆ దేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తానంటూ ఇటీవల ట్రంప్ హెచ్చరిక చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ హెచ్చరిక ఆచరణ రూపం దాల్చితే కెనడా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర పరిణామం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో కెనడా ప్రధాని ట్రూడో హుటాహుటిన అమెరికా వెళ్లి ట్రంప్‌తో సమావేశమయ్యారు. డిన్నర్ సందర్భంగా వలసలు, డ్రగ్స్ రవాణాను అరికట్టడంలో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాల్సి ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ నుంచి ఊహించని వ్యాఖ్యతో షాకైన ట్రూడో, ఆయన బృంద సభ్యులు ఏడ్వలేకనవ్వారు! అయితే తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెడుతూ ట్రూడోకు మరోసారి షాక్ ఇచ్చారు! "ఆ రోజు గొప్ప రాష్ట్రమైన కెనడాకు చెందిన గవర్నర్ ట్రూడోతో కలిసి డిన్నర్ చేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆ గవర్నర్‌తో మరోసారి సమావేశమయ్యేందుకు ఎదురుచూస్తున్నాను. కెనడా నుంచి అక్రమ వలసలు, డ్రగ్స్ రవాణాపై సుదీర్ఘంగా చర్చించాలనుకుంటున్నాను' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

గుడిసె కాదు.. యుద్ధ ట్యాంకు!

ఉక్రెయిన్ దాడుల నుంచి తన యుద్ధ ట్యాంకుల రక్షణకు రష్యా తిప్పలు

- ప్లై వుడ్ షీట్లు, డ్రోన్ జామర్లతో కాపాడుకునే ప్రయత్నం
- 'టర్టిల్ ట్యాంకుల'ని ఎగతాళి చేస్తున్న ఉక్రెయిన్ సేనలు



న్యూఢిల్లీ, డిసెంబరు 10: రెండున్నరేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తూ....నే ఉన్న రష్యాకు కొత్త కష్టం వచ్చిపడింది! ఆ దేశం వాడుతున్న టీ-90 యుద్ధ ట్యాంకులను.. ట్యాంకు విధ్వంసక క్షిపణులతో ఉక్రెయిన్ తునాతునకలు చేస్తుండడంతో వాటిని కాపాడుకోవడానికి రకరకాల అమరికలతో నానా తంటలూ పడుతోంది. తన ట్యాంకులకు ప్లైవుడ్ షీట్లు, రూఫ్ ప్యానెలింగ్ రేకులతో, ఇనప చువ్వలతో రక్షణ కవచాన్ని కడుతోంది. దాంతో అవి ట్యాంకుల్లా కాకుండా కదిలే ఇళ్లలాగా కనిపిస్తున్నాయి. కవచంలో ఉన్న తాబేలులా కనిపిస్తున్న ఆ ట్యాంకులను.. ఉక్రెయిన్ సైనికులు 'టర్టిల్ ట్యాంకులు' అని పిలుస్తూ ఎగతాళి చేస్తున్నారు. యుద్ధరంగంలో రష్యా మూడు రకాల యుద్ధ ట్యాంకుల్ని వాడుతోంది. అవి.. టీ-72, టీ-80, టీ-90 ట్యాంకులు. శత్రుసైనికులపై నిరంతరాయంగా కాల్పులు జరపడానికి వీలుగా.. ఈ ట్యాంకుల్లో 'ఆటోలోడర్' సదుపాయం ఉంటుంది. అంటే.. ఒకసారి కాల్పులు జరిపాక, వాటిలో అమ్యూనిషన్ (మందుగుండు) పెట్టడానికి మనుషులు అక్కర్లేదు. ఒక షెల్ ఫైర్ అయిన తర్వాత.. దాని స్థానంలో మరో షెల్ లోడ్ అవుతుంది. రెండోది కూడా పేలాక.. మూడోది లోడ్ అవుతుంది. ఆ సదుపాయమే రష్యా యుద్ధ ట్యాంకులకు పెనుముప్పుగా మారింది. ఎందుకంటే.. మామూలు యుద్ధ ట్యాంకుపైకి.. క్షిపణులను ప్రయోగిస్తే అవి దెబ్బతిన్నా, వాటిని బాగుచేసి మళ్లీ వాడుకునే అవకాశం చాలా సందర్భాల్లో ఉంటుంది. కానీ, ఆటోలోడర్ ట్యాంకుల్లో అమ్యూనిషన్ మొత్తాన్నీ టర్రెట్‌లోనే ఉంచడం వల్ల.. క్షిపణులు లేదా డ్రోన్లతో ఆ ట్యాంకులను పేల్చినప్పుడు.. టర్రెట్ లోపల ఉన్న షెల్స్ అన్నీ పేలిపోతాయి. ఆ వరుస పేలుళ్ల దెబ్బకు ట్యాంకు ముక్కలైపోతుంది. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపే.. ట్యాంకులో ఉన్న సైనికులు మాడిమసైపోతారు. రష్యా ట్యాంకుల్లో ఉన్న ఈ లొసుగు గురించి తెలుసుకున్న ఉక్రెయిన్.. జావెలిన్, ఎన్‌లా, స్టుగ్నా వంటి ట్యాంకు విధ్వంసక క్షిపణులతో, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. దీంతో, రష్యా తన ట్యాంకులను రక్షించుకోవడానికి ఇలా రకరకాల ఏర్పాట్లు చేస్తోంది. అయితే, వీటివల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. యుద్ధట్యాంకులకు ఉండే పలు ప్రయోజనాలు.. ఈ కొత్త అమరికల వల్ల రష్యా టీ-90లకు లేకుండా పోతున్నాయి. టర్రెట్ చుట్టూ అమర్చిన రక్షణ కవచం వల్ల ఆ ట్యాంకుల తాలూకా గన్ కదలికలు ఒక వైపునకు మాత్రమే పరిమితమైపోయాయి. వేరే వైపు కాల్పులు జరపాలంటే.. ట్యాంకు మొత్తం ఆ వైపునకు తిరగాల్సిందే. అలాగే, ఈ అమరికల వల్ల.. ట్యాంకులోపల ఉండే సైనికులు కేవలం తమ ముందు ఏముందో మాత్రమే చూడగలుగుతారు. ట్యాంకుల్ని ఇలా తయారుచేయడం వల్ల సైనికుల్లో స్థైర్యం దెబ్బతింటుంది.

భారత్ ముందు జాగ్రత్త..

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా వాడుతున్న టీ-90 ట్యాంకులు, దానికి ముందుతరంవైన టీ-72 యుద్ధట్యాంకులు భారతదేశం వద్ద కూడా ఉన్నాయి. మన వద్ద 2400కు పైగా టీ72 యుద్ధట్యాంకులు, దాదాపు 1600 టీ-90 యుద్ధట్యాంకులు ఉన్నాయి. అయితే, ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఈ ట్యాంకులకు పడుతున్న గతి నేపథ్యంలో.. మన సైన్యం అప్రమత్తమైంది. 2030 నాటికి 1770 'ఫ్యూచర్ రెడీ కంబాట్ వెహికల్స్‌ను (ఎఫ్ఆర్‌సీవీలు)" టీ-72ల స్థానంల నియోగించడానికి ఆర్మీ పెట్టిన ప్రతిపాదనలను రక్షణ శాఖ ఆమోదించింది. ఈ మెగా ప్రాజెక్టు విలువ దాదాపు రూ.60 వేల కోట్లు. ఎఫ్ఆర్‌వీసీల్లో డ్రోన్లు, యాంటీ ట్యాంక్ మిసైళ్ల దాడుల నుంచి రక్షణ కల్పించే 360 డిగ్రీల 'యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్', కృత్రిమ మేధ వంటి అధునాతన ఫీచర్లు ఉండనున్నట్టు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.